భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM

నూతన సిఇసి, ఇసిలపై ఆశలు, భయాలు
'వారిపై' అసంతృప్తి ఎందుకు?
మొదటి దశలో చివరి అంకం
ఆరుగురు బందీలు, 620 మంది ఖైదీలు మార్పిడి
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 86 | ఆదివారం | 23-02-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో ప్రమాదం






- 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయిన పెకప్పు
- సొరంగ మార్గంలో చిక్కుకున్న 8 మంది
- ఘటనా స్థలిని పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి
- చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నామని వెల్లడి
- ప్రమాదంపై సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- ఫోన్‌లో ఆరాతీసిన ప్రధాని మోదీ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి

శ్రీశైలం ఎడుమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బిసి టన్నెల్) సొరంగ మార్గంలో శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రమాద స్థలిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లారని, 8.30 గంటలకు బోరింగ్ మిషన్ ఆన్ చేశారన్నారు. టన్నెల్‌లో ఒక వైపు నుంచి నీరు లీకై మట్టి కుంగి పెద్ద శబ్దం రాగా, టిబిఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారని చెప్పారు. వెంటనే అప్రమత్తమై 42 మంది కార్మికులు తరువాయి 2లో

## సహాయక చర్యలు వేగవంతం

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ పనుల్లో చోటుచేసుకున్న ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టన్నెల్ వద్ద పై కప్పు కూలి పలువురికి గాయాలైనట్లు సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్‌పి వైభవ్ గైక్వాడ్‌తో పాటు అగ్నిమాపక శాఖ,హైడ్రా, ఇరిగేషన్ విభాగం అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు అందించాలని సిఎం ఆదేశించారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు అధికారులు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలన్నారు. సొరంగం(టన్నెల్) లోపల చిక్కుకున్న 8మంది తరువాయి 2లో

## సహకరిస్తాం

ప్రధాని నరేంద్రమోదీ హామీ

ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తామని వెల్లడి



ఎస్‌ఎల్‌బిసి ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి ప్రధానికి సిఎం పూర్తి వివరాలను వివరించారు. ఘటన చోటు చేసుకున్న సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టామని ప్రధానికి తెలిపారు. సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సహాయక చర్యలకు సంబంధించి పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ సిఎంకు హామీ ఇచ్చారు. వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తామని ప్రధాని తెలిపారు.

## కుల గణన లెక్కల్లో తప్పులు చూపాలి

కెసిఆర్, కెటిఆర్, హరీశ్, బండి, కిషన్‌రెడ్డిలకు సిఎం రేవంత్‌రెడ్డి సవాల్



- తప్పుడు లెక్కలంటూ నివేదికను బుట్టదాఖలు చేసేందుకు కుట్ర
- తప్పుడు ఆరోపణలు చేస్తే బిసిలు శాశ్వతంగా నష్టపోతారు
- తెలంగాణ ప్రభుత్వం తరహా ఇంతకంటే పకడ్బందీ ప్రక్రియతో కులగణన చేపట్టే రాష్ట్రం లేదు
- నా శక్తి మేరకు నిర్వహించా .. కంచెవేసి కాపాడుకోవాలి
- చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే సమగ్ర కుటుంబ సర్వే ఇది
- బిఆర్‌ఎస్, బిజెపిలు బట్ట కాల్చి మీదవేస్తున్నారు
- కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలి
- ముఖ్యమంత్రి డిమాండ్
- బిసి ఎమ్మెల్సీలు, నాయకులతో సిఎం, డిప్యూటీ సిఎం భట్టి సమావేశం

> గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు 70 ముస్లిం కులాలను ఒబిసిలలో చేర్చానని, దీనిని ఎప్పుడూ ప్రచారం చేసుకోలేదని స్వయంగా ప్రధాని నరేంద్రమోదీనే చెప్పారు. కులగణన లెక్కల్లో ముస్లింలను తీసుకొచ్చి బిసిలలో కలిపినట్టు కేంద్రమంత్రి బండి సంజయ్ నాపై ఆరోపణలు చేశారు. మరి మోదీ విషయంలో ఎలా స్పందిస్తారు? కులగణన విషయంలో నాపై కనిపించని ఎన్నో ఒత్తిళ్లు ఉన్నాయి. ఏదో ఒక రకంగా లెక్కలు పక్కన పెట్టాలని, వాయిదా వేయాలని తీవ్ర ఒత్తిడి ఉంది. బిసిల లెక్కలు బయటపెడితే భవిష్యత్‌లో రాజకీయపరంగా ఇబ్బందులు ఉంటాయని చెప్పినా నేను వినలేదు. కులగణన చరిత్రలో నిలిచిపోయే ఒక గొప్ప అవకాశం. రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను, ఆయన ఆదేశాలను అమలు చేయడమే నా ధర్మం.

ప్రజాపక్షం/హైదరాబాద్

కులగణన లెక్కలు తప్పు అంటూ తప్పుడు ఆరోపణలు చేస్తే, 'మనవాళ్లు(బిసి సామాజిక వర్గాలు, కాంగ్రెస్‌లోని బిసి నాయకులు) మౌనంగా ఉంటే శాశ్వతంగా' నష్టపోతారని, ప్రస్తుత లెక్కలను పక్కన పెడితే, ఇక ఏ రాష్ట్రం కూడా లెక్కలు తీసేందుకు ముందుకు రాబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం లెక్కలు పక్కా తీస్తేనే, మిగతా రాష్ట్రాలకు, ముఖ్యమంత్రులకు విధిలేని పరిస్థితులు వస్తాయని, మోదీ కూడా లెక్కల సేకరణ చేయక తప్పని అనివార్య పరిస్థితిని కలిపించాలని సూచించారు. కులగణన లెక్కలు ఎక్కడ తప్పుగా ఉన్నాయో చూపాలని కెసిఆర్, హరీశ్‌రావు, కెటిఆర్, బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు సిఎం సవాల్ విసిరారు. తప్పుడు లెక్కలు అంటూ నివేదికను బుట్టదాఖలు చేసేందుకు కుట్ర జరుగుతోందని విమర్శించారు. కులగణన విషయంలో మార్చి 10లోపు ఆయా కులాల వారీగా సమావేశాలను, సదస్సులను నిర్వహించి, వారి అభిప్రాయాలను, వారు కోరుకుంటున్న తరువాయి 2లో



పౌడర్ పాలు వికటించి కవలలు మృతి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాద ఘటన

03



మాతాశిశు కేంద్రంలో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోయాయని బంధువుల ఆరోపణలు
- పెద్దపల్లి జిల్లా మాతాశిశు ప్రసూతి కేంద్రంలో ఘటన

03



బిఆర్‌ఎస్.. బిజెపి లోపాయికారీ ఒప్పందం

- మంత్రి కొండా సురేఖ

12

మద్యం దుకాణాలు తెరవడం వల్లే.. ప్రజాగ్రహానికి గురైన కేజ్రీవాల్

- సామాజిక కార్యకర్త అన్నా హజారే

05

## శిశుసంక్షేమ శాఖలో కొలువుల జాతర

- 14,236 పోస్టులకు గ్రీన్ సిగ్నల్
- 6,399 అంగన్‌వాడీ టీచర్లు, 7,837 హెల్పర్ పోస్టులు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా, శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర ప్రారంభం కానుంది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం సంబంధిత ఫైల్‌పై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్క సంతకం చేశారు. మొత్తం 14,236 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. 6,399 అంగన్‌వాడీ టీచర్లు, 7,837 హెల్పర్ల తరువాయి 2లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

- మద్దతివ్వాలని పిసిసి చీఫ్ లేఖ రాశారని కూనంనేని వెల్లడి
- స్నేహధర్మాన్ని పాటిస్తున్నట్లు ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆ నియోజవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న వి. నరేందర్ రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులైన ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తితో పాటు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తరువాయి 2లో

## తండ్రిపై కత్తితో తనయుడి దాడి

- అందరూ చూస్తుండగానే ఇసిఐఎల్ చౌరస్తాలో దారుణ హత్య
- ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందిన ఆరెల్లి మొగిలి
- వరుస హత్యలతో ఉలిక్కిపడుతున్న మేడ్చల్ జిల్లా



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

వరుస హత్యలతో మేడ్చల్ జిల్లా ఉలిక్కిపడుతోంది. వారంరోజుల క్రితం జరిగిన దారుణ హత్యలు మరువకముందే తాజాగా మరో హత్య జరిగింది. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో నిత్యం జనసందడితో ఉండే ఈసిఐఎల్ చౌరస్తా ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం తండ్రిని వెంటాడి కత్తితో దాడికి పాల్పడిన ఘటన రాచకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. లాలాపేట ప్రాంతంలోని ఇందిరానగర్‌లో నివసించే తరువాయి 2లో

## పెచ్చుమీరుతున్న హింసా ప్రవృత్తి



మాయమైపోతున్న మనలోని మనిషి

ఆర్థిక సంబంధాల మధ్య బలహీనపడుతున్న రక్తసంబంధాలు

ప్రజాపక్షం/ఖమ్మం

మానవ సంబంధాలు రాను రాను బలహీనపడి ఆర్థిక సంబంధాలే ప్రధానమవుతున్నాయి. రక్త సంబంధాలు, ఆస్తి గొడవలు, ఆరాచకాలకు అడ్డు రావడం లేదు. పవిత్రమైన ప్రేమ దారితప్పి హింసనే కోరుకుంటోంది. నిత్యం సమాజంలో జరుగుతున్న ఘటనలను పరిశీలిస్తే మనలోని మనిషి మాయమైపోయాడేమో అనిపిస్తుంది. ఎదుటి వాడు బాధపడుతుంటే మన కండ్ల వెంట కారే కన్నీరు డబ్బు, మద్యం మత్తుకు ఇంకిపోయిందేమో. లోపలి సానుభూతి భావన చచ్చిపోయిందేమో కానీ ఎదుటి వారి బాధలను, కష్టాలను ఆస్వాదించే రోజులు వచ్చాయి. ఎదుటి వాడు దాడి చేస్తేనో, ప్రమాదానికి గురై విలవిలలాడుతుంటే ప్రాణం కాపాడాలన్న భావన స్థానే విభిన్న కోణాల్లో ఆఖరి క్షణాల్లో కొట్టు మిట్టాడుతున్న తీరు సెల్‌ఫోన్‌లో బంధించి వికృత ఆనందం పొందుతున్నారు. సాటి మనిషికి సాయపడాలన్న ఆలోచన చచ్చిపోయి అది చేస్తే మనకు వచ్చింది ఏమిటి అన్న భావన పురుడు పోసుకుని కరోనా కంటే వేగంగా ప్రతి మనిషిని ఆవహిస్తున్నది. దాడులు, హత్యలు, ఆత్మహత్యలు, వెలివేతలు, బయటకు గెంటివేయటాలు దేనికి సంకేతాలుగా మారుతున్నాయి. క్షమించడం అన్న పదం దైనందిన జీవితం నుంచి కనుమరుగవుతున్నది. కోట్ల ఆస్తి వారసత్వంగా ఇచ్చిన తాత సంపాదించి ఏర్పాటు చేసిన సంస్థకు తనను యండి చేయలేదని తాతను హతమార్చాడో ఓ మనవడు, తండ్రి చనిపోతే వారసత్వంగా ఉద్యోగం వస్తుందని తెలుసుకున్న తన మూడో కొడుకు తండ్రిని హతమార్చి దాని నుంచి తప్పించుకునేందుకు మరింత దిగజారాడు. కని పెంచిన తల్లిదండ్రులు ఆస్తిని తనను కాదని తన సోదరికిచ్చిందని కడ చూపుకు రాకుండా అంతిమ సంస్కారాలకు రాకుండా రక్త సంబంధాన్ని చంపేస్తున్నాడు. అన్నను అడ్డుతొలగించుకుంటే మొత్తం ఆస్తి తన పరం అవుతుందని నిత్యం ఆహార పదార్థాల్లో మత్తు ఇచ్చి సోదరుడు నానా ఇబ్బందులు పడుతుంటే వికృత ఆనందం పొందాడు తప్ప మరో ఆలోచన చేయలేదు. పైన మొత్తం ఘటనలను పరిశీలిస్తే మొత్తం ఆర్థిక సంబంధాల నేపథ్యంలో జరిగినవే. ప్రేమ పవిత్రమైంది. నిజమైన తరువాయి 12లో

## ఎయిర్ ఇండియాపై కేంద్రమంత్రి చౌహాన్ మండిపాటు

- విరిగిన సీటు కేటాయించడంపై అసహనం
- చర్యలు తీసుకోవాలని విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు సూచన



భోపాల్/ముంబై : టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండియా తనకు కూర్చునేందుకు వీలులేని, విరిగిపోయిన సీట్‌ను కేటాయించడంపై కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. దీనిపై తగిన తరువాయి 12లో

## మార్చి 19న మళ్లీ చర్చలు



రైతు ప్రతినిధులు చెప్పినవన్నీ విన్నాం : శివరాజ్‌సింగ్

సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులతో ఆరో విడత రైతు ప్రతినిధుల చర్చలు

ఛండీగఢ్ : వ్యవసాయ పంటలకు ఇచ్చే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)లను చట్టబద్ధం చేయడంతోపాటు అనేక సాగు సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులు–కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల మధ్య చండీగఢ్‌లో శనివారంనాడు సాయంత్రం జరిగిన ఆరో విడత చర్చలు మార్చి 19వ తేదీకి వాయిదా పడ్డాయి. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మొదటిసారి రైతు ప్రతినిధులతో భేటీ అయ్యారు. హృదయపూర్వకమైన వాతావరణంలో మాట్లాడుకున్నామని, 26 రోజుల తర్వాత మళ్ళీ చండీగఢ్‌లోనే చర్చలు జరుగుతాయని అనంతరం మంత్రి మీడియాకు చెప్పారు. రైతు ప్రతినిధులు చెప్పిన సమస్యలను శ్రద్ధగా విన్నామని, రైతు నాయకుడు జగజిత్‌సింగ్ డల్లేవాల్ (70), మరో రైతు నాయకుడు స్వరణ్ సింగ్ సింగ్ పాంధేర్‌ల అభిప్రాయాలు విన్నామనీ, తమ మధ్య మంచి చర్చ జరిగిందనీ చౌహాన్ అన్నారు. ఆయనతోపాటు కేంద్రమంత్రి తరువాయి 12లో



## ముగ్గురు ఐపిఎస్‌లు రిలీవ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పనిచేస్తున్న ముగ్గురు ఐపిఎస్ అధికారులు వెంటనే ఆంధ్ర ప్రదేశ్‌లో ఉద్యోగాల్లో చేరాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. రహదారి తరువాయి 2లో

# మొదటి దశలో చివరి అంకం

# ఆరుగురు బందీలు,620 మంది ఖైదీలు మార్పిడి

**సెంట్రల్ గాజా :** ఇజ్రాయెల్–పాలస్తినామధ్య మొదటి దశ కాల్పుల విరమణ ఒప్పందంలో చివరిఅంకం కూడా తీవ్ర ఉద్రిక్తతలమధ్య శనివారంనాడు పూర్తి అయింది. రెండు వేరు వేరు చోట్ల ఆరుగురు ఇజ్రాయెలీ బందీలను హమాస్ ఉగ్రవాదులు విడుదల చేయగా, అందుకు ప్రతిగా 620 మంది పాలస్తినా ఖైదీలను ఇజ్రాయెల్ ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఇజ్రాయెల్‌లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ముసుగులు ధరించిన హమాస్ సంస్థ సభ్యులు వారిని వేదికపైకి తీసుకువచ్చి సంతకాలు చేయించి స్వాధీనం చేయడం, మరణించిన హమాస్ నాయకుల పేర్లను బ్యానర్లు కట్టడం వంటి పరిణామాలు ఇజ్రాయెల్ సైన్యంలో మరింత కసి పెంచుతున్నాయి. ఈ తతంగాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విడుదలైన మొత్తం ఆరుగురు బందీలలో ఇద్దరు బందీలు గడచిన పదేళ్ళుగా హమాస్ చెరలో మగ్గుతున్నారు. సెంట్రల్‌గాజాలో ఇద్దరు బందీలను, దక్షిణ గాజాలో నలుగురు బందీలను రెడ్ క్రాస్ ప్రతినిధులకు హమాస్ ఉగ్రవాదులు స్వాధీనం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వందలమంది గుమిగూడారు. వీరిలో అవెరా మెంగెస్తు 2014లో సరిహద్దులు దాటడంతో హమాస్ ఉగ్రవాదుల చేతికి చిక్కారు. గడచిన పది సంవత్సరాలుగా వీరిద్దరూ హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. అవెరా మెంగెస్తు (39), తాళ్ షోహమ్ (40) గత ఏడాది అక్టోబరులో మ్యూజిక్‌ఫెస్టివల్ నుండి బందీగా హమాస్ తీసుకువెళ్ళింది. అనే ఇజ్రాయెలీవాసులిద్దరినీ దక్షిణగాజా రఫాలో రెడ్‌రక్రాస్ బృందాలకు హమాస్ అప్పగించారు. ఈ దృశ్యాన్ని టెల్‌అవీవ్‌లో తిలకించిన వేలాదిమంది ప్రజలు ఆనందోత్సాల్లో మునిగితేలారు. వారిని ఇజ్రాయెలీ సైనికులు తమ స్వాధీనంలోకి తీసుకుని స్వదేశానికి తరలించారు. అదేవిధంగా సెంట్రల్ గాజాలోని నుజైరత్ శరణార్థ శిబిరం నుండి నలుగురు ఇజ్రాయెలీ బందీలను విడుదల చేసి రెడ్‌క్రాస్‌కు హమాస్ అప్పగించింది. విడుదలైన నలుగురు బందీలను ఎలియా కోహెన్, ఒమెర్ షెమ్ టోవ్, ఒమర్ వెంకెర్ట్ లను భారీ బందోబస్తుమధ్య అట్టహాసంగా హమాస్ అప్పగించింది. హిషామ్ అల్ సయ్యద్‌ను మాత్రం విడిగా ఎలాంటి హంగామా లేకుండా స్వాధీనం చేసింది. హిషమ్ అల్ సయ్యద్ 2015లో సరిహద్దు దాటి వెళ్ళి హమాస్ చేతచిక్కి పదేళ్ళుగా వారివద్ద బందీగా ఉన్నాడు. నుసైరత్ నుండి ముగ్గురు ఇజ్రాయెలీ బందీలను విడిపించేందుకుగాను ఆ దేశ సైనికులు గత ఏడాదిలో భారీ దాడులు చేసి 274 మంది పాలస్తీనిఇయన్లను చంపారు. మధ్యవర్తుల ఒప్పందం మేరకు ఇజ్రాయెల్–పాలస్తినామధ్య మార్చి రెండో తేదీ నాటితో 45 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ముగుస్తుంది. ఇక రెండోదశ కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు రెండు దేశాలు చర్చలతో కుస్తీ పడుతున్నాయి.



**తల్లి షిరి బిబాస్ అసలు మృతదేహం స్వాధీనం**

ఒకే హీబ్రూ కుటుంబం నుండి హమాస్ బందీలుగా తీసుకుపోయిన నలుగురిలో తల్లి షిరి బిబాస్ అసలైన మృతదేహాన్ని హమాస్ ఉగ్రవాదసంస్థ శనివారంనాడు ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేసింది. దీంతో ఆ కుటుంబం ఆ మృతదేహాన్ని గుర్తుపట్టి ఆ మృతదేహం షిరి బిబాస్‌దేనని ధృవీకరించింది. గురువారంనాడు ఇద్దరు పిల్లలు, తల్లి మృతదేహాలను హమాస్ స్వాధీనం చేసింది. కానీ తల్లి మృతదేహం ఆమెది కాదని కుటుంబీకులు గుర్తించడంతో మళ్ళీ గందరగోళం చెలరేగింది. శవపరీక్షలో ఆ మృతదేహం షిరి బిబాస్‌ది కాదని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. తాము పొరబడ్డామనీ, తప్పుగా మరో మృతదేహాన్ని ఇచ్చామనీ హమాస్ అంగీకరించింది. అసలైన మృతదేహాన్ని తిరిగి స్వాధీనం చేసింది. ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్‌నీరోజ్ ప్రాంతం నుంచి 2023 అక్టోబర్ 7న వీరిని హమాస్ అపహరించింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో వీరు మృతి చెందినట్టు హమాస్ ప్రకటించింది. ఈ హీబ్రూ కుటుంబంలో గతనెలలో తండ్రిని మాత్రమే హమాస్ సజీవంగావిడుదల చేసింది.

# ఖనిజ వనరులిచ్చేందుకు

# ట్రంప్‌కు తలొగ్గిన జెలెన్‌స్కీ!





**కీవ్ :** ఉక్రేన్‌లో ఉన్న విలువైన ఖనిజవనరులను అమెరికాకు ఇచ్చేందుకు జెలెన్స్కీ సిద్ధపడుతున్నట్టు కనిపిస్తున్నది. రష్యాతో జరిగే సంప్రదింపులలో ఉక్రేన్ పాత్ర అవసరం లేదని ట్రంప్ తోసిపుచ్చినప్పటికీ జెలెన్స్కీ మాత్రం అమెరికా ఒత్తిడికి తలొగ్గే ప్రకటన చేశారు. ఉక్రేన్‌లో ఉన్న విలువైన ఖనిజనవనరులను అమెరికాకు ఇచ్చేందుకు సంబంధించిన ఒక ముసాయిదా నిర్ణయంపై కసరత్తు చేస్తున్నట్లు జెలెన్స్కీ శుక్రవారం రాత్రి పొద్దుపోయాక చెప్పారు. దీంతో ఈ రెండు దేశాలమధ్య ఖనిజవనరుల గనుల ప్రాంతాన్ని అమెరికా కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం అనివార్యంగా కనిపిస్తోంది. గడచిన మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధంలో ఆయుధాలు, ఇతరత్రా సహాయం రూపంలో భారీగా ఉక్రేన్‌కు పెట్టుబడులు సమకూర్చింది. ఇందుకు ప్రతిగా తమ కంపెనీలకు ఖనిజవనరుల గనుల భూములు ఇవ్వాలని ట్రంప్ కోరుతున్నారు.

# అమెరికా ఉన్నతసైనికాధికారిని తొలగించిన ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా త్రివిధ దళాల ప్రధానాధిపతి, ఛైర్మన్ సి.క్యూ.బ్రౌన్ జూనియర్‌ను దేశాధ్యక్షుడు ట్రంప్ పదవి నుండి తొలగించారు. దీంతో ఉన్నత స్థాయీ సైనిక నాయకత్వంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. అమెరికాలో ఇప్పటివరకూ ఇలా అత్యున్నత పదవి అందుకున్న రెండవ నల్లజాతీయుడు బ్రౌన్. ఆయన స్థానంలో రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ లెఫ్టినెంట్ జనరల్ డాన్ రాజిన్‌ను నియమించారు. ఆయనను తొలగించడంతో వచ్చేవారంలో మరో 5,400 మంది ప్రొబేషనరీ వర్కర్లను తొలగించి 50 బిలియన్ డాలర్లు ఇతర మార్గాలకు మళ్ళించాలనే ప్రణాళిక అమలుకు ఇదొక తాజా ఉదాహరణ. అమెరికా జాతీయ భద్రత, రక్షణకు సంబంధించి అటు దేశాధ్యక్షుడికీ, ఇటు రక్షణశాఖా మంత్రికీ కూడా ఈ త్రివిధ దళాల ప్రధానాధిపతిగా ఉండే ఛైర్మన్ సలహాలు, సూచనలూ ఇస్తూ ఉంటారు. దేశంలోని అత్యున్నతస్థాయీ ర్యాకింగ్ ఆఫీసర్లలో ప్రథముడు బ్రౌన్. ''గడచిన 40 సంవత్సరాలుగా రక్షణ రంగానికి గొప్ప సేవలు అందిస్తున్న బ్రౌన్‌కు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నా, ఆయన, అనుభవజ్ఞుడైన అధికారి, ఎంతో గౌరవనీయమైన వ్యక్తి, ఇకమీదట ఆయనకు ఆయన కుటుంబంలో మంచి భవిష్యత్తు కొనసాగాలని కోరుకుంటున్నా'' అని ట్రంప్ ఈ సందర్భంగా సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. ఆయనతోపాటు మరో ఐదుగురు ఉన్నతశ్రేణి అధికారులను కూడా తొలగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బ్రౌన్ ఛైర్మన్‌గా ఉన్న 16 నెలల కాలంలో అటు ఉక్రేన్ యుద్ధం, ఇటు మధ్యాసియాలో యుద్ధం ఉద్ధృతస్థాయిలో కొనసాగాయి. అమెరికాలో నల్లజాతీయుడు జార్జ్ ఫ్లాయడ్‌ను పోలీసులు రోడ్డుమీద చంపినప్పుడు చెలరేగిన ఉద్యమానికి బ్రౌన్ గట్టిమద్దతుదారుడుగా ఉన్నారు.

# జర్మనీ పార్లమెంటుకు నేడు ఎన్నికలు

## ప్రచారంలో సిడియు–సిఎస్‌యు ముందంజ




**బెర్లిన్ :** జర్మనీ పార్లమెంటుకు ఆదివారంనాడు ఎన్నికలు జరుగుతాయి. శనివారం సాయంత్రం తో ఎన్నికల ప్రచారం పూర్తయింది. ఈ ఎన్ని ప్ర చారంలో ప్రధాన ప్రత్యర్థులందరూ రష్యాతో జరి గే యుద్ధంలో ఉక్రేన్‌కే మద్దతు ఇస్తామని ప్రకటించారు. జర్మనీ ఓటర్లను ప్రభావితం చేసేందుకు రష్యా ప్రయత్నం చేస్తోందని ఎఎఫ్‌డి పార్టీ నాయకులు ప్రచారంలో విమర్శలు సంధించారు. పార్లమెంటు 'బుందేస్టాగ్'లో సీట్ల సంఖ్యను733 స్థానా ల నుండి 630కి తగ్గించిన తర్వాత మొదటిసారి ఈ పోలింగ్ జరుగుతోంది.దీంతోపాటు 16 రాష్ట్రాలలో కూడా అసెంబ్లీకు ఎన్నికలు జరుగుతాయి. 18 ఏళ్ళు వయసు దాటినవారంతా పార్లమెంటు కు, సొంత రాష్ట్ర అసెంబ్లీకి రెండుఓట్లు ఒకేసారి వే సి నాయకులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ప్రస్తు త ఓటర్ల నాడిని బట్టి చూస్తే, సిడియు–సిఎస్‌యు నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ (69) ఎన్నికల ప్రచారంలో అగ్రస్థానంలో ఉండగా, ఎఎఫ్‌డి నాయకురాలు ఆలిస్ వీడెల్ (46) రెండోస్థానంలో ఉన్నా రు. ఇక పార్లమెంటు అవిశ్వాస తీర్మానం ద్వారా మెజారిటీ కోల్పోయిన తాత్కాలిక జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షల్జ్ మూడోస్థానంలో ఉన్నారు. సిడియు (క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్) తోపాటు బవేరియా రాష్ట్రానికి చెందిన దాని సోదరపార్టీ సిఎస్‌యు(క్రిస్టియన్ సోషల్ యూనియన్) 28.32 శాతం ఓటర్ల సానుకూలతతో ఛాన్సలర్ పదవిని దక్కించుకునే దిశగా దూసుకుపోతున్నాయి. ఎఎఫ్‌డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) పార్టీ 20, 21 శాతం ఓట్ల అంచనాతో రెండోస్థానంలో ఉంది. షల్జ్ సారథ్యంలోని సోషల్ డెమోక్రాట్స్, గ్రీన్స్‌పార్టీ కూట మి 14 శాతం ఓట్లు సంపాదిస్తుందన్న అంచనాలున్నాయి. ఇక సోషలిస్టు వామపక్ష ''డై లింక్' పార్టీ కూడా ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఈ పార్టీకి 7 నుండి 9 శాతం మేరకు ఓట్లు లభిస్తాయని సర్వే అంచనావేసింది.

ప్రపంచం

# రష్దీపై దాడికేసులో మతార్‌కు పాతికేళ్ళు శిక్ష?





**మేవిల్లే :** ప్రముఖ రచయిత సాల్మన్ రష్దీ (77)పై హత్యాయత్నం కేసులో హదీ మతార్ (27) ను న్యాయస్థానం నేరస్థుడిగా నిర్ధారించింది. బహుశా మతార్‌కు 25 సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశాలున్నాయి. న్యూయార్క్ మేవిల్లేలోని ఛౌతక్వా కౌంటీ కోర్టు మతార్‌ను దోషిగా నిర్ధారించింది. ఏప్రిల్ 23వ తేదీన మతార్‌కు శిక్ష ఖరారు చేస్తారు. మతార్ ఆయనపై దాడిచేస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. ఈ తీర్పు అనంతరం ఛౌత క్వా కౌంటీ జిల్లా అటార్నీ జాసన్ ష్మిత్ మాట్లాడుతూ, సాల్మన్ రష్దీపై దాడి జరిగినప్పుడు పెద్దసంఖ్యలో రచయితలు, అభిమానులు వెల్లువలా వచ్చి ఆయనకు అండగా నిలబడ్డారని కొనియాడారు. వారి అండదండలవల్లే ఈ కేసు ఇంతవరకూ వచ్చి నేరస్థుడి నేరం రుజువైందని, శిక్ష ఖరారు కాబోతోందని అన్నారు. మతార్ తరపు న్యాయవాది నథానియల్ బారోన్ మాట్లాడుతూ, ఈ తీర్పుతో మతార్ తీవ్ర మనస్తాపం చెందాడన్నారు. 'శటానిక్ వెర్సస్' (సైతాను వచనాలు) నవలా రచన తర్వాత 1988లో సాల్మన్ రష్దీకి హత్య బెదిరింపులు రావడంతో ఆయన బ్రిటన్‌లోనే ఎక్కువ సంవత్సరాలు అజ్ఞాతంలో గడిపారు. మతార్ ఆయనపై 15 సార్లు కత్తితో దాడిచేయడంతో ఆయన శరీరలోపలిభాగాలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయన చచ్చి బ్రతికారు.

# పారిస్‌లో అంతర్జాతీయ వ్యవసాయ ప్రదర్శన



**పారిస్ :** పారిస్‌లో ఏటా జరిగే అంతర్జాతీయ వ్యవసాయ ప్రదర్శన పోర్టే డి వెర్సైలెస్‌లో ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ప్రపంచవ్యాప్తంగా 6,00,000 మంది తిలకిస్తారని అక్కడి ప్రభుత్వం అంచనావేసింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, సేంద్రీయ వ్యవసాయ విధానాల ప్రదర్శన, శాంపిల్ ప్రోడక్ట్స్‌లను ఈ ప్రదర్శనలో ఉంచారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే 4,000 రకాల పశువులను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఔపెట్టే అని పిలిచే 1,000 కేజీలు బరువుగల లిమౌసిన్ ఆవును ఈ సారి 2025 ప్రదర్శనకు మస్కట్‌గా ఎంపికచేశారు. యూరోపియన్ యూనియన్‌లో ఉన్న అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుసంపద ఉత్పత్తిదారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు.విదేశాల నుండి ఫ్రాన్స్ వ్యవసాయ దారులకు తీవ్రమైన పోటీ ఎదురవుతున్న తరుణంలో ఈసారి ఫ్రెంచ్ రైతులకు భారీ వాగ్దానాలమధ్య ఈ ప్రదర్శన జరుగుతున్నది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు.

## తనయుడి దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆరెల్లి మొగిలి(45) మద్యానికి బానిసై పీకల దాకా తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను వేధించసాగాడు. దీంతో తండ్రిపై కోపం పెంచుకొన్న అతడి కుమారుడు ఆరెల్సి సాయి కుమార్(25) వెంట తెచ్చుకొన్న కత్తితో వెంటాడి వచ్చి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మెడిప్లస్ మెడికల్ హాలు ఎదుట నిత్యం రద్దీగా ఉండే రహదారి మీదుగా తండ్రి మొగిలి వెలుతుండగా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. కడుపులో పలుమార్లు పొడిచాడు. అందరూ చూస్తుండగా తండ్రిని కత్తితో దాడి చేసి కత్తి పట్టుకొని కసిగా తిడుతుండటం పలువురిని అక్కడ ఉన్న వారిని తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. వెంటనే సంఘటనాస్థలికి చేరుకొన్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కత్తి పోట్లతో కింద పడ్డ మొగిలిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా కాసేపటికే తుది శ్వాస విడిచాడు. కాగా వారం రోజుల క్రితం తరచు మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడన్న కోపంతో తాగి వచ్చిన ఉమేష్‌ను సోదరుడు వరుసకు సోదరుడైన మరో వ్యక్తితో కల్సి పరుగెలెత్తించి మరీ జాతీయ రహదారిపై పట్టపగలే కత్తులతో పొడిచి హతమార్చాడు. ఆ సంఘటన జరిగిన 24 గంటల వ్యవధిలోనే అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోదరుడైన వెంకటరమణను గొంతు కోసి హతమార్చాడు. అంతకుముందు గత నెలలో మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఉదంతాన్ని పరిశీలిస్తే ఆర్మీలో పని చేసి రిటైర్ అయిన ఓ వ్యక్తి తన భార్యపై అనుమానం కారణంగా ముక్కలు ముక్కలుగా నరికి హతమార్చటమే కాక ఆమె మృతదేహంలోని శరీర భాగాలను కుక్కర్‌లో ఉడికించి చెరువులో పడేసిన ఉదంతం పలువురిని విస్తుపోయేలా చేసింది. కేవలం పదిహేను రోజుల వ్యవధిలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు హత్యా సంఘటనలు వరుసగా చోటు చేసుకొన్నాయి.

## కొలువుల జాతర

(మొదటి పేజీ తరువాయి)

పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తున్నది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నహాలు చేస్తోంది. వీటిని ఆయా జిల్లా కలెక్టర్‌లే జారీ చేయనున్నారు. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌ల కొలువులను భర్తీ చేయడం తొలిసారి. ఖాళీల భర్తీ ప్రక్రియతో అంగన్‌వాడీ వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

## కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న స్నేహ ధర్మం ప్రకారం కాంగ్రెస్ పార్టీకి సిపిఐ పూర్తి మద్దతును ప్రకటిస్తోందని కూనంనేని వెల్లడించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి మతతత్వ బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన విద్యా విధానం, యుజిసి చట్టంలో తీసుకొస్తున్న సవరణల ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను లాగేసుకుంటుందని, రాజ్యాంగం కల్పించిన సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నదని విమర్శించారు. గడిచిన 12 ఏళ్లలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రం నుండి చెల్లించిన పన్నుల్లో న్యాయబద్ధంగా రావలసిన వాటా ఇచ్చిందే తప్ప తెలంగాణకు అదనంగా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీలను ఇప్పటివరకు పూర్తి చేయలేదని పట్టభద్రుల ఎన్నికల కోసమే నిజామాబాద్ పసుపు బోర్డు తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారని, దానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గిరిజన విశ్వవిద్యాలయానికి కూడా నిధులే కేటాయించలేదని, ఏటా రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్న బిజెపి ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందన్నారు. బిజెపిని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా రాష్ట్రాన్ని, ఫెడరల్ స్ఫూర్తిని విస్మరిస్తున్న కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి గుణపాఠం చెప్పాలని ఓటర్లకు కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## సహాయక చర్యలు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులు కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.ఈ ప్రమాదంలో గాయపడ్డ వారందరికీ మెరుగైన వైద్య సాయం అందించాలని సిఎం ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఎన్ఎస్ ఆర్ఎఫ్, ఎన్ఆర్‌డిఎఫ్ బృందాలు చేపట్టే సహాయక చర్యలు అందించనున్నాయని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితిని తెలియజేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని సిఎం ధైర్యం చెప్పారు. ఘటన సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఘటన స్థలానికి వెళ్లాలని, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతోపాటు ఉన్నతాధికారులను అదేశించారు. దీంతో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డిఐజి, ఐజి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు హుటాహుటిన హెలిక్యాప్టర్‌లో ప్రమాద స్థలికి తరలి వెళ్లారు.

**సిఎం రేవంత్‌రెడ్డి సమీక్షా :** ఎస్ఎల్‌బిసి ఘటన తాజా పరిస్థితులపై శనివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎస్ఎల్‌బిసి ప్రమాదం ఘటన, ప్రస్తుత తాజా పరిస్థితి పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు.ఎన్ఎస్ఆర్ఎఫ్, ఎన్ఆర్‌డిఎఫ్ బృందాలు ప్రమాద స్థలానికి చేరుకున్నాయని సిఎంకు తెలిపారు. దీంతో సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యలను మరిత వేగవంతం చేయాలని సిఎం సూచించారు. గాయపడినవారికి మెరుగైన వైద్య సాయం అందించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించాలని అదేశించారు.

**ప్రమాదంపై పలువురు దిగ్భ్రాంతి :** నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బిసిటన్నెల్ పనుల్లో జరిగిన ప్రమాదంపై పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడిడ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, బిజెపి ఎంపి ఈటెల రాజేందర్‌లు విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు. సకాలంలో స్పందించి, సహాయక చర్యలు అందించిన మంత్రులను, అధికారులను ఆయన అభినందించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనుల్లో భాగంగాశ్రీశైలం నుంచి దేవరకొండ వైపు వెళ్లే టన్నెల్ 14 కిలో మీటర్ ఇన్లేట్ వద్ద (దోమలపెంట దగ్గర) సి పేజ్‌ను పూడ్చివేసిన కాంక్రీట్ సెగ్మెంట్ జారడం అవడంవల్ల ప్రమాదం చోటు చేసుకుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. దీంతో టన్నెల్ వద్ద పైకప్పు కూలి పలువురికి గాయాలైన సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడారు. సంఘటనపై ఆరాతీసిన మంత్రి తుమ్మల క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రమాదంపై ప్రభుత్వంఅధికారిక ప్రకటన చేయాలని ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు.

**సొరంగంలో చిక్కుకుపోయిన 8 మంది వీరే :** ఎస్ఎల్‌బిసి సొరంగం మార్గంలో చిక్కుకుపోయినవారి వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. సొరంగం(టన్నెల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో మొత్తం 8 మంది చిక్కుకుపోగా ఇందులో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు మిషన అపరేటర్లు, 4 మంది కూలీలు ఉన్నట్లు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్ కుమార్, శ్రీనివాస్, జార్ఖండ్‌కు చెందిన సందీప్ సాహు,సంతోష్ సాహు, అంజుసాహు, జగత్, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన సన్నీ సింగ్, పంజాబ్‌కు చెందిన గుర్ ప్రీత్ సింగ్‌లు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## ఐపిఎస్‌లు రిలీవ్

(మొదటి పేజీ తరువాయి)

భద్రత అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్ర మాజీ డిజిపి అంజనీ కుమార్, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న అభిషేక్ మహంతి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరక్టర్ అభిలాష బిస్తలను ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లాలని ఆదేశించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత అఖిల భారత సర్వీసు అధికారులను రెండు రాష్ట్రాలకు డిఓపిటి కేటాయించింది. ఈ కేటాయింపులను వ్యతిరేకిస్తూ 10 మంది ఐఏ ఎస్‌లు, ముగ్గురు ఐపిఎస్‌లు అప్పట్లో క్యాట్‌ను ఆ శ్రయించారు. ఈ అంశంపై డిఓపిటి తెలంగాణ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. విభజన స మయంలో నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫార్సులను పరిగణలోకి తీసుకొని, విరీ అభ్య ర్థనలను పరిశీలించాలని గత ఏడాది జనవరిలో హైకోర్టు తీర్పు వెల్లడించింది. 2024 మార్చిలో ఖండేకర్ కమిటీని నియమించారు. ఈ కమిటీ సిఫార్సుల మేరకు గత అక్టోబర్‌లో కొందరు ఐఎఎస్‌లను ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. ఇప్పుడు మరో ముగ్గురు ఐపిఎస్‌లను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు డిజి అంజనీ కుమార్, అభిలాష బిస్తలను రిలీవ్ చేసింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది.

## టన్నెల్‌లో ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

బయటకు తీసుకొచ్చారన్నారు. బోరింగ్ మిషన్ ముందున్న 8మంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. 8మంది ప్రాణాలు కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాంమని, ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగితే టన్నెల్‌లో వారిని రెస్క్యూ చేసిన నిపుణులతోతో మాట్లాడామని తెలిపారు. టన్నెల్‌లో చిక్కుపోయిన వారు ఉత్తర్‌ప్రదేశ్, జార్ఖండ్, పంజాబీ వాసులని, వారిలో ఒక ప్రాజెక్టు ఇంజినీరు, ఫీల్డ్ ఇంజినీరు, నలుగురు కార్మికులు, జమ్ముకశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారని వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారికి వెంటిలేషన్ ఇబ్బందిలేదని, 14 కిలోమీటర్ల లోపల ఇరుక్కు పోవడంతో వారిని బయటకు తీసుకురావడం సవాల్‌గా మారిందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు భారత సైన్యం వస్తుందన్నారు. అయితే టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు 3 ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విజయవాడ నుంచి 2, హైదరాబాద్ నుంచి వచ్చిన ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. ఇదిలా ఉండగా, ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద సంఘటన స్థలాన్ని (నాగర్ కర్నూల్ జిల్లా ,దోమలపెంట)ను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరథ్ చంద్ర పవార్‌లు శనివారం సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదం జరగడానికి గల కారణాలు, తదితర వివరాలను వారు అక్కడ ఉన్న ఇంజనీర్లు, ప్రమాదం నుండి బయటపడ్డ వారితో అడిగి తెలుసుకున్నారు.

## తప్పులు చూపాలి

(మొదటి పేజీ తరువాయి)

విషయాలను తీర్మానం చేసి తమకు సమర్పించాలని,వీటిని రాహుల్ గాంధీ వద్దకు పంపిస్తామని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన బిసి ఎంఎల్‌ఏలు, నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క శనివారం సమావేశమయ్యారు.ఈ సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనను ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించారని, తెలంగాణ మోడల్ ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలనే కార్యాచరణను తీసుకుంటున్నారని, తద్వారా ప్రధాని మోదీ తీవ్రమైన రాజకీయ వ్యతిరేకతను ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని తెలిపారు. 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ కులగణన చేపట్టలేదని ఆరోపించారు. రాహుల్ దేశ వ్యాప్తంగా కులగణన సర్వే చేస్తారనే విశ్వాసం బిసిలలో కలిగితే, రాహుల్ దేశ ప్రధాని అవుతారని, ఆయన ప్రధాని అయితే, మొట్టమొదటగా నష్టపోయేది మోదీనేనని, ఆయన పదవి పోతే, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఉద్యోగాలు కూడా పోతాయని , అందుకే వారి ఉద్యోగాల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే లెక్కలను తప్పుపడుతున్నారని దుయ్యబట్టారు. దీనిని కాంగ్రెస్ నాయకులు తిప్పికొట్టకపోతే, ప్రజలకు వివరించకపోతే , కులగణన అనే ఆస్తిని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో నష్టం జరుగుతుందని తెలిపారు. దేశంలో తెలంగాణ ప్రభుత్వం తరహా ఇంత కంటే పకడ్బందీ ప్రక్రియతో కులగణన చేపట్టే రాష్ట్రం లేదన్నారు. తన శక్తిమేరకు కులగణన చేపట్టానని, దీనిని కంచె వేసి కాపాడుకోవాల్సిన రోజు వచ్చిందని సూచించారు. ప్రజలకు వద్దకు తీసుకెళ్లాలని, రాహుల్‌గాంధీని ప్రధాని చేయయడానికి ఇదొక కార్యాచరణగా ఉండాలని హితువుపలికారు. బిఆర్ఎస్, బిజెపి కులగణన లెక్కలపై బట్టకాల్చి పైన వేస్తున్నారని, తూడుచుకోకపోతే అందులోకాలిపోతావనే తరహా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బిసిల లెక్కలు తేలితే ప్రభుత్వాలను ప్రశ్నించేందుకు, రావాల్సిన హక్కులను అడిగేందుకు ప్రస్తుత కులగణన సర్వే లెక్కలు ఎంతో దోహపడుతాయని, లెక్కలే లేకపోతే, ఏ లెక్కల ఆధారంగా ప్రభుత్వాలను ప్రశ్నిస్తారని, ఏ లెక్కలతో పొల్చుకుంటారని ప్రశ్నించారు. చరిత్రలోలో శాశ్వితంగా నిలిచిపోయే సమగ్ర కుటుంబ సర్వే అని, ఏ రాజకీయ నాయకుడు కూడా ఇంత రిస్క్ తీసుకోడని సిఎం అన్నారు. కులగణన అనేది చరిత్రలో నిలిచిపోయే ఒక సాహసోపేతమైన గొప్ప నిర్ణయమన్నారు. భవిష్యత్‌లో భారతదేశంలో ఎవరైనా లెక్కల గురించి మాట్లాడాల్సి వస్తే తెలంగాణ రాష్ట్రం, సిఎం రేవంత్ రెడ్డి పక్కా లెక్కలు తీశారని, మాట్లాడాల్సిందేనని, ఇది చరిత్రలో శాశ్వితంగా నిలిచిపోయే చారిత్రాత్మక సందర్భమన్నారు. చరిత్రలో ఒక గొప్ప అవకాశాన్ని జారవిర్చుకుంటే, అంతకంటే రాజకీయ అజ్ఞానం కాని, దురుద్దేశం కాని ఉండబోదన్నారు. తాను రాజకీయ అజ్ఞానంతో లేనని, నాయకుడు ఇచ్చిన ఆదేశాల మేరకు అమలు చేసే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను అన్నారు.

**కులగణన చేయనోడు మంచొడా..?**

**బిసిలకు ఏదో చేద్దామని లెక్కలు తీస్తే నన్నే విలన్ చేస్తుండ్లు**

బిసిలకు ఏదో ఒకటి చేయాలని, తాను తల పగులగొట్టుకుంటుంటే, కులగణను ఎలాగో అలా పట్టాలు ఎక్కించాలని ప్రయత్నిస్తుంటే, తననే లాగుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'చేయనోడేమో మంచిగా ఫామ్ హౌస్‌లో పడుకున్నాడు..ఆయనే మంచొడైండు..తండ్రి, కొడుకు, అల్లుడు చేయుడు.వాళ్ల లెక్కలకే రారు.. మీరు (బిసిలు) వారికి లెక్కలకే లేరు..వాళ్లేమో మంచొళ్లైండ్లు.వారి మీటింగ్‌కు పెడితే మనోళ్లు పోయి కుసుంటరు..ఇంత కష్టపడితే రేవంత్‌రెడ్డిని విలన్ చేస్తిరి..మీ కోసం పని చేస్తే మీరు కూడా విలన్‌గా చూస్తే ఇంకా ఇది(బిసి లెక్కలు ) ఎలా ముందుపడుతుంది..? అని సిఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'కులగణన జరగకపోతే నష్టం మీకా?, నాకా? దీనిని కాపాడుకోకపోతే ఎలా? లెక్కలవైపు నిలబడకపోతే ఎలా? అని ప్రశ్నించారు. మాకేందుకు అన్నట్టు ఉంటే కులగణన పట్టాలు ఎక్కదు..?కులగణన పట్టాలు ఎక్కించి, రైలును పరుగెత్తిస్తే నే మీరు అనుకున్న గమ్యం చేరుతరు'' అని సిఎం అన్నారు.. బిసిలకు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో తాము కులగణన చేపడితే, కులగణన సర్వే చేసే తనను కొన్ని బిసి సంఘాల నాయకులు తిడుతున్నారన్నారు.

**కులగణన చేపడితే బిజెపిలోని ఆదిపత్య కులాలకు తీవ్ర విఘాతం:** కులగణన చేపడితే బిజెపిలో ఆదిపత్యం వహిస్తున్న ఒకటి,రెండు వర్గాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని, అధికారాన్ని చెలాయిస్తున్న ఆ వర్గాలకు పెద్ద గుదిబండగా మారుతుందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకే కులగణన ప్రక్రియను తప్పుపట్టి, అసలు లెక్క లే లేకుండా చేయాలని బిజెపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం పారదర్శకంగా కులగణన చేపట్టినప్పటికీ ఇప్పటి వరకు కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు తమ వివరాలను నమోదు చేసుకోలేదని, వారు ఎందుకు తమ వివరాలను నమోదు చేసుకోవడం లేదని, కారణం ఏమిటని నిలదీశారు.

**కులగణనపై సైంటిఫిక్‌గా లెక్కలు తీయలేదు: భట్టి విక్రమార్క**

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుత దేశంలో ఇప్పటివరకు బిసి కులగణనను సైంటిఫిక్‌గా తేల్చలేదని, మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తేల్చిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే అధికారికం కాదని, దీనిని దానిని మంత్రివర్గం, శాసనసభలో చర్చకు పెట్టలేదని, అందుకే ఆ లెక్కలు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం తేల్చిన లెక్కలతో ఆయా వర్గాల ప్రయోజనాల కోసం ఎలా ముందుకు తీసుకువెళ్లాలనేది బిసి ప్రజా ప్రతినిధులు, సంఘాలు ఆలోచించాలని భట్టి సూచించారు..




## అక్కడ అందరూ సర్వభక్షకులే..



పెన్సిల్వేనియా (అమెరికా)లోని పైన్ గ్రోవ్‌లో ఇటీవలే ఓ ప్రత్యేక డిన్నర్ పార్టీ జరిగింది. ఒక స్వచ్ఛంద సేవా సంస్థ ఈ ఈవెంట్‌ను నిర్వహించింది. మొత్తం ఆహూతులు 150 మంది. ఇందులో ఎలాంటి విశేషం లేకపోయినా, అక్కడి మెనూ మాత్రం విచిత్రమైనదే. సమస్త జంతుజాల మాంసం అక్కడ వండి వడ్డించారు. మొసలి నుంచి కాకి వరకూ... ఉడుత నుంచి ఉడుము వరకూ... సీమ పంది నుంచి ఎలుగుబంటి వరకూ... అక్కడ లేని మాంసం లేదు. వీటిలో కొన్ని ప్రాణులను చంపడాన్ని అమెరికా ప్రభుత్వం నిషేధించింది. అయితే, కొన్ని రాష్ట్రాల్లో మినహాయింపులిచ్చారు. ముందుగానే అనుమతి తీసుకున్నామని, ఆయా జంతువులను మాంసం కోసమే పెంచామని ఈ డిన్నర్‌ను నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ ప్రకటించింది. 14 రకాల జంతువులు అక్కడ ఆహారంగా మారిపోయాయి. ఒక్కో జంతువు మాంసాన్ని రకరకాలుగా వండడంతో, మెనూలో డిషెస్ సంఖ్య సెంచరీకి చేరువైంది. కంటితుడుపుగా ఒకటిరెండు శాకాహార డిషెస్ కూడా ఉంచారు. కానీ, అటువైపు ఎవరూ కన్నెత్తి కూడా చూడలేదట. కుందేళ్ల ఫ్రైలు.. నత్తల సూప్‌లు... పక్షుల రోస్టులు.. ఎలుగుబంటి సిక్స్‌టీ ఫైవ్‌లు...తరచు దొరికేవి కాదంటూ, పార్టీకి వచ్చిన వారంతా, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా డిషెస్‌ను ఖాళీ చేసేశారు. పిచ్చి రకరకాలంటారు అందుకే!

## సమాధులపై 'క్యూఆర్ కోడ్'!



ఆన్‌లైన్ చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించడం తెలుసు. అయితే, జర్మనీలో సమాధులపై క్యూఆర్ కోడ్‌లు దర్శనం ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. మ్యూనిచ్ శివార్లలోని వాల్డ్‌ఫ్రైడ్‌హాఫ్‌లో ఈ విచిత్రం చోటు చేసుకుంది. అక్కడి ఫ్రైడాఫ్, ఫ్రైడాఫ్ సాల్న్ శ్మశానాల్లో, ఒకటికాదు... రెండు కాదు... 1000కి పైగా సమాధులపై 5X35 సెంటీమీటర్లు (1.95X12 అంగుళాలు) వెడల్పున్న క్యూఆర్ కోడ్ స్టికర్లు అంటించడం ఉండడాన్ని చూసి అంతా నివ్వెరపోయారు. ఈ కోడ్‌ల ను ఎవరు, ఎందుకు అంటించారో తెలియడం లేదు. దీని వెనుకగల ఉద్దేశం కూడా అంతుబట్టడం లేదు. బహుశా సమాధి దగ్గరికి ప్రార్థనలు చేసేందుకు వచ్చే కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితుల నుంచి డబ్బు పొందాలనే ఆలోచన కావచ్చు. ఏదిఏమైనా పోలీసులు ఈ మిస్టరీని ఛేదించడంలో నిమగ్నమయ్యారు.

## కుంగిన రోడ్డు



రోడ్లమీద గుంతలు ఏర్పడడం, అవి కుంగిపోవడం మన దేశానికి మాత్రమే పరిమితం కాదు. ఇంగ్లాండ్‌లోనూ ఇదే పరిస్థితి ఉందని సర్రే కౌంటీ ఘటన రుజువు చేస్తున్నది. గాడ్‌స్టోన్ హైస్ట్రీట్‌పై రోడ్డు ఒక్కసారిగా కుంగిపోవడంతో, అక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. ఆక్స్‌టెడ్ రోడ్ నుంచి బ్లెచింగ్లీ రోడ్ జంక్షన్ వరకూ రోడ్డును మూసివేసినట్టు పోలీసులు ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా కొన్ని భవనాలను ఖాళీ చేయించారు. అనధికార సమాచారం మేరకు, ఈ సింక్‌సోల్ 62 అడుగులు (19 మీటర్లు) వరకు ఉంది. అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. కాగా, సర్రే కౌంటీ కౌన్సిల్ దీనిని అరుదైన, అతిపెద్ద ఘటనగా పేర్కొంది. మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ సింక్‌హోల్ ఏర్పడడానికి గల కారణాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపింది. రద్దీ లేకపోవడంతో సరిపోయిందిగానీ, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే రోడ్లపై హఠాత్తుగా ఇలాంటి గుంటలు ఏర్పడితే ఎంత నష్టం... ఎంత కష్టం.

## 'రాజకీయ మ్యాచ్'







క్రీడల్లోకి రాజకీయాలు చొరబడితే ఎలా ఉంటుందనేది మాంట్రియల్ (కెనడా) వేదికగా జరిగిన నాలుగు దేశాల ఐస్ హాకీ ప్లేఆఫ్ (సెమీ ఫైనల్) మ్యాచ్ స్పష్టం చేసింది. ఫైనల్‌లో చోటు కోసం అమెరికా, కెనడా జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. సుమారు 21000 మంది ప్రేక్షకులతో స్టేడియం క్రిక్కిరిసిపోయింది. కెనడాను తమ దేశంలో మరో రాష్ట్రంగా చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య మాటల యుద్ధానికి దారితీసిన విషయం తెలిసిందే. అదే విషయాన్ని మనసులో ఉంచుకున్న కెనడా అభిమానులు, మ్యాచ్ ఆరంభం నుంచే కేకలు వేయడం మొదలుపెట్టారు. తీవ్ర ఉద్రిక్తత మధ్య ఆట మొదలుకాగా, కేవలం తొమ్మిది సెకన్ల ఆటలోనే మూడు పర్యాయాలు ఇరు జట్ల ఆటగాళ్లు ఘర్షణకు దిగారు. తొలుత అమెరికాకు చెందిన మాథ్యూ కచుక్, కెనడా ఆటగాడు బ్రాండెన్ హెగెల్ పరస్పరం తలపడ్డారు. ఆ వెంటనే మాథ్యూ సోదరుడు బ్రాడీ కచుక్, కెనడాకు చెందిన శామ్ బెన్నెట్ కలబడ్డారు. చివరగా న్యూయార్క్ రేంజర్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహించే అమెరికా ఆటగాడు జెటి మోలెన్, కెనడా తాత్కాలిక కెప్టెన్ కాల్టన్ పారేకో బాహాబాహీకి దిగారు. ట్రంప్ వ్యాఖ్యలతో కెనడా అభిమానులు రెచ్చిపోవడం, అందుకు తగ్గట్టే ఆ జట్టు ఆటగాళ్లు కూడా మ్యాచ్‌ని విడిచిపెట్టి, సవాళ్లు విసరడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. చివరికి మ్యాచ్‌ని అమెరికా 3:1 తేడాతో గెల్చుకొని, ఫైనల్‌కు దూసుకెళ్లింది.

## హద్దులు మీరుతున్న 'ప్రాంక్'



సోషల్ మీడియా కారణంగా పుట్టుకొచ్చిన అతి ధోరణుల్లో 'ప్రాంక్'లను ప్రధానంగా పేర్కోవాలి. ప్రాంక్ కాల్స్ లేదా చేష్టలతో హాస్యం మాట ఎలావున్నా, ఎదుటివారికి ఇబ్బంది కలిగించే సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయి. గ్లాస్గో (స్కాట్‌లాండ్) ఘటన ను ఇందుకు ఉదాహరణగా పేర్కోవాలి. చారిటీ ఈవెంట్‌గా అక్కడ జరిగిన 10 కిలోమీటర్ల పరుగు (10కె రన్)లో 115 మంది పాల్గొన్నారు. ఒక ప్రాంక్‌స్టర్ మార్గమధ్యంలో దారిని చూపించే సైన్‌బోర్డును మరో దిశగా మార్చడంతో, వారిలో 30 మంది దారితప్పారు. ముళ్ల కంపలు, రాళ్లతో కూడిన మార్గంలో సుమారు 2.5 కిలోమీటర్లు అదనంగా పరిగెత్తాల్సి వచ్చింది. అక్కడ కనీస వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని, ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగివుంటే ఎవరు బాధ్యత వహిస్తారని బాధితులు వాపోయారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని శిక్షించడానికి సరైన చట్టాలు రావలన్న డిమాండ్ కూడా వ్యక్తమవుతున్నది. ఎక్కడైనా, అతి మంచిది కాదు. ప్రాంక్‌లు చేసేవారు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. హాస్యం హద్దులు దాటకుండా చూసుకోవాలి.

## చివరి ప్రయాణం..



అమెరికా చారిత్రక యుద్ధనౌక ఎస్ఎస్ ఫ్లోరిడా నుంచి ఈవారం ప్రారంభంలో చివరి ప్రయాణాన్ని ప్రారంభించింది. డెలవేర్ నదిలో ఎస్ఎస్ యుఎస్ బయలుదేరుతున్నప్పుడు వేలాదిమంది అభిమానులు వీడ్కో లు పలికారు. త్వరలోనే దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద 'ఆర్టిఫిషియల్ రీఫ్'గా మారుస్తారు. సముద్ర గర్భంలో కనిపించే రకరకాల మొక్కలు, ప్రాణులు, రాళ్లు, పగడాలు, ఇతరత్రా గవ్వలను కృత్రిమంగా ఏర్పాటు చేయడాన్ని ఆర్టిఫిషియల్ రీఫ్‌గా పేర్కొంటారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ రీఫ్‌గా మారనున్న ఎస్ఎస్ నౌక 1952 నుంచి అమెరికా మిలటరీ అవసరాలకు ఉపయోగంలోకి వచ్చింది. 1000 అడుగుల ఎత్తుగల ఎస్ఎస్ నౌక 1969 వరకూ యుఎస్ సైనిక విభాగంలో సేవలు అందించింది. ఆ తర్వాత కొన్నాళ్లు రిజర్వ్ నౌకగా దీనిని కొనసాగించారు. తదుపరి వేలం వేయగా, ప్రైవేటుపరమైన ఎస్ఎస్ నౌక పలువురి చేతులు మారింది. ప్రస్తుత యాజమాన్యం దీనిని ఆర్టిఫిషియల్ రీఫ్‌గా మార్చాలని నిర్ణయించింది.
ఈ క్రమంలోనే తుది ప్రయాణం మొదలుపెట్టింది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

## ప్రాధాన్యతగల సంభాషణలు

జొహన్నాస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)లో జరుగుతున్న జి.20 దేశాల విదేశాంగమంత్రుల సమావేశం సందర్భంలో భారత విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్ చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ, రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్‌లతో వేర్వేరుగా జరిపిన సంభాషణలకు ప్రస్తుత ప్రపంచ దృశ్యంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ మూడు పెద్ద దేశాలు షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ)లో, బ్రిక్స్‌లో, జి.20లో సభ్యులుగా ఉన్నాయి. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన 90వ దశాబ్దం తదుపరి అమెరికా ఏకధృవ ప్రపంచం పేరుతో ప్రపంచాధిపత్యంకోసం ప్రయత్నిస్తున్న సందర్భంలో బహుళపక్ష ప్రపంచ పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా ఏర్పడిన సంస్థలు ఎస్‌సిఒ, బ్రిక్స్. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ప్రారంభమైన బ్రిక్, దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్ అయింది. ప్రస్తుతం 20దేశాలు సభ్యులుగా చేరాయి; మరో 25–30 దేశాల విజ్ఞప్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత అక్టోబర్‌లో కజాన్ (రష్యా)లో జరిగిన బ్రిక్స్ 16వ అగ్రనాయక సమావేశం ఆ సంస్థ విస్తరణకు వేదిక అయింది. డాలర్ ఉడుంపట్టునుంచి విముక్తికోసం ప్రత్యామ్నాయ కరెన్సీ (యూరోపియన్ యూనియన్ యూరో లాగా) గూర్చి ఆలోచించాలన్న ప్రతిపాదన ఈ సమావేశంలోనే వచ్చింది. అది తమ ఆధిపత్యానికి, దోపిడీకి అడ్డుపడుతుందనే భయం అమెరికన్ పాలకుల్లో ఎంతగా ఉందో అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక తెలియజేస్తున్నది. బ్రిక్స్ ప్రత్యామ్నాయ కరెన్సీ ఆలోచనతో ముందుకుసాగితే అమెరికాతో బ్రిక్స్ దేశాల వాణిజ్యంపై 100శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. అమెరికా, జపాన్, ఇతర పారిశ్రామిక దేశాలతో కూడిన జి.7 ప్రపంచ ఆర్థిక విధానాలను శాసిస్తుండేది. 2008లో సబ్ ప్రైమ్ సంక్షోభం మహామాంద్యంగా మారటంతో కొత్త ఆలోచనలు, పరస్పర సహకారంకోసం మధ్యస్థాయి అభివృద్ధిలో ఉన్న వర్ధమాన దేశాలను కలుపుకుని జి.7ను జి.20గా విస్తరించారు. అంతకుముందు, ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక, రష్యాను జి.7లో చేర్చుకుని, కొద్ది సంవత్సరాల్లోనే తొలగించారు.

సోవియట్ యూనియన్ పతనం తర్వాత దాని వారసత్వం పుచ్చుకున్న రష్యన్ ఫెడరేషన్, ప్రపంచ జిడిపిలో రెండవస్థానానికి చేరిన చైనాలను అమెరికా శత్రురాజ్యాలుగా పరిగణిస్తోంది. అటు అమెరికా, ఇటు రష్యా, చైనా తదితర దేశాల సహకారంతో భారత్ అభివృద్ధి అంగలు వేస్తోంది. ఈ మూడు బలీయమైన దేశాల మధ్య స్నేహ సహకారాలకున్న ప్రాధాన్యత నిరాకరించలేనిది.

ప్రజాపక్షం
23-02-2025, ఆదివారం

అయితే చైనా – భారత్ సరిహద్దు వివాదం కారణంగా 2020లో తలెత్తిన ఘర్షణలు, సైనిక మోహరింపు వృద్ధి చెందుతున్న సంబంధాలను దెబ్బతీశాయి. ఇరు పక్షాల్లో మేల్కొన్న విజ్ఞత ఉద్రిక్తతల విస్తరణను నిరోధించింది. ఉద్రిక్తోపశమనకు దారితీసింది. 2024లో జి.20 శిఖరాగ్రసభ తర్వాత – భారత్ జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి చైనా సందర్శించారు. సరిహద్దు చర్చలకు ప్రత్యేక ప్రతినిధులైన అజిత్ దోవల్, వాంగ్ యీ చర్చలు జరిపారు.

బ్రిక్స్ శిఖరాగ్ర సభ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని మోదీ సమావేశమైనారు. ఆ తదుపరి సంబంధాల సాధారణీకరణ కృషి ఆరంభమైంది. వాంగ్ యీతో చర్చల్లో జై శంకర్ ఈ పరిణామాలను ప్రస్తావించారు. సరిహద్దులో శాంతి పరిరక్షణ, కైలాశ్ మానస సరోవర్ యాత్ర, సరిహద్దులు దాటుకుంటూ ప్రవహించే నదులు, వాణిజ్యం పెంపుదల అంశాలను వారు చర్చించారు.

మన దేశంలోని కొన్ని విభాగాలు ఎల్లప్పుడూ భారత్–చైనా మైత్రి వృద్ధి ఆవశ్యకతను గుర్తించకుండా చైనా వ్యతిరేకతను రెచ్చగొట్టటానికే ప్రయత్నిస్తుంటారు.

రష్యా విదేశాంగమంత్రి లావరోవ్‌తో సమావేశంలో జై శంకర్ ఇరుదేశాల మధ్య సహకారంలో పురోగతిని సమీక్షించారు. ఉక్రేన్ వివాదం, రియాద్‌లో అమెరికా ప్రతినిధులతో చర్చల్లో వ్యక్తమైన అభిప్రాయాలను లావరోవ్ జై శంకర్‌కు వివరించారు.

యుద్ధం ద్వారా కాక చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని భారత్ చెబుతూ వస్తున్నది. ప్రారంభదశలో ఉన్న అధ్యక్షుడు ట్రంప్ చొరవ పర్యవసానం ఎలా పరిణమిస్తుందో వేచి చూదాం!

# నూతన సిఇసి, ఇసిలపై ఆశలు, భయాలు

**జ్ఞాన్ పాఠక్**

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న నూతన చట్టం–2023 ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఇసి), ఎన్నికల కమిషనర్ (ఇసి)ను నియమించడంతో ప్రజల్లో భారత ఎన్నిక ల సంఘం స్వతంత్రత పట్ల ఆశలు, భయాలు తీవ్రమయ్యాయి. రాజ్యాంగ ధర్మాసనం 2022లో ఇచ్చిన తీర్పు స్ఫూర్తికి విరుద్ధం గా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్‌ల(నియామకం, సర్వీసు నిబంధనలు, కాల పరి మితి)చట్టం– 2023 ను భారత సుప్రీం కోర్టులో సవాలు చేశారు. వాస్తవంలో స్వతంత్రంగా వ్యవహరించాలంటే వీరి నియామకాలకు కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం నుంచి రక్షణ కలిగి ఉండాలని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.

ప్రధాన మంత్రి, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తితో జరగాలని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో తెలియజేసింది. అయినప్పటికీ, కమిటీలో ప్రధానమంత్రి, ఆయన నియమించిన కేంద్రమంత్రికి సభ్యుడికి అవకాశం కల్పించటమే కాకుండా, నియామక ప్రక్రియ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని దూరం పెడుతూ మోదీ ప్రభుత్వం 2023 చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టంలో కార్యనిర్వాహక వ్యవస్థ మెజారిటీ ఉండేలా చూసుకోవడమే కాకుండా నియామక ప్రకియలో తా ము అనుకున్న వారినే నియమించుకునే విధంగా అదుపులో పెట్టుకుంది.

సుప్రీం కోర్టు నిర్ణీత వ్యవధిలో తీర్పు ఇవ్వకపోవడంతో, అదే వివాదాస్పద చట్టం ఆధారంగానే ఫిబ్రవరి 17న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలతో కూడిన త్రిసభ్య కమిటీ సమావేశం అనంతరం సోమవారం అర్ధరాత్రి నూతన సిఇసి, ఇసిలను మోదీ ప్రభుత్వం నియమించింది. మరో రెండు రోజుల్లో అనగా ఫిబ్రవరి 19న ఆ చట్టం చెల్లుబాటునే సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌లపై భారత సుప్రీం కోర్టులో వాదనలు జరగాల్సిన నేపథ్యంలో ఆ నియామకాలను వాయిదా వేయాలని రాహుల్ గాంధీ కోరారు.

అప్పటి సిఇసి రాజీవ్ కుమార్ పదవీ విరమణ త్వరలోనే ఉండడంతో, ఆలోగా వాదనలు వినేందుకు గతంలో సుప్రీం కోర్టు అంగీకరించి, ఫిబ్రవరి 12న కేసును విచారణకు తీసుకుంది. అయితే, ఆ రోజున కేసు లిస్ట్ కాకుండా, ఫిబ్రవరి 19న పోస్టయింది.

నూతన సిఇసి గ్యానేశ్ కుమార్, ఇసి వివేక్ జోషిల నియామకమైన మరుసటి రోజు చట్టాన్ని సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించిన పిటిషనర్‌లు తమ కేసు ఫిబ్రవరి 19న 41వ అంశంగా ఉందని, కాబట్టి దానిని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని తప్పనిసరిగా వాదనలు వినాలని ఫిబ్రవరి 18 తేదీనే సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు.



గ్యానేశ్ కుమార్

వివేక్ జోషి

ఆ విజ్ఞప్తిని తిరస్కరిస్తూనే, ఫిబ్రవరి 19న ఆ అంశాన్ని ప్రస్తావించాల్సిందిగా పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న జస్టిస్ సూర్యకాంత్ సూచించారు.

అందుకు అనుగుణంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఎడిఆర్) అనే ఎన్‌జిఒ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం ఎదుట ప్రస్తావించినప్పటికీ, తనకు రాజ్యాంగ ధర్మాసనం ఎదుట మరో కేసు ఉన్నందున వాయిదా వేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. దీనిని ప్రశాంత్ భూషణ్ వ్యతిరేకిస్తూ "సొలిసిటర్ జనరల్‌కు ఇతర అంశాలు ఉన్నాయనే మామూలు కారణంతో కేసును వాయిదా వేయకూడదు.. వారికి 17 మంది లా ఆఫీసర్‌లు ఉన్నార"ని చెప్పారు. అయినప్పటికీ తుషార్ మెహతా ను ఉద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ "మీరు అందుబాటులో ఉండే విషయంపై మాకు తెలియజేయండి. మేము అందుకు అనుగుణంగా సర్దుబాటు చేస్తామని" అన్నారు. చివరకు తేదీలు ఖాళీ లేనందున కేసును మార్చి 19వ తేదీకి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

నియామక ప్రక్రియ, ఎంపిక కమిటీ పొందికను సవాలు చేసిన అంశం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే అర్ధరాత్రి సిఇసి, ఇసిల నియామకం జరపడం అమర్యాద, అగౌరవకరమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

చట్టం చెల్లుబాటుపై సుప్రీం కోర్టు తుది తీర్పు వెలువడకముందే కొత్త సిఇసి గ్యానేశ్ కుమార్, ఇసి వివేక్ జోషిలు బాధ్యతలు స్వీకరించడంతో భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై వారివైపు దేశ ప్రజలు, రాజకీయ పార్టీలు ఆశ, భయంతో చూస్తున్నారు.

కొత్త చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్ పదవీకాలం ఆరు సంవత్సరాలు లేదా 65 ఏళ్లు. దాని ప్రకారం 2029 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందుగానే గ్యానేశ్ కుమార్ 2029 జనవరిలో రిటైర్ అవుతారు. ఆ తరువాత సిఇసి అయ్యే వివేక్ జోషి ఆధ్వర్యంలో 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. కొత్త చట్టం ప్రకారం కేవలం సిఇసికి మాత్రమే ఆ పదవి నుంచి తొలగించకుండా రాజ్యాంగ రక్షణ ఉంది. ఇసిలకు ఆ రక్షణ లేదు. వారి కాలపరిమితి సిఇసి, భారత ప్రభుత్వం ఇష్టాయిష్టాలపై ఉంటుంది.

గ్యానేశ్ కుమార్ జనవరిలో సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. ఆయన 2022 మే నుంచి అమిత్‌షా నేతృత్వంలోని ఆ మంత్రిత్వ శాఖకు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2016 నుంచి 2018 వరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, 2018 నుంచి 2021 ఏప్రిల్ వరకు అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఆ సమయంలోనే ఆయన నేతృత్వంలోని విభాగం 2019 ఆగస్టులో కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ను రద్దు చేసింది. ఆయన మోదీ – షా ద్వయానికి విశ్వాసపాత్రుడైన అధికారి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రత జెండాను రెపరెపలాడిస్తారా? లేదా ఆయనను నియమించిన వారి ఆజ్ఞలను అనుసరిస్తారా?అనేది సందేహాలకు కాలమే సమాధానం చెబుతుంది.

**గ్యానేశ్ కుమార్ జనవరిలో సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు. ఆయన 2022 మే నుంచి అమిత్‌షా నేతృత్వంలోని ఆ మంత్రిత్వ శాఖకు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2016 నుంచి 2018 వరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, 2018 నుంచి 2021 ఏప్రిల్ వరకు అదనపు కార్యదర్శిగా ఉన్నారు. ఆ సమయంలోనే ఆయన నేతృత్వంలోని విభాగం 2019 ఆగస్టులో కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ను రద్దు చేసింది. ఆయన మోదీ – షా ద్వయానికి విశ్వాస పాత్రుడైన అధికారి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రత జెండాను రెపరెపలాడిస్తారా? లేదా ఆయనను నియమించిన వారి ఆజ్ఞలను అను-సరిస్తారా? అనేది కాలమే చెబుతుంది.**

అయితే, గ్యానేశ్ కుమార్ కంటే కూడా వివేక్ జోషిపై ఆశ, భయం ఎక్కువ స్థాయిలో ఉంది. ఎందుకంటే, ఆయన నేతృత్వంలోనే 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగతాయి కాబట్టి. హర్యానా క్యాడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి వివేక్ జోషి అంటే కేంద్ర ప్రభుత్వానికి ప్రేమ. ప్రత్యేకించి 1990 బ్యాచ్‌లో అనేక మంది సీనియర్ అధికారులను కాదని, 2024 నవంబర్‌లో ఆయన చీఫ్ సెక్రెటరీగా నియమితులైన తరువాత అందరికీ ఆ విషయం తెలిసింది. గతంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు కూడా ఆయనకు ప్రాధాన్యతను ఇచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో కొత్త సిఇసి, ఇసిల పట్ల బిజెపి అనుకూల జనం, రాజకీయ నాయకులలో ఆశ, బిజెపి వ్యతిరేక జనం, రాజకీయ నాయకులలో భయం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఇద్దరు అధికారులు మరింత బాధ్యతతో ఎలాంటి ద్వేషం లేదా సానుకూలత లేకుండా పని చేయాలి.

దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం స్వతంత్ర బావుటాను వారు ఉన్నతంగా ఎత్తిపట్టాలి. అదే సమయంలో అందరి కళ్ళు భారత సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కొత్తచట్టంపై వచ్చే తీర్పుపైనే ఉన్నాయి. తీర్పు సుదీర్ఘకాలం ఆలస్యం కావొద్దనే ఆకాంక్షలు సుప్రీం కోర్టుపై ఉన్నాయి.

# 'వారిపై' అసంతృప్తి ఎందుకు?

ఇటీవల రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గోపాల కృష్ణ నాయుడు రచించిన 'లైఫ్ ఆఫ్ ఎ కర్మయోగి – మెమొయిర్ ఆఫ్ ఎ సివిల్ సర్వెంట్' పుస్తకావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్ సర్వెంట్‌లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మారిన సివిల్ సర్వెంట్‌ల ధోరణిపై ఒకింత కటువుగానే మాట్లాడారు. గతంలో ప్రజాప్రతినిధులు ఏదై నా చెబితే అధికారులు అందులో లోటుపాట్లను విశ్లేషించేవారని, ఇప్పుడేమో ఒక తప్పు చేద్దామంటే మూడు చేద్దామనే అధికారులను చూస్తున్నామని, కొత్తగా ఐపిఎస్ అధికారులు శిక్షణలో ఉండగానే యూనిఫామ్ వేసుకొని ప్రైవేటు పంచాయతీలు తెంపుతున్నారని విశ్లేషించారు. కొందరు అధికారులు ఎసి గదులను విడిచి క్షేత్రస్థాయిలోకి వెళ్ళడం లేదని, ఈ విషయంలో తాను సంతోషంగా లేనని కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు.

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన 14 నెలల తరువాత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వెనుక ఆంతర్యం సుస్పష్టమే. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా, కీలక శాఖాధిపతులుగా గతంలో ఉన్న వారినే కొనసాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ, అనేక పథకాలను అమలు చేస్తున్నా రావాల్సినంత ఘనత తమ ప్రభుత్వానికి రావడం లేదనే అసంతృప్తి ముఖ్యమంత్రికి ఉంది. అలాగే తమ ప్రాధమ్యాలను నిక్కచ్చిగా చెబుతూ ఉన్నతాధికారులకు ఫ్రీ హ్యాండ్ ఇస్తున్నప్పటికీ కొందరు అలసత్వంతో వ్యవహరించడంతో ఆచరణ జరగడం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాలలో వరుస విషాహార సంఘటనలు వెలుగులోకి వచ్చిన తరువాత, కచ్చితంగా ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తనిఖీ చేసి, నెలకోసారి అక్కడ నిద్రించాలని ఆదేశించారు. అయినప్పటికీ ఇది సక్రమంగా అమలు జరగడం లేదు. అధికార యంత్రాంగంలో ఒకలాంటి జడత్వం వచ్చిందని భావిస్తున్నారు. గతంలో తమ అనుభవాలను ఆధారంగా పథకాలను ఏ విధంగా అమలు చేయాలనే సూచనలు ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలు చేయడమే కాకుండా, అమలు చేసి చూయించేవారు. కానీ, ఈ ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు తదితర దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా గందరగోళానికి దారి తీయటానికి సరైన నిర్దేశనం లేకపోవడమనే వాదన వినిపిస్తోంది.

రెండు దశాబ్దాల క్రితం పాలకులకు అనుగుణంగా తమ విధేయతను చాటుకునే ప్రక్రియ సివిల్ సర్వెంట్‌లోమొదలై, గడిచిన దశాబ్దంలో పరాకాష్ఠకు చేరుకుంది. పాలకులు సైతం తాము అనుకున్న వారికే అర్హతానుభవాలు లేకున్నా అందలం ఎక్కించటం, అన్నీ ఉన్న వారు నిక్కచ్చిగా ఉంటే లూప్‌లైన్‌లో వేయడం చూస్తూనే ఉన్నాం. గత పదేళ్ళలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కొందరు పార్టీలకు అనుగుణంగా వ్యవహరించటం, వారిని అందలం ఎక్కించటంతో పాటు, వారు తమకు అనుకూలమైన అధికారులనే పై నుంచి కింది వరకు నింపుకోవడం ద్యోతకమైంది. ప్రభుత్వాధినేతలు ప్రతిపక్షాలను తొక్కేయడంలో వారు వంత పాడటంతో, అధికారం మారగానే నాటి పాలకులతో పాటు వారు కూడా కేసులు ఎదుర్కోవాల్సిన ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఆ విధంగా తెలంగాణలో గత ప్రభుత్వంలో కీలక పోస్టులలో ఉన్న సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, కలెక్టర్‌లు ఇప్పుడు కాళేశ్వరం కమిషన్, ఫోన్ ట్యాపింగ్ విచారణ, విద్యుత్ విచారణ కమిషన్‌లలో విచారణను ఎదుర్కోవడం కనపబడుతుంది.విలువైన భూములు ఉన్న నగర చుట్టుపక్కల జిల్లాల్లో కలెక్టర్‌లుగా చేసిన వారు సైతం ఇడి దర్యాప్తులు చవి చూస్తున్నారు.

ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటివి ఎక్కువగా చూస్తున్నాం. చాలా కాలం తరవాత అధికార మార్పిడి జరగడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీకి సరైన మార్గదర్శనం చేసే అధికార యంత్రాంగం కరువవుతోంది. గత పాలకుల వాసనతోనో లేదా వీరి పట్ల అప్పట్లో ఉన్న విముఖతతోనో సరైన సహకారం లభించడం లేదనే అభిప్రాయం పరిశీలకులలో వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వంలో కూడా మంత్రుల కంటే అధికారుల రాజ్యమే సాగుతున్నది. కేంద్ర మంత్రులు లేకుండానే ప్రధాన మంత్రి నేరుగా శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, రాష్ట్రాల సిఎస్‌లు, డిజిపిలతో నేరుగా సమీక్షలు నిర్వహించడం 11ఏళ్ళుగా సర్వసాధారణమైంది. ఇలాంటి వ్యవహారాలతో మంత్రులను, ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను, ప్రతిపక్షాలను ఉన్నతాధికారులు ఖాతరు చేయని పరిస్థితి.

నిజానికి కార్యనిర్వాహకవర్గంలో అధికార యంత్రాంగం (బ్యూరోక్రసీ)దే కీలక పాత్ర. ప్రభుత్వానికి అది ముఖం, కళ్ళు, ముక్కు, చెవులు, చేతులు వంటిది. ఇంతటి ప్రధానమైన వ్యవస్థ నిష్పాక్షికంగా, నిస్వార్థంగా పని చేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. గతంలో శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్ వంటి బ్యూరోక్రాట్‌లు పనితీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుస్తకావిష్కరణలో నెమరేసుకున్నారు. గాడి తప్పుతున్న ప్రస్తుత వ్యవస్థలను సరి చేసేందుకు అలాంటి వారు తక్షణావసరం. భావితరాలకు ఆదర్శంగా నిలిచే ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు విలువలు క్షీణిస్తున్న సమాజానికి అత్యంత అవసరం.

## ప్రధాని మోదీ ప్రధాన కార్యదర్శి–2గా శక్తికాంత దాస్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోదీకి రెండవ ప్రధాన కార్యదర్శిగా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. శక్తికాంత దాస్ పదవీ కాలం నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు లేదంటే తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఏది ముందైతే అప్పటి దాకా ఉంటుందని కేంద్ర క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. గుజరాత్ కేడర్ కు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి పి కె మిశ్రా ప్రస్తుతం ప్రధానమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. అదేవిధంగా నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం పదవీకాలాన్ని కూడా ఒక ఏడాది పాటు పొడిగించారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2025 ఫిబ్రవరి 24తో ముగియనుండగా.. తాజా పొడగింపువల్ల ఆయన 2026 ఫిబ్రవరి 24 వరకు పదవిలో కొనసాగనున్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అయిన సుబ్రమణ్యం 1987 బ్యాచ్‌కు చెందిన వారు. రెండేళ్ల పదవీకాలానికి ఆయనను 2023 ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సిఇఒగా నియమించారు.

# భారత్–భూటాన్ ఆదర్శ స్నేహం

### విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్, భూటాన్ దేశాల మధ్య ఆదర్శప్రాయమైన స్నేహం కొనసాగుతున్నదని, భూటాన్ ప్రధాని రెండు రోజుల పర్యటనతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత పటిష్టమయ్యాయని విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. అన్ని స్థాయిలలో నమ్మకం, సద్భావన, పరస్పరం విశ్వాసం ఆలంబనగా ఇరు దేశాల స్నేహం ఉచ్చ దశకు చేరుకుంటోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని ట్సెరింగ్ టోబ్గె రెండు రోజుల పర్యటనకు భారత్‌కు వచ్చారు. ఆయన భారత ప్రధాని మోదీతో కలిసి స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్(సోల్) విద్యా సంస్థలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వేస్, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరిట, ఇతర సీనియర్ అధికారులు భూటాన్ ప్రధానిని కలుసుకున్నారని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. ఇరు దేశాల మధ్య తరచూ ఉన్నత స్థాయి సమావేశాల సాంప్రదాయాన్ని భూటాన్ రాజు కొనసాగించారని, ఇది ఇరు దేశాల స్నేహం విశిష్ట లక్షణమన్నారు. సోల్ విద్యా సంస్థ సమావేశం సందర్భంగా భూటాన్ ప్రధాని మాట్లాడుతూ మోదీ తన పెద్దన్న, గురువు అని పేర్కొన్నారని, మోదీ మార్గదర్శకత్వంలో తమ దేశానికి ఉన్నత సేవలను అందించేందుకు స్ఫూర్తి పొందుతానని చెప్పినట్లు ప్రకటనలో తెలిపారు. టోబ్గె తన ప్రసంగాన్ని తరచూ హిందీలో కొనసాగించడం ఆహూతుల ప్రశంసలందుకుంది. నిస్సందేహంగా పెద్దన్న తరహాలో మీ మార్గదర్శకత్వం నాకు ఎంతో సహకరించింది అని టోబ్గె హిందీలో పేర్కొన్నారు. మోదీ మానస పుత్రిక అయిన సోల్ సంస్థ భారత దేశానికి విశిష్ట మార్గదర్శకులను రూపొందిస్తుందని, భారత యువతను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మోదీ చేస్తున్న కృషి అద్వితీయమని ప్రశంసలు కురిపించారు.

### మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు అతిథిగా మోదీ

మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ గౌరవ అతిథిగా హాజరవుతారు. రెండు దేశాలమధ్య సన్నిహితసంబంధాలకు మారిషస్ అపారగౌరవం ఇస్తున్నది. "వచ్చేనెలలో మారిషస్ 57వ జాతీయ స్వాతంత్ర్య వారికోత్సవం జరుగుతుంది. ఈ నేపథ్యంలో భారత ప్ర ధానమంత్రి నరేంద్రమో దీ మన ఉత్సవాల్లో పాల్గొనేందుకు అంగీకరించారని చెప్పడానికి నేను ఎంతో సం తోషిస్తున్నాను" అని మారిసస్ జాతీయ అసెంబ్లీలో ఆ దేశ ప్రధానమంత్రి రాంగూలన్ ప్రకటించారు. ఈ సందర్భంగా జాతీ య అసెంబ్లీలో రాంగూల న్ మాట్లాడుతూ, పారిస్‌లో మోదీ ఇటీవలి పర్యటన, అమెరికా పర్యటన గురించి కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. మోదీ పర్యటన రెండు దేశాలమధ్య సన్నిహిత సంబంధాలకు ఒక ఉదాహరణ అని రాంగూలన్ చెప్పారు.

### భారత్ పర్యటనకు ఇయు అధ్యక్షురాలు

యూరోపియన్ యూనియన్(ఇయు) అధ్యక్షురాలు ఉర్సుల వాన్ డర్ లేయన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు రానున్నారని శనివారం విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఈ పర్యటనతో యూరోపియన్ యూనియన్‌తో కీలక రంగాలలో సంబంధాలు మరింత బలపడనున్నాయి. ప్రధాని మోదీ ఆహ్వానంపై యూరోపియన్ యూనియన్ కాలేజ్ ఉన్నత స్థాయి కమిషనర్లతో లేయన్ 27, 28 తేదీలలో భారత్‌లో పర్యటించనున్నారు. పలు ఇయు కాలేజ్ ఆఫ్ కమిషనర్లు కలిసి భారత్ పర్యటించనుండడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీ ఉన్నత స్థాయి ప్రతినిధులతో లేయన్‌తో చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, సాంకేతిక రంగాలలో ఇండయా, ఇయూ మధ్య రెండో విడత చర్చలతో పాటు ఇయు కమిషనర్లతో ఆ స్థాయి భారత ప్రతినిధుల బృందంకూడా చర్చలు జరపనున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. లేయన్ భారత్ పర్యటించడం ఇది మూడోసారి. మొదటిసారి 2022 ఏప్రిల్‌లో ద్వైపాక్షిక చర్చలకు, 2023 సెప్టెంబర్‌లో జి20 నేతల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు భారత్‌ను సందర్శించారు. 2004నుంచి భారత్, ఇయుల మధ్య పలు కీలక రంగాలలో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. లేయన్, ఇయు కాలేజ్ ఆఫ్ కమిషనర్ల సందర్శన ఈ భాగస్వామ్యాన్ని మరింత బలపరిచేదిగా ఉంటుందని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

## జంతుదాడులు తగ్గించేందుకు నిధులు పెంచండి

### కేరళ సిఎంకు ప్రియాంకాగాంధీ లేఖ



తిరువనంతపురం : వయనాడ్, మల్లప్పురం జిల్లాల్లోని ఉన్నతశ్రేణి ప్రాంతాల్లో జరుగుతున్న జంతు దాడులను తగ్గించేందుకు నిధులు పెంచాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేరళ సిఎం పినరయ్ విజయన్‌కు ఆమె లేఖ రాశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరిపేందుకు, జంతు దాడులు జరుగుతున్న ప్రాంతాల్లో మానవ జీవితాలు, నివాసాల రక్షణకు చర్యలు వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఈనెల 20వ తేదీన రాసిన లేఖలో ప్రియాంక పేర్కొన్నారు. తాను ఇటీవల జంతుదాడుల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించినపుడు ప్రజల్లో భయాందోళనలు నెలకొనడాన్ని గ్రహించానన్నారు. తమను రక్షిస్తారన్న విశ్వాసాన్ని స్థానిక అధికారులలో కొరవడడం గుర్తించానని ప్రియాంక పేర్కొన్నారు. అత్యధిక ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలకు ఒప్పుకోవడం లేదని, జంతునిరోధక గోడలను నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. డిసెంబర్ 27, 2024, ఫిబ్రవరి 12 మధ్య తన నియోజకవర్గంలో ఏడుగురు వ్యక్తులు జంతువుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని ఆమె పేర్కొన్నారు. ఈ మరణాలు వల్ల జీవనోపాధి కోల్పోవడంతో పాటు, ఈ ప్రాంత ప్రజలలో భయం, బాధ, అపారమైన వేదనకు కారణమవుతున్నాయన్నారు. అడవులు, వన్యప్రాణుల అభయారణ్యాలను రక్షించే చట్టాలను పాటిస్తూ మానవ ప్రాణాలను రక్షించడానికి స్థానిక అధికారులు తమ పరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని కూడా కాంగ్రెస్ ఎంపి గుర్తించామన్నారు. అయితే, అటవీ ప్రాంతాలలో, చుట్టుపక్కల మానవ ఆవాసాలను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవడానికి అవసరమైన నిధులు స్థానిక పరిపాలనకు అందుబాటులో లేవని భావిస్తున్నానని చెప్పారు. నిధులను అందించే బాధ్యతలో గణనీయమైన భాగం పర్యావరణ మంత్రిత్వ శాఖపై ఉందని, రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు జరపాల్సిన అవసరం ఉందని ప్రియాంక అన్నారు. వయనాడ్‌లోని జిల్లా అధికారులు జంతువుల కదలికలను పర్యవేక్షించడానికి, రాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టి) వాహనాల సంఖ్యను విస్తరించడానికి థర్మల్ డ్రోన్‌లు, కెమెరా ట్రాప్‌లు, సిసిటివి కెమెరాలు, రేడియో కాలర్‌లను కొనుగోలు చేయడానికి నిధులలో గణనీయమైన పెరుగుదల అవసరమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా, ఏనుగు నిరోధక కందకాలు, గోడలు, సోలార్ ఫెన్సింగ్, వేలాడే కంచెలు వంటి భౌతిక అడ్డంకులను నిర్మించడానినిక, నిర్వహించడానికి నిధులు అత్యవసరంగా అవసరమని ఆమె వాదించారు. మెరుగైన కందకాలు, శాశ్వత ఉపాధి, మెరుగైన వేతనాలతో అదనపు అటవీ కాపలాదారులు, పరికరాలతో సహా జంతువుల దాడుల వల్ల ప్రభావితమైన కుటుంబాల అవసరాలను కూడా ఆమె ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

## డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో కొత్త చట్టాలు అవశ్యం

న్యూఢిల్లీ : డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో హానీకరమైన కంటెంట్‌ను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యను సూచించడానికి ఇప్పటికేఉన్న చట్టబద్ధమైన నిబంధనలు సహా కొత్త న్యాయ చట్టాలను కూడా వర్తింపజేయడాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. యూట్యూబ్ ప్రోగ్రామ్‌లో రణ్‌వీర్ అల్లాబడియా విపరీతవివాదాస్పద వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నిఘాను పదునుపెడుతూ ముందుకుసాగేందుకు ప్రభుత్వాలు జాగరూకత వహించాలని సూచించింది. పార్లమెంటరీ కమిటీ కమ్యూనికేషన్ సమస్యలపై మంత్రిత్వ శాఖ తన సమాధానంలో ..డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లలో అశ్లీల, హింసాత్మక కంటెంట్‌ను ప్రదర్శించడానికి భావప్రకటనా స్వేచ్ఛ సంబంధిత రాజ్యాంగ హక్కు దుర్వినియోగమై సమాజంలో ఆందోళన పెరిగిపోతున్నదని తెలిపింది. బిజెపి ఎంపి నిశికాంత్ దూబె నేతృత్వంలోని కమ్యూనికేషన్, ఇన్‌ఫర్మేషన్ టె క్నాలజీపై నియమించిన స్టాండింగ్ కమిటీకి ప్రస్తుత చ ట్టాల ప్రకారం కొన్ని నిబంధనలు ఉన్నాయని, అ లాంటి హానీకరమైన కంటెంట్‌ను నియంత్రించేందు కు కఠినమైన, సమర్థవంతమైన చట్టపరమైన రూపకల్పనకు డిమాండ్ పెరుగుతోందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఈ మం త్రిత్వ శాఖ ప్రస్తుత చట్టబద్ధమైన నిబంధనలను పరిశీలించే ప్రక్రియలో ఈ పరిణామాలను పరిగణనలోనికి తీసుకుని ఒక కొత్త న్యాయ చట్టాల రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందని గుర్తించిందని వివరించింది. ఈ అంశంపై అనేక హైకోర్టులు, సుప్రీంకో ర్టు, ఎంపీలు, జాతీయ మహిళా కమిషన్ మొదలైన చట్టబద్ధమైన సంస్థలు మాట్లాడాయని తెలిపింది. సో షల్‌మీడియా ప్రభావశీలుడు రణ్‌వీర్ అల్లాబడియా హానీకర, వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకి ఎక్కిన అనంతరం ఆయన ధోరణిని ఖండించడం పెరిగిపోతున్న తరుణంలో ఈ ప్రస్తావన చోటుచేసుకుంది. ఆయన క్షమాపణలు ఏమాత్రం వివాదాన్ని తగ్గించలేకపోయింది. సుప్రీంకోర్టు ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించినప్పటికీ సర్వోన్నత న్యాయస్థానం కూడా ఆయనపై కీలక వ్యాఖ్యానా లు చే సింది.

రణ్‌వీర్ అల్లాబడియా చేసిన 'అసభ్యకర వివాదాస్పద వ్యాఖ్యలకు సమాజం సిగ్గుపడుతోంది' అని అత్యున్నత న్యాయస్థానం తలంటింది. కొత్త టెక్నాల జీ, మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ఆవిర్భావం నేపథ్యం లో వి వాదాస్పద కంటెంట్‌ను అరికట్టేందుకు ప్ర స్తు త చ ట్టాలలో సవరణలు అవసరమని ఫిబ్రవరి 13న కే ద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను కోరింది. పార్టీ శ్రేణులకు అతీతంగా సభ్యులు రణ్‌వీర్ అల్లాబడియా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్ర భుత్వానికి లేఖ రాయడానికి కమిటీని ప్రేరేపించారు.

## మద్యం దుకాణాలు తెరవడం వల్లే .. ప్రజాగ్రహానికి గురైన కేజ్రీవాల్



### సామాజిక కార్యకర్త అన్నా హజారే

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ మంచి పనులు చేశారని, కానీ ఆయన మద్యం దుకాణాలను తెరవడం ప్రారంభించారని, ఫలితంగా ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారని సామాజిక కార్యకర్త అన్నా హజారే అన్నారు. రేఖా గుప్తా అనే మహిళ దేశ రాజధానికి కొత్త ముఖ్యమంత్రి కావడం గర్వకారణమని, స్వ చ్ఛమైన ఆలోచనలు, పనుల కారణంగానే ప్రజలు ఆమెకు ఓటు వేశారని మీడియాకు తెలిపారు. ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ సమాజం ముందు ఒక ఉదాహరణగా నిలబడాలని, కానీ దారితప్పిపోయారని, అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు కారణమైన 80 సామాజిక కార్యకర్త అన్నారు. 'మునుపటి ముఖ్యమంత్రి (కేజ్రీవాల్) మంచి చేశారు. మూడుసార్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మంచి పని చేస్తున్నందున నేను (అతనికి వ్యతిరేకంగా) ఏమీ మాట్లాడలేదు. కానీ, ఆయన నెమ్మదిగా మద్యం దుకాణాల ను తెరవడం, లైసెన్స్‌లు జారీ చేయడం ప్రారంభించారు. అప్పుడు నేను బాధపడ్డాను' అని ఆప్ ప్రభు త్వ వివాదాస్పద ఎక్సైజ్ విధానాన్ని ప్రస్తావిస్తూ హ జారే విలేకరులతో అన్నారు. ముఖ్యంగా హజారే మద్యం సేవించడం లేదా అమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తిగా పేరుగాంచారు. కేజ్రీవాల్ ఒకప్పుడు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారేతో కలిసి పనిచేశారు, కానీ 2012లో హజారే ఆప్‌ను స్థాపించిన తర్వాత ఇద్దరూ విడిపోయారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఎన్నికల్లో, కేజ్రీవాల్ తన స్థానాన్ని కోల్పోవడంతో, బిజెపి ఢిల్లీలో ఆప్‌ను అధికారం నుండి తొలగించింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021–22ను సవరించేటప్పుడు అక్రమాలు జరిగాయని, లైసెన్స్ హోల్డర్లకు అనుచిత ప్రయోజనాలు కల్పించారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించాయి. ఈ పాలసీని తరువాత రద్దు చేశారు.

## ద్రవ్యోల్బణ సమస్య పరిష్కరించరా?



### కేంద్రంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : ఆహార పదార్థాల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ కేంద్రంపై ధ్వజమెత్తింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల సమస్యను గుర్తిస్తే, ముం దుగా ద్రవ్యోల్బణం సమస్యను అర్థం చేసుకోవాలని, అందుకు నివారణ చర్యలను చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించింది. కాంగ్రెస్ ప్రచార విభాగం అధిపతి జైరాం రమేశ్ ఒక మీడియా నివేదికను ప్రస్తావిస్తూ కూరగాయల ధరలు పడిపోవడంతో సగటు ద్రవ్యోల్బణం రేటు తగ్గిపోయిందని, అయితే ఇతర ఆహార పదార్థాల ధరలు, ముఖ్యంగా తృణధాన్యాల ధరలు బాగా తగ్గాయని అన్నారు. 'దేశ ప్రజలు మోదీ ప్రభుత్వంలో ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు కనీసం రెండు పూట్ల తిండికి నోచుకోలేకపోతున్నారు. అన్ని విషయాలలో ద్రవ్యోల్బణం రాకెట్‌లా దూసుకుపోతోంది' అని రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మోదీ ప్రభుత్వం ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై ఎంతకాలం మౌనం వహించినా, అధికారిక నివేదికలే తాజా పరిస్థితిని వెల్లడిస్తున్నాయన్నారు. రిజర్వ్ బ్యాంకు నెలవారీ నివేదికకూడా వంట దినుసుల ధరలు పెరిగిపోతున్నాయన్న విషయాన్ని రమేశ్ ప్రస్తావించారు. తృణ ధాన్యాల ధరలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. కందిపప్పు ధర రూ.141కి చేరుకుందని, ఇ–కామర్స్ సంస్థలు దీనిని రూ.200 వరకు విక్రయిస్తున్నాయన్నారు. 2023తో పోల్చుకుంటే టమాటా ధరలు కూడా రెట్టింపు అయ్యాయన్నారు. ఆర్బీఐ నివేదిక ప్రకారం వంట నూనెలు, గోధుమ, బియ్యం, ముతక ధాన్యం ధరలుకూడా పెరిగాయన్నారు. ప్రజల సమస్యలపై మోదీ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు ఉన్నా, ముందుగా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థిక వైఫల్యాలపై, పెరుగుతున్న నిరుద్యోగితపై గత కొద్దికాలంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నది.

## రాజస్థాన్ అసెంబ్లీలోనే కాంగ్రెస్ ఎంఎల్‌ఎల ధర్నా



జైపూర్ : పార్టీకి చెందిన ఆరుగురిని సస్పెన్షన్ చేసినందుకు నిరసన గా రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు అసెంబ్లీలో తమ ధర్నా కొనసాగించారు. ఇందుకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేలు అసెంబ్లీలోనే గడిపారని ప్రతిపక్ష నాయకుడు తికారామ్ జుల్లి తెలిపారు. ముగ్గురు మంత్రులు సీనియర్ నాయకులతో చర్చలు నిర్వహించినా కొలిక్కి రాకపోవడంతో ధర్నా కొనసాగించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. అసెంబ్లీలో మంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వానికి కూడా అసెంబ్లీ కొనసాగడం ఇష్టం లేదని, అందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని తికారామ్ వెల్లడించారు. శుక్రవారం స్పీకర్ ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి సభను వాయిదా వేసిన తరువాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలోనే ధర్నా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం సభలో మంత్రి అవినాష్ గెహ్లాట్ ప్రసంగిస్తూ ఒక పథకానికి మీ 'దాది(ఇందిరాగాంధీ)' పేరును ప్రస్తావించారనడం వివాదానికి దారితీసింది. మూడుసార్లు వాయిదా అనంతరం ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. దీనితో మంత్రి వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోనే ధర్నా ప్రారంభించారు. ప్రస్తుతం నిరసన జిల్లాలకు వ్యాపించింది.

## పాక్ జైలునుంచి 22మంది జాలర్లు విడుదల

ఇస్లామాబాద్ : శిక్ష పూర్తి చేసుకున్న 22 మంది భారత జాలర్లను కరాచి మలిర్ జైలు నుంచి పాకిస్తాన్ అధికారులు విడుదల చేసినట్టు, శనివారం వారిని భారత్‌కు అప్పగించనున్నట్టు మీడియా సమాచారం. శిక్షా కాలం పూర్తవడంతో జాలర్లను మలిర్ జైలునుంచి విడుదల చేశామని జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా తెలిపారని ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక వెల్లడించింది. ఇధి ఫౌండేషన్‌ను చెందిన ఫైజల్ ఇధి వారు లాహోర్ చేరేందుకు ఏర్పాట్లు చేశారని, అక్కడినుంచి వారు భారత్‌కు చేరుకుంటారని ఆ పత్రిక తెలిపింది. జాలర్ల ప్రయాణ ఖర్చులతోపాటు ఇధి ఫౌండేషన్ వారికి బహుమతులు, నగదు అందజేసింది. అనుకోకుండా సరిహద్దులు దాటి వచ్చే జాలర్ల విషయంలో మరింత కారుణ్యం పాటించే విధానాలను రూపొందించాలని ఫౌండేషన్ ఇరు దేశాను కోరింది.

ఖైదీల పరస్పర బదిలీ జాబితా ప్రకారం ఈ యేడాది జనవరి 1 నాటికి పాకిస్థాన్‌లో 266మంది ఖైదీలు(49మంది పౌరులు, 217మంది జాలర్లు), భారత్ లో 462మంది ఖైదీలు(381మంది పౌరులు, 81మంది జాలర్లు) ఉన్నట్టు సమాచారం.

## ఎనిమిదిమంది అరెస్ట్

ఇంఫాల్ : ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని నిషేధిత సంస్థకు చెందిన ఆరుగురిని, తూర్పు ఇంఫాల్‌లో దోపిడీ సంఘటనకు సంబంధించి ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిషేధిత సంస్థ కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ(ఇబంగొ ఎన్‌గాంగమ్)కు చెందిన ఆరుగురిని పశ్చిమ ఇంఫాల్‌లోని కొంట్రక్ మఖ లీకై చర్చిలో శుక్రవారం అరెస్టు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. తూర్పు ఇంఫాల్ జిల్లాలో జరిగిన దోపిడీ సంఘటనకు సంబంధించి జి5 సంస్థకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు.చురచందపూర్ ప్రాంతంతో స్థానికులు ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసినట్టు ఎస్‌పి ప్రఖార్ పాండే తెలిపారు. అనుమతి లేని ఆయుధాలను స్వాధీనం చేయాలన్న పోలీసులు అవగాహన చర్యలకు స్పందనగా సాధారణ ప్రజలు ఆయుధాలను స్వాధీనం చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. మొత్తంగా 14 ఆయుధాలను, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసినట్టు తెలిపారు. మావోజంగ్ ప్రాంతంలో తనిఖీ సందర్భంగా భద్రత సిబ్బంది రెండు ఐఇడి(ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్)లను, రెండు బాంబులను స్వాధీనం చేసుకున్నామన్నారు. 2023 అల్లర్ల అనంతరం మణిపూర్ పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.


BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 823 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar
.... Disputant
VERSUS
S.PATTABHI & OTHERS
.....Opponents
1. Samala Pattabhi S/O Laxminarayana Aged About 49 Years Occ: Teacher ZPHS Ookal. R/O. H.No. 2-9-165, Vikasnagar, Hanamkonda.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 821 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar,
........Disputant
VERSUS
M.ARJUN & OTHERS
......Opponents
1. Marampally Arjun S/O Rajam Aged About 56 Years Occ: GHM-Gr-II-ZPHS Kathalapur R/O. H.No. 35-3-1431. Sre Ganeshnagar colony, Gopalpur, Hanamkonda.
2. Mamidipally Srinivas S/O Gangareddy Aged About 46 Years Occ: Teacher a MPUPS Dumpeta, R/O. H.No. 8-50, Kathalapur, Jagitial.
4. Jillapalli Ramesh S/O Koumaraiah Aged About 52 Years Occ: Teacher-MPPS-Komera R/O. H.No.2-52, Kannur.Kamalapur, Karimnagar.
5. Marampally Rushitha D/O Arjun Aged About 31 Years Occ:Software Employee, R/O. H.No. 3-98/2, bank Colony, Gopalpur, Hanamkonda.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 824 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar,
....Disputant
VERSUS
MOHD.KHAZAMAHINODDIN & OTHERS
...Opponents
1. Mohammed Khazamohinoddin S/O Sadhik Aged About 28 Years Occ: Pvt Employer- R/O. H.No. 14-6-194, Nizampura, Warangal.
2. Neelam Sureshbabu S/O Venkatramnarsaiah Aged About 47 Years Occ: VRO-Nallella(vill)Kuravi (mdl) R/O. H.No. 16-8-73.Abbanikunta, Warangal.
3. Merugu Omprakesh S/O Yellaiah Aged About 44 Years Occ: Tech-III/SSE/OHE/TRO/KZJ. R/O. H.No. 12-11-730, Warasiguda, Sec-bad.
4. Shaik Afzal S/O Yakubali Aged About 37 Years Occ:Business. R/O. H.No.9-2-168, Charbowli, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 815 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar,
... Disputant
VERSUS
N.SUMAN & OTHERS
.....Opponents
3. Boorugu Sunil S/O Pushpagiri, Aged About: 37 Years, Occ: VRO - Matawada(vill), Gudur (mdl). R/O. H.No. 2-29, Duggondi.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 816 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal- Branch, Rep by its GPA Holder cum Legal Managar,
.....Disputant
VERSUS
G.RAMBABU & OTHERS
...Opponents
1. Guguloth Rambabu S/O Lalu Aged About 31 Years Occ:Teacher at GPS/AGHS Murutla. R/O. H.No.2-34, Bhagynagra Thanda, Singareni, Khammam.
2. Erpa Sathish S/O Ramulu Aged About 38 Years Occ:Teacher GPS Abbireddygudem. R/O. H.No. 1-62,Komararam, Yellendu, Bhadradri.
3. Poleboina, Kankaiah S/O Paparao Aged About 53 Years Occ:Teacher-TW AHS Tekulapally.R/O.H.No.21-82, Kanchanapalli, Gundala Khammam.
4. Banoth Naresh S/O Krishna Aged About 37 Years Occ: Teacher-Hm ZPSS Mittapalli.R/O.H.No. 1-57, Samya Thanda, Bhagynagra Thanda, Singareni, Khammam.
5. Banoth Sunitha D/O Krishna Aged About 32 Years Occ:Teacher MPPS Pocharam Thanda.R/O. H.No. 1-57, Samya Thanda, Bhagynagra Thanda, Singareni, Khammam.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 817 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd.. Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar,
.....Disputant
VERSUS
HADI HASSAN & OTHERS
......Opponents
1. Hadi Hassan S/O Hassan Mirza Aged About 60 Years Occ: Bussines R/O.H.No.6-5-115, Machilibazar, Water tank, Hanamkonda.
2. Bhukya Venkatraram S/O Vasuram Aged About 48 Years Occ: Teacher a MPPS Bodonikunta Thanda. R/O. H.No. 2-10-904. Bank Colony, Hanamkonda.
3. Mohd Sarwar Pasha S/O Mohd. Afzal Aged About 45 Years Occ: MNO-Gr-II-MGO Hospital. TS.R/O. H.No. 11-23-1644/9, LB Nagar, Warangal
4. Shaik Afzal S/O Yakub Ali Aged About 37 Years Occ: Business. R/O. H.No.9-2-168, Charbowli, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 819 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch. Rep by its GPA Holder cum Legal Managar,
...Disputant
VERSUS
CH.MAHESH & OTHERS
...Opponents
1. Chaparthy Mahesh S/O Sudhakar Aged About 28 Years Occ: Business. R/O. H.No. C-234/1, Indira Nagar, Geesugonda, Warangal.
2. Naini Dilip Kumar S/O Dasharath Kumar Aged About 33 Years Occ: Helper Khalasi Scrly Kzpt. R/O. H.No. 7-171,7 Ward, Hanamkonda.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 820 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-1 Branch, Rep by its GPA Holder cum Legal Managar
.....Disputant
VERSUS
K.SRIKANTH & OTHERS
.....Opponents
1. Kolipaka Srikanth S/O Sambaiah Aged About 29 Years Occ:Officer Bandhan Bank ltd. R/O. H.No. 7-41, Suripally, Nekkonda, Warangal.
2. Naini Dilip Kumar S/O Dasharath Kumar Aged About 33 Years Occ:Helper Khalasi Scrly Kzpt. R/O. H.No. 7-171.7 Ward, Hanamkonda.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ABR. NO. 822 OF 2024
Between:-
M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal- Branch, Rep by its GPA Holder cum Legal Managar,
... Disputant
VERSUS
D.VIKRAM & OTHERS ......Opponents
2. Dugyala Mohan Rao S/O Madhava rao Aged About 61 Years Occ:Business. R/O. H.No.5-13.Madhava Rao Pally, Dharmraopet, Warangal.
3. Maroju Haripriya D/O Prabhakar Aged About 46 Years Occ:Principal(FAC) Govt Jr College Jangaon.R/O.H.No.2-10-288-91.Flat No.206,GMR Brundavan Apprt, Hanamkonda.
4. Gade Sucharitha W/O E.Pagi Reddy Aged About 58 Years Occ: Teacher (LP)UPS, Mulakalgudem R/O.H.No.2-2-421,Kishanpura, Hanamkonda.
5. Pingili Pratheek Reddy S/O Suresh Reddy Aged About 32 Years Occ:Business.R/O. H.No.3-109, Vangapally, Reddywada, Kamalpur,karimnagar.
7. Munja Akhil S/O Srinivas Aged About 26 Years Occ:Business.R/O. H.No.5-39, Hasanparthy, Madipally, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL.



## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఐ ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను అధికారులు ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లోని పని చేయని బోర్లు, చేతి పంపులు, మోటార్ సింగిల్ ఫేజ్ మోటార్లను వెంటనే మరమ్మత్తు చేయాలన్నారు. మండల కేంద్రంలో అన్ని వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని, మిషన్ భగీరథ అధికారులు నీటిని సకాలంలో అందించాలన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్, ఎంపిడిఓ, మైనింగ్, పోలీస్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేయాలని, రీచ్‌ల వద్ద నైట్ విజన్ కెమెరాలతో పాటు హైరెజల్యూషన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్ రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కోఆర్డినేటర్ ఎం.సరిత తెలిపారు. సోమవారం శిక్షణ సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న ఎడ్యుకేషన్ కోర్సులు, కంప్యూటర్ బేసిక్స్, పీజీ డిప్లమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ , డిటిపి, అదేవిధంగా విద్యార్థినీలకు, యువతులకు కంప్యూటర్, బ్యూటీషియన్, డిప్లమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, టెక్ టైల్స్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర కోర్సులలోలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.50 శాతం ఫీజు రాయితీతో విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 24 నుంచి పట్టణంలోని దేవరకొండ రోడ్ లో గల ప్రతీక్ రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పక్కనగల సెట్విన్ కేంద్రంలో ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.పూర్తి వివరాల కోసం 9705041789 సెల్ నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

## భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

బ్రహ్మోత్సవాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కుహాజరైన జిల్లా కలెక్టర్‌కు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శనివారం ప్రారంభమైన స్వామివారి ఉత్సవాలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా నేటి రాత్రి స్వామివారి కల్యాణోత్సవం 23వ తేదీ అర్ధరాత్రి అగ్నిగుండాలు 24వ తేదీ రోజున స్వామివారి చక్రస్థానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు దేవాదాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణా రెడ్డి, తాసిల్దార్ ఎం.శ్రీధర్, ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటి చైర్మన్ సందిగారి బసవయ్య, కార్యనిర్వహణ అధికారి గోలి నరేందర్ రెడ్డి, పూజారులు జేర్పుల రామ్ సింగ్, జేర్పుల పుణ్యాసింగ్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా పది పరీక్షలు

జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** మార్చినెలలో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మదిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లాలో నిర్వహించుటకు అధికారులు అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, వెంటిలేషన్, లైటింగ్, బల్లాలు ఉండే విధంగా చూడాలన్నారు. విద్యార్థులను కింద కూర్చోబెట్టి పరీక్షలు రాయించవద్దని తెలిపారు. ప్రతి విద్యార్థి పరీక్ష హాల్‌లోకి అనుమతించే ముందు గేటు వద్దనే క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు పని చేస్తున్నాయా లేదా 18వ తేదీ వరకు రిపోర్టు ఇవ్వాలన్నారు. ప్రశ్నపత్రాలను ఇన్విజిలేటర్‌కు అప్పగించే ముందు సబ్జెక్టు, కోడ్‌ను ధృవీకరించాలన్నారు. బాలికలు, బాలురలకు వేర్వేరు టాయిలేట్ల సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరీక్ష నిర్వహణ అధికారి శీనయ్య, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎస్‌పి కాలువల ద్వారా సాగునీరు అందించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** శ్రీరాంసాగర్ సాగర్ కాలువల ద్వారా పెన్‌పహాడ్, మునగాల మండలాలకు సాగునీరు అందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌పహాడ్, మునగాల మండలాలకు ఎస్ఆర్ఎస్‌పి జలాలు అందక 20వేల ఎకరాలు వరి పొలాలు ఎండిపోయే దశకు వచ్చాయని అన్నారు. కాలువలలో వచ్చే నీటిని పై రైతులు ఆపకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పొలాలు ఎండిపోకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నెమ్మాది పిరయ్య, మాజీ ఎంపిటిసి శివాజీ, లాల్, రాములు, గోపి, సుధాకర్, వెంకట్ రెడ్డి, రవి, సీతారాం నాయక్, గాంధీ, చంద్రు, వెంకన్న పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు

జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/బీబీనగర్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి విద్యార్థుల ఉత్తీర్ణ శాతాన్ని పెరిగేలా చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులకు, పౌష్టికాహారం అందించినప్పుడే జ్ఞాపకశక్తి పెరుగుతుందని విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు తల్లి దండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు గణితంలో బాగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా సూచనలు చేయాలని హెడ్మాస్టర్‌ను కోరారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లిగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పాఠశాలలు, కళాశాలలు, కెజిబివి పాఠశాలల్లో ఈ చట్టంపై వగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు ఎక్కడ సమూహంగా ఉంటే చట్టం ప్రాముఖ్యతపై ప్రచార సామాగ్రి కళాజాతతో ప్రచారం చేయాలన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, అబార్షన్లు చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, డిఎస్‌పి రవి, ప్రొగ్రాం ఆఫిసర్ డాక్టర్ అనిత రాణి, డాక్టర్ నాజియా, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళనకు వెంటనే పూనుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి
గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం/భువనగిరి :** మూసీనది ప్రవహించే ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, మూసీ ప్రక్షాళనకు వెంటనే పూనుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణదివ్య విమాన గోపురం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానమునకు తమరు విచ్చేయుచున్నందున యాదాద్రి భువనగిరి జిల్లాలో నెలకొన్న కొన్ని ప్రధానమైన సమస్యలు మీ దృష్టికి మా పార్టీ తరపున తీసుకు వెళ్ళనున్నట్లు ఆయన చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిని మరింత అభివృద్ధిపరిచి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఆసుపత్రిలో లోటుపాట్లు బాగా జరగుతున్న ఆసుపత్రి ప్రారంభం నుండి నేటి వరకు డైరెక్టర్ వికాస్ భాటియానే ఉంటున్నారన్నారు. గతములో పనిచేసిన కాంట్రాక్టర్ ఉద్యోగాలు నియమించే విషయములో పలు ఆరోపణలు ఎదుర్కొన్నరన్నారు. 24 గంటలు అత్యవసర చికిత్స విధానం తప్పనిసరిగా ఉండాలని, ఓపి కూడా 24 గంటలు అందుబాటులో ఉండాలని రోగులను హైద్రాబాద్కు పంపించకుండా అందులోనే చికిత్స చేసే ఏర్పాటు తక్షణమే చేయాలని కోరారు. అ ఆసుపత్రిలో లేనటువంటి అన్ని పరికరాలు సమకూర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. యాదగిరిగుట్టలో ఉన్న ఆర్టీసి డిపోను పునరుద్ధరణ చేయాలని, దీనికోసం సరిపడా నిధులు మంజూరు చేసి డిపోకు అన్నిరకాల పూర్తి సదుపాయాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వస్తున్న బస్సులు ఈ డిపోలోనే నిలుపుదల చేసి నైట్ హాల్ట్ కూడా యాదగిరిగుట్టలోనే ఉండాలన్నారు. ఈ డిపోకు సరిపడా స్థలం కూడా యున్నది. స్థానిక ప్రజలు ఈ డిపో నుండి వెళ్ళే బస్సులపై ఆధారపడి బ్రతుకుచున్నారు. అర్ధ రహితంగా ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేసినా వినకుండా ఘాట్ రోడ్డును వేశారన్నారు. ఈ కారణంగా భక్తులు, వాహనాలు నేరుగా ఘాట్ రోడ్డు నుండి పైకి వెళ్ళిపోవుచున్నారు. వందల సంఖ్యలో ఉన్న వ్యాపారాలు పూర్తిగా నడవడం లేదన్నారు. వెంటనే ఘాట్ రోడ్డును తొలగించాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు సహకరిస్తారన్నారు. యాదగిరిగుట్ట పట్టణ అభివృద్ధి కోసం సరిపడా నిధులు ఇస్తామని తమరు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుచున్నాము. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో అన్ని సదుపాయాలతో మంచి టౌన్ హాలును నిర్మించాలన్నారు. భువనగిరి పట్టణములో ప్రభుత్వ సర్వే ప్రకారం అర్హులైన 2 వేల మందికి ఇంటి నివేశనా స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించాలన్నారు. ప్రభుత్వ భూములు సరిపడా ఉన్నయన్నారు. ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.




## నకిలీ సర్టిఫికెట్లతో ఎఇఒ ఉద్యోగాలు : ఇద్దరు అరెస్టు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం అక్రమ మార్గాన నకిలీ సర్టిఫికెట్లతో జోగులాంబ గద్వాల జిల్లాలో ఏ.ఈ.,వో ఉద్యోగాలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డిఎస్పీ మొగిలయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు నకిలీ సర్టిఫికెట్లతో ఏ.ఈ.,వో ఉద్యోగాలు పొందిన తీరును డిఎస్పీ మొగిలయ్య వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘాజీపూర్ పట్టణంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌ను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివినట్లు కేటుగాళ్లతో కలిసి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి ప్రభుత్వ వ్యవసాయ శాఖలో గ్రేడ్ 2 ఉద్యోగమైన ఏ.ఈ.,వో ఉద్యోగాలు సాధించారు. దీంతో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ జీతం పొందారన్నాడు.సర్టిఫికెట్ల తనిఖీలలో భాగంగా ఇంటలిజెన్స్ డిపార్టుమెంట్ వారు నకిలీవిగా తేల్చి అక్కడి కళాశాలలో విచారించగా అక్కడి కళాశాలలో అలాంటి బ్రాంచే లేదని తేలిపోయిందన్నారు. దీంతో 2024లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి సంగీత లక్ష్మీ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. నరేష్, జగదీష్,శివ శంకర్,రవీందర్,జెరూపుల డాక్యుమెంట్లపై ఫిర్యాదు చేయగా విచారణ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసి శనివారం ఇద్దరిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నకిలీ సర్టిఫికెట్లకు కారకుడైన మిర్యాలగూడకు చెందిన ప్రిన్సిపాల్ బాలకృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. మిగతా వారిని తొందరలోనే అరెస్టు చేస్తామన్నారు. సిఐ టంగుటూరి శ్రీనివాస్,ఎస్సై కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

## రైతులకు నిధులు విడుదల

**ప్రజాపక్షం/ ఉండవల్లి :** అల్లంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రం లో అమ్ముకున్న రైతులకు డబ్బులు విడుదల చేసినట్లు మార్క్ ఫైడ్ డి ఎం నాగేష్ తెలిపారు. నేటి నుంచి రైతుల ఖాతాల్లో నేరుగా లమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు కోట్ల రూపాయల నిధులు సమకూర్చినట్లు మొత్తానికి 8 కోట్లు రావాల్సి ఉండగా వచ్చిన అమౌంట్ ను వచ్చినట్లుగా రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. అల్లంపూర్ నియోజకవర్గం లోని ఒక వెయ్య 77 మంది రైతుల నుంచి కందులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొదటి నుంచి వరుస క్రమము ప్రకారం రైతులకు వారి ఖాతాలో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులం ఆందోళన చందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటి వరకు 951.65 మెట్రిక్ టన్నులు కందులు కోనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ఏమైనా ఖాతాల్లో పొరపాటు జరిగిన సరే చేసి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సమస్యల పరిష్కారం కోసం 'ప్రజల వద్దకే పోలీస్'

మీట్ యువర్ ఎస్‌పి కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ప్రజా వాణి కార్యక్రమానికి వచ్చి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖని ప్రజల వద్దకు వెళ్లే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో బాధితులను కలిసి అందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమమే మీట్ యువర్ ఎస్పి కార్యక్రమం అని జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్ తెలిపారు. శనివారం డిండి మండల పోలీస్‌స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పి కార్యక్రమానికి ప్రజలు బాధితులు వచ్చి పిటిషన్లను అందజేశారు. పిటిషన్లు స్వీకరించిన అనంతరం ఎస్పి విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పోలీసు వ్యవస్థ మరింత చేరువ అయ్యే విధంగా ప్రజల వద్దకే పోలీసులు వెళ్లే విధంగా వారి సమస్యలను పరిష్కారం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 22 పిటిషన్లు రాగా దేవరకొండ ఏఎస్పి మౌనిక, సిఐ సురేష్, ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు ,చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్లు నిజమైన లబ్దిదారులకు ఎవరికి అన్యాయం జరగకుండా చూస్తామని తెలిపారు. మీట్ యువర్ ఎస్పి కార్యక్రమం డిండిలో మూడవ కార్యక్రమం అని, పిటిషన్లు అందిన వాటిలో భూములకు సంబంధించి, ఫ్యామిలీ గొడవలకు సంబంధించి, సైబర్ నేరాలతో పాటు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోస పోయామని బాధితులు పిటిషన్లు అందజేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా జాబ్ ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని అటువంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి సోమవారం నల్గొండలో సైబర్ నేరాలపై ప్రత్యేక టోల్ ఫ్రి ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు దాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పి మౌనిక, సిఐ సురేష్, ఎస్ఐ రాజు, సిబ్బంది, ఫిర్యాదు దారులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బిసి టన్నెల్ సందర్శించిన కలెక్టర్




**ప్రజాపక్షం /చందంపేట:** నాగర్ కర్నూలు దోమల పెంట వద్ద శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ సొరంగంలో పెను ఘోరం ప్రమాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాద సంఘటన స్థలాన్ని (నాగర్ కర్నూల్ జిల్లా ,దోమలపెంట)ను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు శనివారం సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదం జరగడానికి గల కారణాలు, తదితర వివరాలను వారు అక్కడ ఉన్న ఇంజనీర్లు, ప్రమా దం నుండి బయటపడ్డ వారితో అడిగి తెలుసుకున్నారు. వారు వెంట దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, ఏసిపి మౌనిక ఇతర అధికారులు ఉన్నారు.

**ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం బాధాకరం**

**ప్రజా పక్షం/నల్లగొండ:** నాగర్ కర్నూలు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ సొరం గంలో శనివారం జరిగిన ప్రమాదంపై సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్ ఎల్‌బిసి టన్నెల్ స్కీంలో భాగంగా శ్రీశైలం నుంచి దేవరకొండ వైపు వెళ్లే టన్నెల్ 14 కిలోమీటర్ ఇన్లేట్ దోమల పెంట వద్ద ఉదయం ప్రమాదం సంభవించడం బాధాకరం అన్నారు. టన్నెల్ లో చిక్కుకున్న వారిని వెంటనే కాపాడి,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

# ఏళ్ళ నాటి వృక్షంపై 'గొడ్డలి వేటు'!

**ప్రజాపక్షం/నందికొండ:** పచ్చని చెట్లుప్రగతికి మెట్లు అని ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉంటే ఒక ప్రభుత్వ అధికారే దశాబ్దాల కాలం నాటి భారీ వృక్షాన్ని నేల మట్టం చేయడం స్థానికంగా ఉన్న పర్యావరణ ప్రేమికులను బాధించింది .నందికొండ మున్సిపాలిటీ పరిధిలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ లో ఉన్న దశాబ్దాల కాలం నాటి వృక్షం నేలమట్టమయింది ఎన్నో ఏళ్లకాలం నాటి చెట్టు ఆనవాళ్లను కోల్పోయింది కాలని వాసులకు స్వచ్ఛమైన గాలిని నీడను అందించే దశాబ్దాల కాలం నాటి వృక్షం ఇప్పుడు ఒక అధికారి నిర్లక్ష్యం కారణంగా నేలకొరిగింది. వివరాల్లోకి వెళితే స్థానిక మాజీ వైస్ చైర్మన్ మందా రఘువీర్ తెలిపిన వివరాల ప్రకారం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఏఈగా పనిచేస్తున్న నరసింహమూరి ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నుంచి ఉన్న ఈ చెట్టును నరికివేశారని ఎందుకు దానికి నరుకుతున్నారని అడిగితే తాము ఆడుకుంటుంటే అడ్డు వస్తుందన్న ఉద్దేశంతోటి నరికి వేస్తున్నట్లు సమాధానం చెప్పాడని అన్నారు. దశాబ్దాల కాలంగా ఎంతోమంది ఏ ఈ లు, డి ఇ లు, ఎస్సీలు, ఈ క్లబ్బుతో తమకు ఉన్న అను బంధాన్ని గుర్తు చేస్తూ దశాబ్దాల కాలంగా ఎవరికి అడ్డురా నీ వృక్షం నీకెలా అడ్డమొచ్చిందని ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అన్నారు. భారీ వృక్షాన్ని తొలగించాలంటే అటవీ శాఖ అనుమతి తప్పనిసరి. అటవీశాఖ అనుమతి లేకుండా వృక్షాన్ని తొలగించడం నేరమని చెప్పినా కూడా వినకుండా దాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. దీనితో మాజీ వైస్ చైర్మన్ అతనిపై చర్య తీసుకోవాలని అటవీ శాఖకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.



# చుక్కా లక్ష్మీబాయ్ టాలెంట్ టెస్టులో జయ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ప్రముఖ విద్యావేత్త చుక్క రామయ్య సతీమణి చుక్కా లక్ష్మి బాయ్ జ్ఞాపకార్థం నిర్వహించిన లక్ష్మి బాయి సైన్స్ టాలెంట్ టెస్టులో జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరిలో 5వ తరగతిలో రాష్ట్ర మొదటి ర్యాంకు పి కీర్తి, 6వ ర్యాంకు ఎస్ సాయినిధి, 6వ తరగతిలో రాష్ట్ర మొదటి ర్యాంకు ఎ నిఖిల్, 6వ ర్యాంకు ఎస్‌కె జహిద్, 9వ ర్యాంకు ఎస్ శశాంక్, 18వ ర్యాంకు వై వీఈక్షిత, 19వ ర్యాంకు నివితా వాస్, 20వ ర్యాంకు ఎ వర్ధన్ కుమార్, 7వ తరగతిలో రాష్ట్ర 4వ ర్యాంకు ఎ సీక్షిత, 5వ ర్యాంకు ఎస్ రేవంత్, 11వ ర్యాంకు జి నాగకార్తికేయ, 12వ ర్యాంకు డి నాగనిఖిత, 8వ తరగతిలో రాష్ట్ర మొదటి ర్యాంకు ఎస్‌కె రిజ్వాన్, 3వ ర్యాంకు ఎస్ జశ్వంత్, 4వ ర్యాంకు బి సాయిచరణ్, 6వ ర్యాంకు వి జయసూర్య, 12వ ర్యాంకు వి గౌతమ్, 13వ ర్యాంకు సిహెచ్ లిఖిత, 14వ ర్యాంకు పి వైశాలి, 15వ ర్యాంకు వై వీక్షిత, 16వ ర్యాంకు డి మహిత, 9వ తరగతిలో రాష్ట్ర మొదటి ర్యాంకు ఆర్ విష్ణువర్ధన్, 3వ ర్యాంకు కె కార్తీకేయ, శ్రీవాత్సవ్, 4వ ర్యాంకు పి వికాస్, 11వ ర్యాంకు వి వైష్ణవి, 13వ ర్యాంకు పి శ్రీశ్వాస, 15వ ర్యాంకు పి మణిచరణ్, 16వ ర్యాంకు డి రిత్విక, 17వ ర్యాంకు సిహెచ్ సంస్కృత, 10వ తరగతిలో రాష్ట్ర రెండవ ర్యాంకు కె లౌకిక్, 5వ ర్యాంకు జి కావ్య, 5వ ర్యాంకు వి హాసిని, 6వ ర్యాంకు సిహెచ్ అక్షయ్, 10వ ర్యాంకు ఎస్ దీక్షిత్, డి నిశాంక్ వరప్రసాద్, 19వ ర్యాంకు టి సాయిశ్రీకర్, 20వ ర్యాంకు ఎస్‌కె రైహాన్ సాధించారు. శనివారం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మల, బింగి జ్యోతిలు అభినందించారు. ఉత్తమ ర్యాంకుల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/డిండి :** దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరు భగవంతుని పట్ల భక్తి శ్రద్దలు కలిగి ఉండాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం డిండి మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో శ్రీ గంగా భవానీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎంఎల్‌ఏ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి, మండల అధ్యక్షులు సాయి, నాయకులు మల్లేష్, అరవింద్, ఆంజనేయులు, గంగపుత్ర సంఘం అధ్యక్షులు బాలకృష్ణ, కొండల్, నాగరాజు, లక్ష్మ ణ్, రాముడు పాల్గొన్నారు.



## కృష్ణా జలాలను తరలిస్తున్నా... పట్టించుకోరా!



**ప్రజాపక్షం/హాలియా:** కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ తరలించుకు పోతున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు తెలంగాణా ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గతంలో ఎన్నడు లేనటువంటి విధంగా నాగార్జునసాగర్ డ్యాం మీద సిఆర్పిఎఫ్ బలగాలను పెట్టి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.పరిపాలన మీద అనుభవం లేనటువంటి ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న తీరు రాష్ట్రం మరో వందేళ్లు వెనక్కి పోతుందన్నారు. మంత్రులకు కూడా ఆయా శాఖలపై విషయ పరిజ్ఞానం లోపించిన తీరు రాష్ట్ర అభివృద్ధి పై ప్రభావం చూపుతుందన్నారు.ముఖ్యంగా కృష్ణ జలాల విషయంలో రాష్ట్ర పునర్విభజన జరిగినప్పుడు,ఆంధ్ర ప్రాంతానికిఎంత,తెలంగాణ ప్రాంతానికి ఎంత అని తాత్కాలిక ఒప్పందం చేసిందన్నారు. దాన్ని ఉల్లంఘించి ఈరోజు ఆంధ్ర ప్రాంతం వారు కేంద్ర ప్రభుత్వం సహకారంతో కెఆర్ఎంబి ని మధ్యపెట్టి, నీటిని తీసుకుపోవటాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ సమావేశంలోమాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కదూరు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు సమగ్ర విధానాలను రూపొందించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు నియోజకవర్గాలవారీగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన సమగ్ర విధానాలను రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, చారగొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సిఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు కమిషన్ రూపొందించిన నివేదికను సిఎం రేవంత్ రెడ్డికి కమిషన్ బృందం అందజేసింది. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌తో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వారు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు, పాఠశాల నిర్వహణ సమస్యలను వివరించారు. దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు, విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సిఎం తెలిపారు.

# మహా శివరాత్రికి 3 వేల ప్రత్యేక బస్సులు

శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444 స్పెషల్ సర్వీసులు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా టిజిఎస్ఆర్‌టిసి ఏర్పాట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు టిజిఎస్ ఆర్‌టిసి వెల్లడించింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 3 వేల ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 26న మహా శివరాత్రి కాగా, 24 నుంచి 28వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో టిజిఎస్ ఆర్‌టిసి తెలిపింది. ప్రధానంగా శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలాలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతో పాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప తదితర దేవాలయాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని మహాత్మ గాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్), జూబ్లీబస్‌స్టేషన్ (జెబిఎస్), ఐఎస్ సదన్, కెపిహెచ్‌బి, బిహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీటితో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది.

**ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు టికెట్ ధరల సవరణ..**

రాష్ట్ర ప్రభుత్వ జీ.ఓ ప్రకారం శివరాత్రికి నడిచే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు టికెట్ ధరలను సంస్థ సవరించింది. రెగ్యులర్ సర్వీస్‌ల టికెట్ ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 24 నుంచి 27 తేది వరకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 26 నుంచి 28 తేది వరకు సవరణ ఛార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం ప్రత్యేక సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది.

**ఇప్పటికే సమీక్ష నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్..**

శివరాత్రి ఆపరేషన్స్‌పై ఆర్‌టిసి ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో టిజిఎస్ ఆర్‌టిసి పకడ్బందీ ఏర్పాట్లను చేస్తోందని అధికారులు వెల్లడించారు. క్షేత్రస్థాయి అధికారులతో ఉన్నతాధికారులు ఇటీవల సమీక్ష నిర్వహించారు. 43 శైవక్షేత్రాలకు 3 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత శివరాత్రి కన్నా ఈ సారి 809 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రత్యేక సర్వీసులను ఉపయోగించుకుని క్షేమంగా శైవాలయాలకు చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. వి.సి. సజ్జనార్ కోరారు.

**అమల్లో ఉండనున్న మహాలక్ష్మి ఉచిత బస్సు సదుపాయం..**

మహాశివరాత్రి ప్రత్యేక బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీ.ఓ ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు అన్నారు. మహా శివరాత్రి ప్రత్యేక బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టిజిఎస్ ఆర్‌టిసి కాల్ సెంటర్ నెంబర్లు 04069440000, 04023450033ను సంప్రదించాలని సూచించారు.

## రాహుల్‌గాంధీతో మధుయాష్కీ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ న్యూఢిల్లీలో ఎఐసిసి అగ్రనాయకుడు రాహుల్‌గాంధీతో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే తీరును ఆయన రాహుల్‌కు వివరించారు. సర్వే చేపట్టడం పట్ల ప్రజలు, బిసి సంఘాల ప్రతినిధులు స్పందన తదితర అంశాలను వివరించినట్లు తెలిసింది. అలాగే కులగణన చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలన కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. అయితే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పాలనలోనూ మధుయాష్కీగౌడ్‌ను రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

## బ్రిటన్ కోర్టులో దివాలా ఉత్తర్వు రద్దు

చేయించేందుకు విజయమాల్యా సన్నాహాలు

**లండన్ :** కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ఇటీవల లోక్‌సభలో చేసిన ప్రకటనను ఆధారం చేసుకుని బ్రిటన్ కోర్టులో 'దివాలా ఉత్తర్వు' రద్దుచేయాలని కోరుతూ పిటీషన్ దాఖలు చేసేందుకు విజయ్ మాల్యా ప్రయత్నాలు ప్రారంభించారు. దేశంలో బ్యాంకులకు అప్పులు ఎగవేసి విదేశాలకు పారిపోయిన విజయమాల్యాకు చెందిన రూ.14, 131.6 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకుని బ్యాంకులకు వాటిని పునరుద్ధరించినట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు.

# ఉపాధ్యాయులకు అన్ని సబ్జెక్టుల్లో పట్టు ఉండాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి సూచించారు. పిల్లలు ఉపాధ్యాయుడు చెప్పిన దేనినైనా నమ్ముతారని, పరిస్థితులు ఎలా ఉన్నా కూడా విద్యార్థిలో ఆలోచనలకు ఆలోచనల మార్పునకు దోహదపడే విధంగా ఉపాధ్యాయులు ఉండాలని వారు పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని టిజిఐఆర్‌టిలో ఇటీవల నియమితులైన ప్రాథమిక ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి , ఎస్ఈఆర్‌టి డైరెక్టర్ జి రమేష్ , కరిక్యులమ్ విభాగం హెచ్ఒడి తహసీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా విద్యార్థులను ఒక నిమిషంలో ఎన్ని పదాలు చదవగలుగుతారో పరీక్షిస్తున్నారు కానీ ఉపాధ్యాయులుగా మీరు ఎప్పుడైనా ఒక నిమిషంలో ఎన్ని పదాలు చదవగలరో పరీక్షించుకున్నారా అని ఆర్‌పిలను ప్రశ్నించారు. పిల్లలకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలే అభ్యాసాల సాధనకు వీలుగా ఉన్నాయని, దానితో పాటు అదనంగా వర్క్ బుక్స్ ఇవ్వడం జరుగుతున్న నేపథ్యంలో ఈ రెండింటిని సమన్వయం చేసుకొని బోధించే విధంగా ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్ కూడా ఇవ్వడం జరిగిందని వారు వివరించారు. ఈ మూడింటిని సమన్వయం చేసుకుంటూ బోధన చేస్తే పిల్లలు తప్పకుండా చదవడం రాయడం నేర్చుకుంటారు అని తెలిపారు. సంవత్సరాల తరబడి పిల్లలు పాఠశాలకు వెళుతున్న కూడా కొంతమంది చదవడం రాయడంలో వెనుకబడి ఉన్నారని. ఈ సమస్యని అధిగమించాలంటే పాఠ్యపుస్తకాలని వర్క్ బుక్కును హ్యాండ్ బుక్ లను సమన్వయం పరుచుకొని దాని ప్రకారంగా బోధన గావిస్తే మనం తప్పకుండా చక్కటి ఫలితాలు సాధిస్తామన్నారు. పిల్లలు పాఠశాలకు రాకముందే మాట్లాడటం నేర్చుకుని ఉంటారని, వారు చక్కటి తెలివి తేటలు కూడా కలిగి ఉంటారని బడికి వచ్చిన తర్వాత వారికి చదవడం, రాయడం నేర్పించడం మీద దృష్టి పెట్టాలని, ఇందుకు సాంకేతికను కూడా ఉపయోగించుకుని బోధించాలన్నారు. అయితే కానీ పూర్తిగా సాంకేతికత మీద ఆధారపడకుండా మానవ వరులను కూడా సద్వినియోగపరచుకోవాలని సూచించారు.



## ఘనంగా నాగార్జున విద్యాసంస్థల వార్షికోత్సవం

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటి ఒలపియాడ్ స్కూల్ 34వ వార్షికోత్సవాన్ని శనివారం బిడిరెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ మార్కుల కోసం జవాబులు బట్టీ పట్టించే విధానం కాకుండా విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలకు తమ విద్యా సంస్థల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో పదవ తరగతి పరీక్షలలో జిపిఎ 10కి 10 పాయింట్లు సాధించిన 35 మంది విద్యార్థులకు పది వేల రూపాయలు బహుమతులు, మెమెంటో ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్ పర్సన్ జి. రజీని, విఠల్‌రెడ్డి, సీఏఓ ఏ. శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఏ. లక్ష్మి , శ్రీవిద్య పాల్గొన్నారు.

## డిసిపి, ఎసిపిలపై చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి హరీష్ రావుకు సంబంధించిన కేసులో చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించిన డిసిపి విజయ్ కుమార్, ఎసిపి మోహన్ కుమార్‌లపైన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం డిజిపిని కోరింది. ఈ మేరకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్,మాజీ ఎంఎల్‌ఏలు డాక్టర్ మెతుకు ఆనంద్, జాజుల సురేందర్, బిఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్ , ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్ సాగర్, పల్లె రవికుమార్ ప్రతినిధి బృందం డిజిపి కార్యాలయంలో డిజిపి జితేందర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ముఠాగోపాల్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్‌లోని కీలక నాయకులపైన కేసులు పెట్టి,అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే హరీశ్‌రావుపైన కుట్ర పన్నారని ఆరోపించారు. చక్రధర్ గౌడ్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో హరీష్ రావును ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

## కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి



టి - జిహెచ్ఎంఇయు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసిలో పారిశుధ్యం, ఎంటమలాజి, హౌస్‌కిపింగ్, యుబిడి, స్పోర్ట్స్‌లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని అదనపు కమిషనర్(ఆరోగ్యం) ఎస్.పకంజను తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(టి జిహెచ్ఎంఇయు) ప్రతినిధి బృందం కోరింది. అందుకు అదనపు కమిషనర్ పకంజ సానుకులంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌తో పాటు నాయకులు మల్లేష్ తదితరులు ఉన్నారు.

## కేరళలో 1.53 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆసక్తి



**కొచ్చి :** రాష్ట్రంలో 1.53 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తిని ప్రదర్శించినట్టు పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ వెల్లడించారు. రెండు రోజుల పెట్టుబడిదారుల సమ్మేళనం ముగింపు సందర్భంగా మంత్రి ఈ విషయాన్ని తెలియజేస్తూ 370కి పైగా సంస్థలు ఇందుకు ఆసక్తిని ప్రదర్శించినట్టు తెలిపారు. ఇది కేరళ పెట్టుబడిదారుల స్నేహపూర్వక రాష్ట్రంగా కేరళ అవతరించేందుకు ఇదొక నూతన ఆరంభం అన్నారు. ఈ సమ్మేళనానికి వివిధ సంస్థలకు చెందిన 5వేలకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం ముగింపు సందర్భంగా 1,52,905.67 కోట్ల మేరకు పెట్టుబడి ప్రతిపాదనలు అందాయన్నారు. ఈ ప్రతిపాదనలు ఆమోదం కోసం ఫాస్ట్‌ట్రాక్ యంత్రాంగాన్ని రూపొందించనున్నామన్నారు. శనివారం ముగిసిన ఈ సమ్మేళనంలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర ప్రతిపక్ష నేతలు, విదేశీ మంత్రులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. సమాఖ్య సహకార విధానాలవల్ల కేరళ రాష్ట్రం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ హయాంలో త్వరితగతిన పురోగతి సాధిస్తోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ అన్నారు. త్వరలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. ప్రతిపక్ష నాయకుడు పి.కె.కున్హలికుట్టికూడా ప్రభుత్వాన్ని సమర్థిస్తూ కేరళ రాష్ట్రం పెట్టుబడిదారులకు ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందన్నారు. ప్రభుత్వంతో విభేదాలున్నా రాష్ట్ర ప్రగతికి సంబంధించిన అంశాలలో కలిసి వస్తామన్నారు.

# ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం

బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో కులగణన సర్వేలో పాల్గొనని వారికి రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించడంతో బిసి కమిషన్ ప్రజల్లో అవగాహన కల్పించడానికి 16వ తేది నుండి రోజూ ఉదయం 8:00 గంల నుండి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చైర్మన్ జి. నిరంజన్ తెలిపారు. అందులో భాగంగా శనివారం చంద్రాయన్ గుట్ట, కుమ్మడివాడి, సాయిబాబానగర్ కాలనీ, శివంరోడ్, నెహ్రూనగర్, అంబర్‌పేట్, బహదూర్‌పుర, ఉమ్దాబజార్, దూద్‌బౌలి, కార్వా న్, మెహదీపట్నం, నాంపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించామన్నారు. బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ శాలివాహన నగర్, గాంధీనగర్, టెలిఫోన్ కాలనీ, ఆర్.కె.పురం, ఎల్.బి. నగర్, ఆదిభట్ల, రాంనగర్ గుండు ప్రాంతాల్లో పర్యటించారని, తిరుమలగిరి సురేందర్ టిఎన్‌జిఓ కాలనీ, గచ్చిబౌలి, కాకతీయ హిల్స్, మాదాపూర్, అఫీజ్‌పేట్, అంజయ్యనగర్, కొండాపూర్, రంగు బాలలక్ష్మి ఫిర్జాదిగూడ, మేడిపల్లి, మేడ్చల్ జిల్లాలలో పర్యటించారన్నారు.



**నేడు బిసి కమిషన్ చైర్మన్ పర్యటించే ప్రాంతాలు..**

బిసి కమిషన్ తరపున ఇందిరా పార్కులో ఉదయం 6:30 గంటల నుండి 10:00 గంటల వరకు వాకర్స్‌తో కలిసి అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని వార్డులను ఆదివారం తెరిచేలా ప్రజలకు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని జిహెచ్ఎంసి కమిషనర్‌ను కోరామని తెలిపారు. అన్ని కాలనీల అసోసియేషన్‌లు, సామాజిక కార్యకర్తలు ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించి, అత్యధిక సంఖ్యలో ప్రజలు నమోదు చేసుకునే విధంగా ప్రయత్నించాలని నిరంజన్ విజ్ఞప్తి చేశారు. జిహెచ్ఎంసి అధికారులు అందుబాటులో ఉన్న రిసోర్స్ పర్సన్స్‌ను పూర్తిగా వినియోగించుకొని, ఇంటింటికి పంపించి, అత్యధిక సంఖ్యలో నమోదు చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు.

## 'నేటి' నుంచి మోదీ మూడు రోజుల పర్యటన

మధ్యప్రదేశ్, బిహార్, అసోంలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభాలు, శంకుస్థాపనలకు హాజరు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం (23వ తేదీ)నుండి మూడు రోజులపాటు మధ్యప్రదేశ్, బిహార్, అసోం రాష్ట్రాలలో పర్యటించనున్నారు. శనివారం నాడు ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. భోపాల్‌లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, భాగల్పూర్‌లో రైతులకు 19వ ఇన్‌స్టాల్‌మెంట్ నగదు సహాయం విడుదల సహా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కోసం ప్రధానమంత్రి ఆయా రాష్ట్రాలలో మూడు రోజుల పర్యటన చేయనున్నారని పిఎంఒ తెలియజేసింది. తొలుత ఆదివారం నాడు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఛాతర్‌పూర్‌లోని భాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఆయన సోమవారం నాడు పెట్టుబడిదారుల సదస్సును ప్రారంభిస్తారని పిఎంఒ ప్రకటన తెలియజేసింది. భాగల్‌పూర్‌లో సోమవారం జరుగనున్న 19వ ఇన్‌స్టాల్‌మెంట్ పిఎం కిసాన్ పథకాన్ని విడుదల చేస్తారు. అసోంకు ప్రయాణం కావడానికి ముందు ప్రధానమంత్రి బిహార్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఆతర్వాత అదేరోజైన సోమవారం సాయంత్రం 'జుమొయిర్ బినందిని' కార్యక్రమానికి హాజరవుతారు. మరుసటి రోజున పెట్టుబడి, మౌలికవసతుల సదస్సును ప్రారంభిస్తారు. మంగళవారం గౌహతిలో అడ్వాంటేజ్ అసోం 2.0 ఇన్‌వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. మధ్యప్రదేశ్‌లో భోపాల్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా నెలకొల్పడానికి ఈ రెండు రోజుల సదస్సు ఒక ముఖ్యమైన వేదికగా దోహదపడుతుందని ప్రధాన మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన వివరించింది. డిపార్ట్‌మెంటల్ సదస్సులు, ఫార్మా, వైద్య పరికరాలు, రవాణా, లాజిస్టిక్స్ పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటకం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు, ఇతర రంగాలపై ప్రత్యేక సమావేశాలు ఉంటాయని పిఎంఒ తెలిపింది. ఈ సదస్సులో మూడు ప్రధాన పారిశ్రామిక ఎగ్జిబిషన్లు నిర్వహిస్తారని ఆటో షో, టెక్స్‌టైల్, ఫ్యాషన్ ఎక్స్‌పోలు రాష్ట్రానికి సంబంధించిన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయని వివరించింది. 60 దేశాల నుంచి పైగా ప్రతినిధులు, వివిధ అంతర్జాతీయ సంస్థల నుంచి పలువురు అధికారులు, భారతదేశం నుంచి 300మంది ప్రముఖ పరిశ్రమల నాయకులు, విధాన రూపకర్తలు ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపింది.

## అన్నపూర్ణ కేంద్రాల పునరుద్ధరణకు చర్యలు

ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసిన జిహెచ్ఎంసి కమిషనర్

శనివారం వివిధ ప్రాంతాల్లో పర్యటించిన కమిటీ సభ్యులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కనీస వసతుల పరిశీలన, భోజన పరిస్థితి పరిశీలించేందుకు జిహెచ్ఎంసి కమిషనర్ ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి హెడ్‌గా, అదనపు కమిషనర్లు ఎస్. పంకజ (హెల్త్), వేణుగోపాల్ రెడ్డి (అడ్వర్టైజ్‌మెంట్) సభ్యులుగా ఉన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కమిటీ సచివాలయం సమీపంలోని మింట్ కాంపౌండ్ లక్డీకాపూల్ వద్ద శనివారం అన్నపూర్ణ కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఉన్న కనీస వసతులు భోజన పరిమాణం నాణ్యతను పరిశీలించారు. అన్నపూర్ణ కేంద్రాలు నిరుపేదలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు జిహెచ్ఎంసి వ్యాప్తంగా ఉన్న రూ.5 లకే అన్నపూర్ణ భోజనం నిరుపేదలకు వర ప్రసాదంగా మారిందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అన్నపూర్ణకేంద్రాల ఆధునీకరణకు చర్యలు చేపట్టింది. కనీస వసతులతో పాటు పౌష్టికాహారం అందించేందుకు జిహెచ్ఎంసి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు తాను కమిటీ సభ్యులు మింట్ కాంపౌండ్, లక్డీకాపూల్ సమీపంలోని అన్నపూర్ణ క్యాంటీన్‌ల స్థితి, ఆహార నాణ్యతను తెలుసుకునేందుకు అకస్మికంగా తనిఖీలు నిర్వహించామన్నారు. లక్డీకాపూల్ వద్ద ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్‌లో భోజనం చేసి నాణ్యత బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. క్యాంటీన్లపరిస్థితిని పరిశీలించి, రెండు ప్రదేశాలలో మరమ్మతులు చేపట్టాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. జిహెచ్ఎంసి ప్రాంతంలోని వివిధ ప్రదేశాలలో క్యాంటీన్‌ల స్థితిని నివేదించడానికి కమిటీ ఇంజనీర్ల బృందాన్ని నియమిస్తున్నట్లు చెప్పారు.

## మహా కుంభ్‌కు వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

**ధన్‌బాద్ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభ్‌కు వెళ్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు శనివారం తెల్లవారుజామున జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టడంతో మరణించారని పోలీసులు తెలిపారు. రాజ్‌గంజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని జాతీయ రహదారి 2పై తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని వారు తెలిపారు. ఫోర్ వీలర్‌లో ఎనిమిది మంది ఉన్నారని రాజ్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అలీషా కుమారి తెలిపారు. నలుగురు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు గాయపడ్డారని ఆమె తెలిపారు. క్షతగాత్రులను షాహిద్ నిర్మల్ మహతో మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చేర్చినట్లు ఆమె తెలిపారు. మృతులను పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని కమర్పుకూర్ నివాసితులు అయిన పియాలి సాహా, తెములి సాహా, పనోబా సాహాగా గుర్తించారు.

**కారు కల్వర్టు నుండి పడిపోయి ఇద్దరు మృతి**

**కొండగావ్ :** శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లాలో ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభానికి వెళ్తున్న కారు కల్వర్టు నుండి పడిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. జాతీయ రహదారి30లోని ఫరస్గాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్గావ్ గ్రామ సమీపంలో ఉదయం 6.45 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని ఒక అధికారి తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బెంగళూరు నుండి ఒక కుటుంబ సభ్యులు రెండు కార్లలో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్నారని ఆయన తెలిపారు. ఒక కారు డ్రైవర్ ఒక మలుపు వద్ద వాహనంపై నియంత్రణ కోల్పోయాడని, అది రోడ్డు పక్కనే అదుపు తప్పి, చిన్న కల్వర్టు నుండి పడి చెట్టును ఢీకొట్టిందని అధికారి తెలిపారు. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, నలుగురు గాయపడ్డారని ఆయన చెప్పారు. ఆ దారిన వెళుతున్న వ్యక్తి అంబులెన్స్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడని, ఆ తర్వాత గాయపడిన వారిని ఫరాస్గాన్‌లోని ఆసుపత్రికి తరలించామని అధికారి తెలిపారు.



## శ్రీపాద శ్రీనివాస్ రచనా వ్యాసంగం కొనసాగించాలి

పలువురు వక్తలు సూచన

ఆత్మీయ పూరిత వాతావరణంలో 'అంతరంగం' సంకలనం ఆవిష్కరణ

**రాజమహేంద్రవరం :** అందరితో స్నేహతత్వం కొనసాగిస్తూ, సామాజిక స్పృహతో రచనలు చేస్తున్న శ్రీపాద శ్రీనివాస్ తన రచనా వ్యాసంగం కొనసాగించాలని పలువురు సూచించారు. ఆప్యాయత అనురాగాలు పంచుతూ అందరితో కలివిడిగా ఉండడం, అందరి శ్రేయస్సు, అభివృద్ధి కాంక్షించడం అభినందనీయమన్నారు. తాజాగా 'విభిన్న అంశాల సమాహారంగా 'అంతరంగం' పుస్తకాన్ని నాల్గవ సంకలనంగా స్వీయ రచనలు, రేడియో కార్యక్రమాలు వాటిపై అభిప్రాయ మాలికలు మేళవించి రూపొందించారు. హరిచందన పబ్లికేషన్స్ పక్షాన గజరావు వెంకటేశ్వరరావు సారథ్యంలో ఈ పుస్తకం రూపొందింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన బుక్ బ్యాంకులో శనివారం ఉదయం ఆత్మీయ పూరిత వాతావరణంలో నిర్వహించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, మాజీ మంత్రిడొక్కా మాణిక్య వర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సాంస్కృతిక నగరం రాజమండ్రిలో శ్రీపాద పుస్తకావిష్కరణ ఇంతమంది ఆత్మీయుల నడుమ సాగడం ఆనందంగా ఉందన్నారు. ఉండవల్లి మాట్లాడుతూ ఇంతమంది మిత్రులను సంపాదించుకోవడం మామూలు విషయం కాదని అన్నారు. మంచితనం కారణంగానే ఇంతమంది ఆదరణ పొందగలిగాడని ఆయన పేర్కొంటూ నిజంగా ధన్యత పొందాడని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డా.సిహెచ్ వంశీ కృష్ణ మాట్లాడుతూ, అపారమైన జ్ఞానం కల్గిన శ్రీపాద శ్రీనివాస్ నిజాయితీ పరుడని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు వి ఎస్ ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది చింతపెంట ప్రభాకర్, పుస్తక సమీక్షచేస్తూ, శ్రీపాద శ్రీనివాస్ రచనలలో గొప్పతనాన్ని వివరిస్తూ, అమ్మ, గోదావరి, స్నేహితులు, రాజకీయాలు కథావస్తువులుగా ఎంచుకుని రచనలు చేస్తున్నారని అభినందించారు. రామినీడి మురళీమోహన్ కూడా వేదికపై ఉన్నారు. శ్రీపాద శ్రీనివాస్‌ని మంత్రి దుర్గేష్, ఉండవల్లి దుశ్శాలువతో సత్కరించారు. షేక్ అసదుల్లా అహ్మద్, ప్రసాదుల హరినాథ్, క్రొవ్విడి సర్రాజు పసుపులేటి కృష్ణ, ఎల్ వెంకటేశ్వరరావు, నక్కా శ్రీనగేష్, ఇయ్యపు మాధవ, బెజవాడ రంగా, వాకచర్ల కృష్ణ, ముళ్ళా మాధవ, పలువురు ప్రముఖులు, శ్రీపాద శ్రీనివాస్ గురువులు, మిత్ర బృందం, తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణమాచార్యులు వందన సమర్పణ చేస్తూ, మంగళాశాసనాలు చేసారు.







## ఐక్యత ఫౌండేషన్ సహకారంతో మహిళలకు ఉద్యోగాలు

ప్రజాపక్షం/కల్వకుర్తి: ఐక్యతఫౌండేషన్ చైర్మన్, టాస్క్‌సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో తలకొండపల్లి మండలం చుక్కాపూర్, ఎడవెల్లి గ్రామాలకు చెందిన మహిళలు తుక్కుగూడలో ని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో 23మంది మహిళలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన మహిళలు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళలకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వారి కుటుంబాలకు భరోసా నిస్తున్న టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చుక్కాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు, ఐక్యత ఫౌండేషన్‌సభ్యులు, ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రేమ వేధింపులు తాళలేక మైనర్ బాలిక ఆత్మహత్య..



ప్రజాపక్షం/బిజినేపల్లి:ప్రేమపేరుతో వేధింపులు తాళలేక అవమాన భారం తో మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన వట్టెం గ్రామంలో చోటు చేసుకుంది గ్రామానికి చెందిన పూడూరు నందిని (17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యపాల్పడింది. తండ్రి శ్రీశైలం తల్లి సుజాత తెలిపిన వివరాల మేరకు బంధువుల ఇంట్లో వివాహానికి తల్లి సుజాత వెళ్ళగా, తండ్రి శ్రీశైలం గేదెలు మేపేందుకు పంట పొలాలకు వెళ్లాడు. కాగా గ్రామానికి చెందిన సొంట మల్లేష్, శివలు కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో నందినిని వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. నందిని ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో మల్లేష్, శివలు గురువారం సాయంత్రం తగవులాడడంతో అవమానభారం భరించలేక చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విగతజీవిగా వేలాడుతోన్న బాలికను చూసిన ఇరుగుపొరుగు వారు కుటుం బ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందింది. విషయం తెలుసుకుని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న కేసు నమోదు చేపి దర్యాప్తు చేస్తున్నారు. వేధింపులకు గురిచేసిన వారిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు వేడుకుంటున్నారు. ఈ సంఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు.



## పల్లె దవాఖానలో మెగా హెల్త్ క్యాంప్

ప్రజాపక్షం/బిజినేపల్లి: గంగారం గ్రామంలో శనివారం సంపూర్ణ సురక్ష కేంద్రం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నాగర్ కర్నూల్ లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో గంగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆవరణలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో గంగారం, పరిసర తాండల ప్రజలు శిడిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 142 మందికి హెచ్.ఐ.వి, హెపటైటిస్‌బి, హైపటైటిస్ సి, సిఫలిస్ వ్యాధులు స్క్రీనింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. జీవనశైలి వ్యాధులైన రక్తపోటు మధుమేహ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించారు. లట్టుపల్లి వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ హెచ్ఐవి స్క్రీనింగ్ రక్త పరీక్షల నిర్వహించుకుని తాము హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నుండి సంపూర్ణ సురక్షితంగా ఉన్నామని తెలుసుకోవాలన్నా రు. ఎయిడ్ రోగుల పట్ల వివక్ష చూపరాదని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రమేష్, ఎమ్ఎల్‌హెచ్‌పి డాక్టర్ తేజస్విని, ఎ.ఎన్.ఎం విజయలక్ష్మి , ఐటిసి కౌన్సిలర్ బంగారయ్య, ఆశా కార్యకర్తలు నాగజాత,ఎస్ఎస్‌కె సంస్థ ఆంజేయులు శివకుమార్ పాల్గొన్నారు.



## పంటలకు తెగుళ్లు

ప్రజాపక్షం/బిజినేపల్లి: ప్రస్తుతం మండలంలో సాగుచేసిన మొక్కజొన్న పంట ఎక్కువశాతం కంకి ఏర్పడే దశలో ఉందని మండల వ్యవసాయ అధికారిణి నీతి అన్నారు. గిన్నెలు భాగంగా మండలంలో ఎక్కువ శాతం పూత అనంతరం ఎండు తెగుళ్లు వ్యాపించి సోకడం గమనించడం జరిగిందని అన్నారు. సాధారణంగా ఈ తెగులు రావడానికి మొక్కజొన్నకు ఎక్కువ శాతం మోతాదుకు మించి నీరుపెట్టడం వలన ఇలాంటి తెగుళ్లు వ్యాపిస్తుందని తెలిపారు. రైతన్నలు దీనిని తొలి దశలోనే గుర్తించి మొక్కలను ఏరి దూరంగా పాడవేసి నాశనం చేయాలన్నారు. దీనికి నివారణ కార్యక్రమంలో భాగంగా కాపర్ ఆక్సి క్లోరైడ్ అనే మందును మూడు గ్రాములు లీటర్ నీటిలో లేదా ఎకరాకు 600 గ్రాములు చొప్పున తయారు చేసుకుని పిచికారి చేయాలన్నారు. పంటకు కావాల్సినంత మాత్రమే నీటిని పెట్టాలని రైతులకు సూచించారు. ఎక్కువ మోతాదులో నీటిని మొక్కజొన్నకు పెట్టకూడదని తెలిపారు.

## వనపర్తిలో చెత్త పన్ను రద్దు చేయాలి

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి పనులు చేస్తున్న చెత్త పన్నును రద్దు చేయాలని అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్య వేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ మాట్లాడు తూ ప్రతి ఏడాది ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు చేస్తూ అదనంగా చెత్త పన్నులు చేయడంతో ప్రజలపై భారం మోపడమే అన్నారు.



అదేవిధంగా కలెక్టర్, ఎమ్మెల్యేకు ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం మరికల్, గద్వాల, మహబూబ్‌నగర్‌లో చెత్త పనులు సేకరణ ఎత్తివేయడం జరిగిందని అధిక టాక్స్ వసూలుచేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని అధికారులకు ఎన్నో సార్లు వినిపించుకున్నామని, ప్రజలపై అదనపు భారం ఎత్తివేయాలని ఈ అవినీతికి పాల్పడి నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

### 20 మంది రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు పంపిణీ
### మూడు నెలలకు ఒకసారి ప్రజావాణి తరహా కార్యక్రమం
### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని విద్యుత్ భవన్ వద్ద వ్యవసాయ అవసరాల కోసం 20 మంది రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాన్స్ఫార్మర్ లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని రైతులు వేసిన పంటలు ఎండిపోరాదనే ఉద్దేశంతో తాను ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్ లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేశామని, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. రైతు క్షేమంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు.

ఈరోజు 20 మంది రైతులకు ట్రాన్స్ఫార్మర్‌లు పంపిణీ చేస్తున్నామని త్వరలో మరికొందరికి ట్రాన్స్ఫార్మర్‌లు పంపిణీ చేస్తాం అని స్పష్టం చేశారు. భవిష్యత్తు లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు గృహ అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు హన్వాడ మండలంలోని గొండ్యాలలో 132 కెవి సబ్ స్టేషన్ మంజూరు చేయించుకోవడం జరిగిందని, ఆరు 33/11 కెవి సబ్ స్టేషన్లు మంజూరు చేసుకున్నామని ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రైతు సమస్యలను తెలుసుకొనేందుకు ప్రజావాణి తరహా కార్యక్రమం నిర్వహించాలని ఆయన విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ పివి రమేష్, జిల్లా గ్రంథాలయ



సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటాద్రి, ఓడిసి సెల్ రాజు గౌడ్, మహబూబ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, సిరిగిరి మురళీధర్, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, నాయక్ విద్యుత్ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**పదేండ్ల విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యింది**

క్రిష్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవిఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో పది కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న బాలికల హాస్టల్ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో గత పది సంవత్సరాలు కనీస మౌలిక సదుపాయాలను కూడా గత ప్రభుత్వం కల్పించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖ ఖాద్రీ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ఓబిసి సెల్ రాజు గౌడ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సహకార శాఖ మంత్రి, పలువురు ఎంపిలకు ఘన సన్మానం



ప్రజాపక్షం/ జడ్చర్ల : పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర సాహకార శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసిబి ,చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డిలను కొత్తకోట మండల కేంద్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ల ఫోరం ఘనంగా సన్మానించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే 900 పై బడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం 14 వ తేదీన ముగియగా, రైతులకు ప్రస్తుతం జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అంతరాయం కలగకుండా సింగిల్ విండో డిసిసిబి టెస్కాబ్‌ల పాలకవర్గాల పదవీ కాలా న్ని మరో ఆరు నెలల పాటు పొడిగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారిని గజమాలలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ సహకార శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రైతులకు అదే విధంగా సింగిల్ విండోలు సమర్థవంతంగా పని చేయాలని ఆ ఉద్దేశంతోనే మీ పదవీకాలం మరో ఆరు నెలల పాటు పొడిగించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పిఎసిఎస్ చైర్మన్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతుల మధుసూదన్ రెడ్డి, పాలెం సుదర్శన్ గౌడ్, డిసిసిబి వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, వెంకటేష్ గుప్తా, వంశీచంద్ రెడ్డి ఫోరం నాయకులు అశోక్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆయా జిల్లాల సింగిల్ విండో అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహీంద్రా ప్రైడ్ సర్టిఫికెట్ కోర్స్




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్‌లో శనివారం నాడు టిఎస్‌కేసి, టాస్క్ వారి ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ ట్రైనింగ్ క్లాసెస్ వారం రోజుల శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు శిక్షణ పొందడం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి శిక్షణ తరగుతులకు ఉపయోగించుకొని నైపుణ్య శక్తిని పెంపొందించుకోవాలని, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని తెలియజేస్తూ అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్, టి ఎస్ కేసి కోఆర్టినేటర్ డాక్టర్ హరిబాబు, టిఎస్ కే సి మెంబర్ ఎస్ రాజ వర్ధన్ రెడ్డి టి ఎస్ కే సి మెంటర్ పి స్వరూప, మహేంద్ర ప్రైడ్ ట్రైనర్ జి శ్యాం కుమార్ పాల్గొనడం జరిగింది.

## లిఫ్ట్ అండ్ బ్యారేజ్ ఎత్తిపోతల పథకం ఆపాలి

ప్రజాపక్షం/మక్తల్:రాబోపు కాలంలో జురాలకు నీళ్లు వచ్చే అవకాశం లేదు మక్తల్ ప్రాంతాన్ని ఎడారి గా మార్చే కుట్ర చేస్తున్నారు కామలింగం తెలంగాణ ఉద్యమకారుడు అన్నారు. మక్తల్ నియోజకవర్గంలో కృష్ణా నది పై పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా మూడు టీఎంసీల నీటిని తీసుకెళ్లడానికి లిఫ్ట్ కం బ్యారేజ్ నిర్మిస్తుంటే మన కృష్ణ నీటిని తరలించే ప్రయత్నం చేస్తుంటే అధికారంలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రు లు, ఎమ్మెల్యేలు నాయకులు ఎందుకు ఈ లిఫ్టు కం బ్యారేజ్‌లపై మాట్లాడడం లేదని అన్నారు.

గూడూ రు దగ్గర ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో కర్ణాటక ప్రభుత్వం దాదాపుగా 3 లేదా 4 టిఎంసి ల నీళ్ల ను నీటి నిల్వ ఉండేందుకు గూడురు దగ్గర విక్రమంగా నిర్మాణం పూర్తి చేశారు. రైల్వే బోగీల కర్మాగారం ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. అందుకు అనుకూలంగా బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మా ణం చేసి ఆ నీటిని వాడుకుంటున్నా రు. అదేవిధంగా రాయచూరు జిల్లా గంజిపల్లి దగ్గర కృష్ణా నదిపై మరో అనకట్ట నిర్మాణం చేసి 24 గ్రామాలకు తాగునీరు సాగునీరు అందించేందుకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేసింది అక్రమంగా సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తా ఉంటే దీని పై ఎందు కు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడలేకపోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోవు కాలంలో జురాల ప్రాజెక్టుకు ఈ విధం గా అక్రమ నిర్మాణాలను ప్రాజెక్టులు నిర్మిస్తే తెలంగాణలో ఉన్న నారాయణపేట జిల్లా పూర్తిగా అడుగంటు పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రం లో ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు మక్తల్ ప్రాంతం పై దృష్టి సాధించి ఒకసారి ఆలోచించి అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకోవాలని అన్నారు.

## శివపార్వతుల కల్యాణానికి విరాళం

ప్రజాపక్షం/కల్వకుర్తి:పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు తలకొండపల్లి మాజీ జడ్పిటిసి మిషన్‌భగీరథ వైస్ చైర్మన్ ఉప్పలవెంకటేష్ లక్ష16వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలవెంకటేష్ సైన్యం, బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్, ఆలయకమిటి సభ్యులు రాజు, పాల్గొన్నారు.

# ప్రజోపయోగ పనులపై దృష్టి పెట్టాలి

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం / పెద్దమందడి : అధికారులు ప్రజా ఉపయోగపరమైన పనులపై దృష్టి సారించి పనుల్లో వేగవంతం పెంచాలని, వనపర్తి ఇయోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లవేళల సహకరిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి కష్టపడే తత్వం గల వ్యక్తి ఉన్నాడని ఆయన ప్రతిపాదించిన ప్రతి పనిని తాము ఆమోదించి మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రాథమిక ఆరోగ్య ఉప కేం ద్ర నిర్మాణానికి, వ్యవసాయ శాఖ మంత్రితో పా టు టూరిజం శాఖ మంత్రులు జూపల్లి కృష్ణారా వు, ఎంపీ మల్లురవితో కలిసి ఎమ్మెల్యే మేఘారెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం వెల్టూరు గ్రామ చేనేత కాలనీలోని ఉన్ని పారిశ్రామిక సంఘంను వారు సందర్శించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఇక్కడ కార్మికులు తయారు చేసిన రగ్గులకు ఫినిషింగ్ కోసం హర్యానా వెళ్లవాల్సి వస్తుందని ఆ ఫినిషింగ్ యూనిట్‌ను తమకు మంజూరు చేయవాల్సిందిగా ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఉన్ని చేనేత పరిశ్రమలోపని చేసే కార్మికులకు పని కి తగ్గ వేతనం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని మంత్రి ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారి బుర్రవాగు స్టేజి నుంచి మోజర్ల గ్రామానికి వెళ్లే రహదారిలో నిర్మించే బ్రిడ్జిల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**నూనె గింజల ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుదాం**

కొత్తకోట : భారత దేశానికి నూనె గింజలు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆకాంక్షించారు. శనివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ వనపర్తి జిల్లాలో పర్యటించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డి పల్లి శివారులో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఆయిల్ ఫాం ప్రాసెస్సింగ్ యూనిట్ నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంకిరెడ్డిపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతు లు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడిలను వినియోగించుకొని ఆయిల్ ఫాం సాగులో వనపర్తి జిల్లా నంబర్‌గా నిలిచేలా రైతులు ఆయిల్ ఫాం తోటలను ఎక్కువ మొత్తంలో సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విత్తన అభివృద్ధి డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, మదనపురం మార్కె ట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ , సిడిసి చైర్మన్ గొల్ల బాబు, అమరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు బోయెజ్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి డా. పిజె బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీను, వేములు శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మంచి నూనెను ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి**

వనపర్తి ప్రతినిధి: శనివారం రాష్ట్ర ఆబ్కారీ , పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి వనపర్తి జిల్లాలో పర్యటించి దేవరకద్ర నియోజకవర్గంలోని సంకిరెడ్డిపల్లి గ్రామంలో ప్రీయునిక్ సంస్థ ద్వారా నిర్మించనున్న పాయిల్ ఫ్యాక్టరీకి తుమ్మల నాగేశ్వర రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో ప్రజలకు అవసరమైన మేరకు వంట నూనె ఉత్పత్తి లేకపోవడం వల్ల ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని తద్వారా మన ఫారెన్ నిల్వలు ఇతర దేశాలకు చెల్లించడం జరుగుతుందన్నారు. దేశంలో వంటనూనెల లోటు భర్తీ చేయాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు భూమి పూజ చేస్తున్న పామాయిల్ కంపెనీ, ఆగస్టు 15 నాటికి ప్రారంభోత్సవం చేస్తామని అదేవిధంగా బీచ్‌పల్లి వద్ద ఉన్న వేరుసెనగ ఆయిల్ కంపెనీని మరమ్మతులు చేసి పామాయిల్ కంపెనీగా ఇదే సంవత్సరంలో ప్రారంభించుకుంటామని భరోసా ఇచ్చారు.

రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోట సాగు చేయించి ప్రతి జిల్లాకు ఒక పామాయిల్ కంపెనీ స్థాపించడం ప్రభుత్వ లక్ష్యంగా ప్రకటించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రశాంత్, పిఏసిఎస్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీశైలం ఎడమగట్టుకాల్వ పనుల్లో ప్రమాదం బాధాకరం

### సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ ఎస్ఎల్‌బిసి పనుల్లో ప్రమాదం జరగడం చాలా బాధాకరమనికార్మికుల ప్రాణాలను సురక్షితంగా కాపాడాలని సిపిఐరాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా ప్రభుత్వాన్ని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు నిలిచిపోయితిరిగి ప్రారంభించేముందు టన్నెల్‌ను పూర్తిగా పరీక్షించకుండా గత ఐదు సంవత్సరాలుగా ఎక్కడైనా లీకేజి , సొరంగం దెబ్బతిన్నదా సురక్షితంగా ఉందా అనే నాణ్యత పరీక్షలు చేయకపోవడంవలననే ప్రమాదం సంభవించిందన్నారు.

కేవలం నిర్మాణసంస్థ అయిన జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కంపెనీ నిర్లక్ష్యంవల్లనే కార్మికుల ప్రాణాలమీదికివచ్చిందని దీనికి పూర్తిబాధ్యత నిర్మాణ సంస్థవహించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వంకూడా తగిన విధంగా కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పకడ్బందీగా సహాయకచర్యలు నిర్వహించి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, సిపిఐజిల్లా నాయకులు పెరుమాల్లగోపాల్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశమల్లే శివకృష్ణ పాల్గొన్నారు.

## మార్చి 25న ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్..

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మార్చి 25 న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ వచ్చే నెల 20వ తేదీ అని తెలిపారు.

హైదరాబాద్ ప్రాంతం పోస్టల్ ఉద్యోగులు పెన్షన్ విషయాలకు సంబంధించిన ఫిర్యాదుల ను ది అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్ట్ మాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్ హైదరాబాద్ 1 తెలంగాణ సర్కిల్ డాక్ సదన్, 5వ అంతస్తు, ఆబిడ్స్, హైదరాబాద్ 500001 అనే చిరునా మాకు పోస్ట్ ద్వారా పంపవచ్చునని తెలిపారు.




## జైలు అదాలత్‌లో 6 కేసులు పరిష్కారం

### ప్రధాన న్యాయమూర్తి కె.మమత రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: రాష్ట్ర న్యాయ సేవా అధికారి సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు, క్యాలెండర్ యాక్టివిటీస్ ప్రకారంగా శనివారం ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి కె.మమత రెడ్డి శనివారం జిల్లా జైలులో జైలు అదాలత్ ను నిర్వహించానారు. జైలు అదాలత్ ను మొత్తం (06) కేసులను పరిష్కరించినారు. జైలులో ఉన్న ఖైదీలు వారు వారిపై మోపబడిన నేరాన్ని ఒప్పుకున్నారు. కావున వారు అనుభవించిన జైలులో ఉన్న కలాన్ని తీసివేసి, కొంతకాలం పాటు శిక్షకాలం పూర్తి అయిన తర్వాత వారిని విడుదల చేయమని జైలు అదాలత్ లో నలుగురు న్యాయమూర్తులు ఉప్పధ్యాయ్, విజయ్ కుమార్, దరవత్ ఉదయ్ నాయక్, సయ్యద్ జకీయ్య సుల్తానా, మొహమ్మద్ ఉమర్, మల్లరెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ఖైదీలు, తదితరులు పాల్గొన్నా రు.

## వెంకన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాపక్షం/బిజినేపల్లి: వట్టెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి శరత్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ పూర్ణకుంభంతో హైకోర్టు జడ్జికి స్వాగతం పలికారు. లక్ష్మి గోదాదేవి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో అర్చక బృందం ప్రత్యేక పూజలుచేసి శేషవస్త్రం, ఆల య చరిత్ర విశేషాలు తెలుసుకొని సన్మానించారు. ఆల య చరిత్ర విశేషాలు తెలుసుకొని ప్రకృతి సౌందర్యం తో ఆకట్టుకుంటున్న ఆల య పరిసరాలు ఎంతో సంతోషాన్నిచ్చాయని భవిష్యత్తులో ఆలయం ఇంకా అభివృద్ధి చెందుతుందని హై కోర్టు జడ్జి చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు హనమంత్ రెడ్డి, జిల్లా రాజేష్ బాబు, సబ్ జడ్జి సబితా, కల్వకుర్తి సబ్ జడ్జి శ్రీదేవి, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ ఇన్ చార్జి జడ్జి కావ్య, బండారు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్ క్రీడ

## టెస్టు క్రికెట్‌లో ముగ్గురు మొనగాళ్లు



| | జావేద్ మియందాద్ | వివియన్ రిచర్డ్స్ | సునీల్ గవాస్కర్ |
|---|---|---|---|
| మ్యాచ్‌లు | 124 | 121 | 125 |
| పరుగులు | 8832 | 8540 | 10122 |
| సగటు | 52.57 | 50.23 | 51.12 |
| అర్ధ శతకాలు | 43 | 45 | 45 |
| సెంచరీలు | 23 | 24 | 34 |
| నాటౌట్‌లు | 21 | 12 | 16 |
| వికెట్లు | 7 | 32 | 1 |



ఒక బంతి ... పది పరుగులు...



అల్బర్ట్ హార్న్‌బై

అధికారికంగా ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ఒక బంతికి అత్యధిక పరుగులు పది. 1873లో అల్బర్ట్ హార్న్‌బై, 1900లో శామ్యూల్ ఉడ్ ఈ ఫీట్ సాధించారు. కాగా, క్లబ్ స్థాయిలో ఒక బంతికి 17 పరుగులు తీసిన రికార్డు గారీ చాప్‌మన్ పేరిట ఉంది. బాన్యుల్ క్రికెట్ క్లబ్ తన వెబ్‌సైట్‌లో ప్రస్తావన చేసింది. అందుకే, మైనర్ రికార్డ్స్ జాబితాలో దీనిని చేర్చవచ్చు.



## హర్షిత్ రాణా అరుదైన ఫీట్!

ఈ నెల మొదటివారంలో, నాగపూర్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే ఇంటర్నేషనల్‌లో భారత బౌలర్ హర్షిత్ రాణా 48 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌లో అతనికి అది తొలి వన్డే. అయితే, అన్ని ఫార్మాట్స్‌లోనూ ఆడిన మొదటి మ్యాచ్‌లోనే 3 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు సాధించిన బౌలర్‌గా అరుదైన ఫీట్‌ను ప్రదర్శించాడు. జాన్ లూయిస్ (ఇంగ్లాండ్) వంటి క్రికెటర్ల సరసన చోటు సంపాదించుకున్నాడు. లూయిస్ తన తొలి టి20లో 24 పరుగులకు 4, తొలి వన్డే ఇంటర్నేషనల్‌లో 32 పరుగులకు 3, మొదటి టెస్టులో 68 పరుగులకు 4 చొప్పున వికెట్లు పడగొట్టాడు. 2006లో, ది ఓవల్ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో టెస్టు కెరీర్‌ను ప్రారంభించిన లూయిస్‌కు అదే చివరి టెస్టు కూడా. ఇలావుంటే, శ్రీలంక బౌలర్ అజంతా మేండిస్ తన మొదటి వన్డేలో 39 పరుగులకు 3, టి20లో 15 పరుగులకు 4 చొప్పున వికెట్లు పడగొట్టాడు. 2008లో కొలంబోలో భారత్‌పై తొలి టెస్టు ఆడిన అతను మొదటి ఇన్నింగ్స్‌లో 72 పరుగులకు 4, రెండో ఇన్నింగ్స్‌లో 60 పరుగులకు 4 చొప్పున వికెట్లు కూల్చాడు. వెస్టిండీస్‌కు చెందిన దేవేంద్ర బిష్ణోయ్ (తొలి వన్డేలో 34 పరుగులకు 3, తొలి టి20లో 17 పరుగులకు 4, మొదటి టెస్టులో 68 పరుగులకు 4 వికెట్లు), ఆస్ట్రేలియా బౌలర్ పాట్ కమిన్స్ (తొలి టి20లో 25 పరుగులకు 3, తొలి వన్డేలో 28 పరుగులకు 3, తొలి టెస్టులో 79 పరుగులకు 6 వికెట్లు) సైతం ఈ లిస్టులో ఉన్నారు. కాగా, గత ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌తో టెస్టు కెరీర్ ఆరంభించిన హర్షిత్ రాణా తొలి ఇన్నింగ్స్‌లో 48 పరుగులకు 3 వికెట్లు కూల్చాడు. గత నెల ఇంగ్లాండ్‌తో పుణేలో తొలి టి20 మ్యాచ్ ఆడినప్పుడు 33 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించాడు. తాజాగా వన్డేల్లోనూ, తొలి టెస్టులో మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకొని, అరుదైన రికార్డులో భాగస్వామి అయ్యాడు.

మైదానంలో బ్యాటింగ్ చేస్తున్న వారికి ఏదైనా సమాచారం ఇవ్వాలంటే ఏం చేస్తారు? ఇప్పటి కాలంలో 12వ ఆటగాడి ద్వారా పంపిస్తారు. మంచి నీరు లేదా గ్లోవ్స్ మార్చడం లేదా మరేదైనా కారణాలతో 12వ ఆటగాడిని మైదానంలోకి పిలిపించాల్సిందిగా ఆటగాళ్ల గ్యాలరీ నుంచి సమాచారం అందుతుంది. తదనుగుణంగా బ్యాట్స్‌మెన్ స్పందిస్తారు. కానీ, గతంలో ఇలాంటి సౌకర్యం ఉండేదికాదు. బ్యాట్సమెన్‌కు 'టెలిగ్రామ్' ద్వారా సమాచారాన్ని చేరవేసేవారు. 'టెలిగ్రామ్'ను మైదానంలోకి వచ్చి మరీ అందచేసే అవకాశం మెసింజర్స్‌కు ఉండేది. 1938 ఏప్రిల్‌లో, వర్సెస్టర్‌షైర్‌తో మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఆస్ట్రేలియా బ్యాటింగ్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్‌కు అలాంటి సమాచారమే వచ్చినప్పటి దృశ్యం. ఇప్పుడు విచిత్రంగా కనిపించవచ్చుగానీ, అప్పట్లో ఇలాంటి దృశ్యాలు సామాన్యమే.



టెలిగ్రామ్ సందేశం



## ముజరబానీ ఆల్‌రౌండ్ ప్రతిభ

జింబాబ్వే ఆటగాడు బ్లెస్సింగ్ ముజరబానీ ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరచి, రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించుకున్నాడు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకూ ఐర్లాండ్‌తో జరిగిన టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 18 బౌలర్లు బౌల్ చేసిన అతను 58 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో 68 బంతులు ఎదుర్కొని, 47 పరుగులు చేశాడు. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో అతనికి ఇదే కెరీర్ బెస్ట్ ప్రదర్శన. ఈ విధంగా ఒకే మ్యాచ్‌లో, బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తమతమ అత్యుత్తమ ప్రదర్శనలు నమోదు చేసిన క్రికెటర్లలో ముజరబానీ 31వ ఆటగాడు. ఈ జాబితాలో అగ్రస్థానాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన మైఖేల్ వాన్ ఆక్రమిస్తాడు. 2002లో ట్రెంట్ బ్రిడ్జి మైదానంలో, భారత్‌తో జరిగిన టెస్టులో అతను తన కెరీర్‌లో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శనతో రాణించాడు. 197 పరుగులు సాధించాడు. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తూ 71 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. అతనికి కెరీర్‌లో ఇవే అత్యుత్తమ గణాంకాలు.

## కేంద్ర ప్రభుత్వానిది కార్పొరేట్‌ల బడ్జెట్

సిపిఐ జిల్లా కార్యర్శి పాలమాకుల జంగయ్య





**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ల కోసం తప్ప కార్మికులకు, కష్టజీవులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. శనివారం తుక్కుగుడలో మహేశ్వరం నియోజకవర్గం కార్యదర్శి దత్తునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవింద్రాచారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుతో కలిసి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్ వ్యవసాయానికి మోండి చేయి చూపిందని అన్నారు. వృత్తిదారులను దళిత, గిరిజన శ్రామిక వర్గానికి ఈ బడ్జెట్ అన్యాయం చేసిందన్నారు. గతంలో ఏనాడు లేని విధంగా కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచిపెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఆయన మండిపడ్డారు. కార్మికుల, కర్షకుల, అణగారిన వర్గాల కోసం పోరాడేది ఏకాకై పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ వంద సంవత్సరాలు శతాబ్ధి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దోపిడి వర్గాల కోటలను బద్దలు కొట్టే విధంగా కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయని అన్నారు. మార్చి 11వ తేదిన జిల్లా స్థాయి సెమినార్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సెమినార్ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రముఖ జర్నలీస్ట్ పాశం యాదగిరి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చికి మద్దతు ధరను ఇవ్వాలి...

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు
కంబాల శ్రీనివాస్,నాయకులు యల్లావుల రాములు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మిర్చీకి క్వింటాకు రూ.25 వేలను మద్దతు ధరగా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు యల్లావుల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ ఆర్‌డీఓ శ్రీనివాసులుకు మిర్చీకి 25వేల మద్దతు ధరను అందజేయాలని డిమాండ్ చేస్తూ మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా కంబాల శ్రీనివాస్, యాల్లావుల రాములులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాదిపదికన మిర్చీ రైతులను ఆదుకోవాలన్నారు. మిర్చీపంటకు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని,ఎకరాకు రూ. 1లక్ష 80 వేల నుండి 2 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. దిగుబడి మాత్రం 10,12 క్వింటాలు మాత్రమే వస్తుందని తెలిపారు. మిర్చీ ప్రస్తుత ధర 12 వేలు మాత్రమే పలుకుతుందని,అందువల్ల రైతులు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారని తెలియజేశారు. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులందరూ పీలకల్లోతు అప్పుల్లోకి కూరుకుపోతున్నారన్నారు. మిర్చీ రైతులందరూ కూడా అధిక వడ్డీలకు నగదు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని, తక్షణమే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చీ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మామిడి నర్సయ్య, జక్కుల రమేష్,జడ వెంకన్న,కుడితొట్టి స్వామి,బంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలను అమలు చేసి ఎన్నికల్లో సత్తా చాటాలి

కాంగ్రెస్ ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి సూచన





**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక ల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో వేగం పెం చాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతు బరోసా, పంటల భీమా, కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్ల పెంపు అమలుకు తక్షణమే పూనుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల నేపథ్యంలో సిపిఐ శ్రేణులు ప్రణాళిక బద్ధంగా పని చేసి జనగామలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. శనివారం జనగామలోని సిపిఐ కార్యాలయం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా సమితీ సమావేశం కావటి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కీ అన్నట్లుగా ఉందన్నారు. తక్షణమే అర్హులైన రైతులందరికి రైతు బరోసా అందించాలని, పంటల భీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, ఇళ్ల స్థలాలు పెంచన్ల పెంపు హామీని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ హామీల అమలు ఇలానే కొనసాగితే ప్రజల వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందన్న హెచ్చరించా రు. మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా అమలవుతుందని, అయితే ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు పెంచుతూ చేసిన హామీ, బకాయిల చెల్లింపు ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ కొంత వరకు అమలు అవుతున్నా పేదలందరికి పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. రేషన్‌కార్డులు లేకపోవడం వలన పేదలు ఈ పథకాన్ని పొందలేనక పోతున్నారని, అందుకే త్వరితగతిన రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. పలు సాంకేతిక కారణాల నేపథ్యంలో హామీలు పూర్తి స్థాయిలో అమలు కావడం నోచుకోవడం లేదని, సాంకేతిక కారణాలను తొలగించి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తే హామీలు అందె విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, రావుల సదానందం, చామకూర యాకూబ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలనకు మతం రంగు పూస్తున్న బిజెపి





లౌకికవాద భవితవ్యం ప్రశ్నార్థకం
సాగర్ జలాల్లో తెలంగాణ వాటా దక్కాల్సిందే : బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపి పాలనకు మతం రంగు పూస్తుందని ప్రతి దానిని మతం కోణంలోనే చూస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. మతాన్ని బూసిగా చూపి రాజకీయ ఎజెండాగా మార్చుకుని బిజెపి లబ్ది పొందాలని చూస్తుందని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపి ఐ ఖమ్మం, వైరా, పాలేరు, మధిర నియోజక వర్గా ల సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. మిడికంటి చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ మోడీ పదేళ్ల పాలనలో ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకు రావడంలో బిజెపి దాని అనుబంధ సంస్థలు సఫలీకృతమయ్యాయని ఆ యన తెలిపారు. మెజార్టీ, మైనార్టీ పద్ధతిలో బిజెపి వ్యవహరిస్తుందని ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో దేశంలో శాంతి కొరవడుతుందని ఆయన అన్నారు. పాలనకు మతం రంగు పూయడం వల్ల లౌకికవాద భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్పొరేట్లు సంపన్న వర్గాలు మినహాయించి మరో వైపు చూసే ఆలోచనలో బిజెపికి లేదన్నారు. ఆర్థికంగా భారత్ వెలుగుతుందని చెబుతున్న బిజెపి పాలనలో ఉపాధి కల్పన రంగాలు వట్టిపోయాయని వ్యవసాయ రంగం కూనరిల్లుతుందని చిన్నతరహా పరిశ్రమలు మూతపడ్డాయని కేవలం కార్పొరేట్ సంస్థలు మాత్రమే పురోగతిలో ఉన్నాయన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వాటాకు ఇబ్బంది జరిగితే భారత కమ్యూనిస్టు పార్టీ సహించదన్నారు. రైతు భరోసా విషయంలో రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని అనుమానాలకు తావివ్వకుండా ప్రతి రైతుకు రైతు భరోసా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని హేమంతరావు కోరారు. ఆయకట్టు చివరి భూములకు సాగర్ జలాలను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోడు రైతులపై దాడులు ఖండిస్తున్నాం

సిపిఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజకుమార్





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామంలో ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దాడులను ఖండిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణ రెడ్డి భవన్‌లో సిపిఐ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి సొత్తు ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ, భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామంలో ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై చేసిన దాడులను ఖండిస్తున్నట్లు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూములపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యంగా రైతులు, మహిళలను చూడకుండా దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. 150 మంది ఫారెస్ట్ బృందం పోడు సాగు చేసుకున్న రైతులను విచక్షణారహితంగా కొట్టి, అక్రమంగా వారిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఆ రైతుల వద్ద సుమారు రూ.5 లక్షలు లంచం తీసుకున్నట్లు తెలిపినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు విచారణ చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏముందో అర్థం కావటం లేదన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపి భూపాలపల్లి డిఎఫ్‌ఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మాతంగి రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

## మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** రైతులు పండించిన మిర్చి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ములుగు జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. శనివారం వెంకటాపురం మండలంలో రైతులతో, జిల్లా అధ్యక్షులతో కలిసి మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే రోజుల్లో మిర్చి మార్కెట్ వరంగల్, గుంటూరు, ఖమ్మం మార్కెట్లు కొనుగోళ్లు క్వింటాల్‌కు రూ.25వేల నుండి రకాన్ని బట్టి రూ.30 వేల వరకు ధర ఉండడంతో రైతుల కళ్ళలో ఆనందం కలిగిందన్నారు. అదే మార్కెట్‌లో ఈ సంవత్సరం ఈ నెలలో మరి దిగజారి రూ. 9 వేల నుండి రూ.12వేలకు పడిపోవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నవని, పెట్టుబడులు ఎకరానికి రూ.2.5లక్షల వరకు ఖర్చులు అవుతున్నాయని చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావడం లేదని పెరిగిన ఖర్చులతో రైతులకు పెట్టుబడులు తడిసి మోపడవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వెంటనే ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దయెత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, శ్యామల సుబ్బారావు, గారాపు వెంకటేశ్వర్లు, సంద్రగొండ నగేష్, గగ్గురి రవి, బొట నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫీజుల పేరిట వేధిస్తే చూస్తూ ఊరుకోం

ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే చూస్తూ ఊరుకోమని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హెచ్చరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చదువుకునే రోజు లు పోయి చదువుకొనే రోజులు వచ్చాయని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయే తప్ప, విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తలేవని ఆయన అన్నారు. ఫీజులు త్వరగా చెల్లించాలని, చెల్లించని విద్యార్థులను తోటి స్నేహితుల ముందే నిలబెట్టి అవమానపరిచే విధంగా, మనస్థాపానికి గురయ్యే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయ న అన్నారు. ఫీజులు త్వరగా చెల్లించకపోతే పరీక్షలు నిర్వహించమని,హాల్ టికెట్స్ ఇవ్వమని విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ, విద్యను దూరం చేసే విధంగా చేస్తున్నారని ఆయన వాపోయారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీని, అవేమి పట్టించుకోకుండా ధనార్జనే ధ్యే యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థులను ఫీజుల పేరిట వేధిస్తే చూస్తూ ఊరుకోమని, విద్యార్థులతో వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.


అనంత పద్మనాభ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ జడ్పిటిసి శ్యాంమ్ సుందర్ రెడ్డి తదితరులు

# మహానగరి

## ఎల్ఆర్ఎస్ పేరిట బిఆర్ఎస్ మోసం



**ప్రజాపక్షం/కొత్తూర్ :** ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజలను మోసం చేసింది బిఆర్ఎస్ పార్టీ అని షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇబ్రహి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత పది సం వత్సరాలుగా తెలంగాణ రియాల్ వ్యాపారులపై పడి ముక్కుపిండి డబ్బులు వసూల్ చేశారు. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌లో 25 శాతం రాయితీ ఇస్తుంటే ఓర్వలేక పోతున్న బిఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.

## ప్రజల కోసం పోరాటం చేసేది సిపిఐ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ప్రజల కోసం అనునిత్యం ప్రజల సమస్యలపై పోరాటం చేసేది ఎర్రజెండాకు మాత్రమే ఉందని సిపిఐ పార్టీ హస్తినాపురం డివిజన్ ఎండి షైమీద అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్‌లోని భేపేష్ గుప్తా నగర్‌లో సిపిఐ 100 జయంతి ఉత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎర్రజెండా పార్టీ పేదల కోసం పోరాటం చేస్తుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య పోరాటలతోనే సమస్యలు పరిష్కారించడంలో సిపిఐ పాత్ర కీలకమన్నారు. నేరెళ్ల చరిత్ర పార్టీ ఒక్క సిపిఐ పార్టీ ఉందని ఆమె తెలిపారు. ప్రజా పోరాటంలో సిపిఐ చరిత్ర అజరమారం అని ఆమె కోనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు కమలమ్మ, రాము, సీతమ్మ, జయమ్మ, రాజు, విజయ తదితరులు పాల్గొన్నారు.

## బాణామతి, చేతబడులు నమ్మొద్దు



**ప్రజాపక్షం/కొందుర్గు :** బాణామతి, చేతబడి, దెయ్యాలు పట్టడం అనే వాటిని ఎవరు నమ్మవద్దని కొందుర్గు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపినాథ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మూఢ నమ్మకాలు తప్పు అని సైన్స్ ద్వారా నిరూపించడం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వనపర్తి జిల్లా సైన్స్ అధికారి ఎం శ్రీనివాస్ బాణామతి, చేతబడి, దెయ్యాలు పట్టడం అంశాలపై విద్యార్థులకు చక్కటి ప్రదర్శనతో అర్థం అయ్యోవిధంగా వివరించారు. కనికట్టు విద్యలు ఎలాచేసి ప్రజలను కొంత మంది దొంగ బాబాలు, స్వాములు ఎలా మోసం చేస్తున్నారో సవివరంగా ప్రదర్శన ద్వారా తెలియజేశారు. అంతకుమందు ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం శ్రీ యోజన) ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ పథకం పై మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల, రాంచంద్రాపూర్, ఆగిర్యాల, వెంకిర్యాల, తంగళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపినాథ్ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ ఎన్నికైనందున్న విశ్వేశ్వరాయ కాలనీ శనివారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దృష్టికి కాలనీ వాసులు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, సీసీ రోడ్లు సమస్యలను ఆమె వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యాటించి కాలనీ సమస్యలపై ప్రణాళిక సిద్ధం చేసి నిధులు మంజూరు అయ్యే కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో ప్రతి సమస్యలను దశల వారిగా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరనాథ్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కోశాధికారి రాహుల్ సాగర్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు లాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, ఇలేష్ గౌడ్, వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, లట్టుపల్లి రాజశేఖర్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు మెరుగైన వైద్యం



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** నిరుపేదలకు మెరుగైన వైద్యం అందివ్వటమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మేల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధి ఎస్సీ కాలనీ, ఖానాపూర్ గ్రామా సమీపంలో స్థానిక ఎమ్మేల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతీథులుగా హజరై బస్తీ దావాఖానలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మేల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాలల్లో ప్రజలకు ఎలాంటి వ్యాధులు ప్రభల కుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బస్తీ దావాఖానలు ప్రయివేట్ ఆసుపత్రులకు ధీటుగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు బస్తీ దావాఖాలను సదున్వియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి, మాజీ వైస్ చైర్మన్ బర్ల మంగా , డిప్యూటి డిఎంఎచ్ఓ సుధమాధవి, డాక్టర్ సరిత, కొండల్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గోన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్ల లాంటివి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కండ్ల లాంటిదని మహేశ్వరం ఇంచార్జ్ కిచ్చనగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్‌కాలనీ, రామకృష్ణపురం కాలనీ, అల్కాపురి కాలనీ, ద్వారాకాపురం కాలనీలో సంక్షేమ సంఘం ప్రతినిధులందరూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కిచ్చనగారి లక్ష్మారెడ్డిని, టిపిసిసి ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిని మర్యాధపూర్వకంగా కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను శాశ్వితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయ చైర్మన్ సురేష్, యాదవరెడ్డి, సైదులు, కాలనీవాసులు సంజీవరెడ్డి,. రామారావు, వంశీ, శ్రీనివాస్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ అనుమతులలో ఇక 'బిల్డ్ నౌ'

పారదర్శకతతో కూడిన వేగవంతమైన సేవలు

మార్చి మొదటివారంలో అమల్లోకి

ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చిన అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూట్నీని సిస్టమ్ కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్‌ను అమలుకు బిల్డ్‌నౌ విధానాన్ని ప్రారంభించింది. ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటీని సిస్టం ద్వారా భవన నిర్మాణ అనుమతుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యంగా రూపొందించారు. ఇది అన్ని భవనాల అనుమతుల కోసం ఒక రాష్ట్రం ఒకే ఇంటర్ ఫేస్ సిస్టాన్ని కలిగి ఉంటుంది. ఎఐ ఆధారిత కొత్త విధానం వేగంగా, పారదర్శకంగా భవన అనుమతుల ప్రక్రియకు తోడుపడుతుంది. బిల్డ్ నౌ అప్లికేషన్ ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించే అధునాతన సాంకేతికతగల అత్యంత వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటీని సిస్టంలో ఒకటిగా రూపొందించారు. ఈ విధానం మార్చి నెల మొదటివారంలో అమల్లోకి తీసుకవచ్చేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ విధానంపై శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిల్డ్ నౌ డిసిఆర్‌పై లైసెన్స్‌డ్ ఆర్కిటెక్ట్స్‌లు, ఇంజనీర్లకు హ్యాండ్స్ ఆన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బిల్డ్ నౌ డిసిఆర్ వ్యవస్థపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రక్రియలో క్రియేషన్ ఆఫ్ టెంపులేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటిలను రూపొందించడం గురించి అవగాహన కల్పించారు. ఇది ఆర్కిటెక్‌లు, ఇంజనీర్లకు తమ ప్రాజెక్టులను నిబంధనల మేరకు రూపొందించేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం ఈ శిక్షణ కార్యక్రమంలో డిసిఆర్ వ్యవస్థపై వివరణాత్మక ప్రదర్శన అందించడంతో పాటు డిసిఆర్ పోర్టల్‌లో డ్రాయింగ్ తయారీ ప్రక్రియను వివరించారు. శిక్షణలోభాగంగా తలెత్తిన సందేహాలను బిల్డ్ నౌ బృందం సభ్యులు నివృత్తి చేశారు.

### 'బిల్డ్ నౌ'తో పారదర్శక సేవలు : దేవేందర్ రెడ్డి

ఈ సందర్భంగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బిల్డ్ నౌ విధానం ద్వారా పారదర్శకతతో కూడిన వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ శిక్షణకార్యక్రమం భవన నమూనాల రూపకల్పన, అనుమతుల ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ప్రామాణిక నిర్మాణ నిబంధనల మేరకు ప్రాజెక్టులు, డ్రాయింగ్‌లను ప్రణాళిక బద్దంగా రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లకు ఈ శిక్షణా కార్యక్రమం ఉపయుక్తమవుతుందన్నారు.

### వేగవంతంగా అనుమతులు మంజూరు : శ్రీనివాస్

జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటీని సిస్టం కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. ఈ శిక్షణను పూర్తిగా అవగాహన చేసుకొని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అదనపు చీఫ్ సిటీప్లానర్లు, సిటీప్లానర్లు, అసిస్టెంట్ సిటీప్లానర్లు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడాలంటే వైద్యంతో పాటు మానసిక, ఆర్థిక బలం కావాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడడం అంటే కేవలం వైద్య చికిత్సకు సంబంధించినది మాత్రమే కాదని, దీనికి మానసిక బలం, ఆర్థిక మద్దతు , సమాజ అవగాహన కూడా అవసరమని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.ఎస్.రావు, అన్నారు. బ్లడ్ క్యాన్సర్స్ నిర్ధారణ, చికిత్సలో అందుబాటులోకి వచ్చిన పురోగతులపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు యశోద హాస్పిటల్స్‌లో శనివారం ప్రారంభమైంది. ఈ సదస్సుల్లో 200 మందికిపైగా జాతీయ, 10 మందికిపైగా అంతర్జాతీయ ఆంకాలజీ, హెమటోఆంకాలజీ వైద్య నిపుణులు హాజరయ్యారు. ఈ సదస్సును ప్రారంభించిన డాక్టర్ జిఎస్‌రావు మాట్లాడుతూ భారతదేశంలో బ్లడ్ క్యాన్సర్ కేసులు నానాటికి పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గ్లోబోకన్ 2020 నివేదికల ప్రకారం దేశంలో ఏటా దాదాపు 1.3 మిలియన్ల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని ,అందులో రక్త క్యాన్సర్లు గణనీయమైన నిష్పత్తిలో ఉంటున్నాయని తెలిపారు. అయితే క్యాన్సర్ చికిత్సలో ఎముక మజ్జ మార్పిడి నుండి కార్– టి సెల్ థెరపీ వంటి అత్యాధునిక ఇమ్యునోథెరపీల వరకు క్యాన్సర్ చికిత్సలో అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక మార్పులు క్యాన్సర్ రోగులకు కొత్త ఆశలను అందిస్తున్నాయని డాక్టర్ జిఎస్ రావు వివరించారు.

## వర్గీకరణను మందకృష్ణ అడ్డుకునే యత్నం

మందకృష్ణపై విరుచుకుపడ్డ మేడి పాపన్న

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడి, ప్రక్రియను కొనసాగిస్తుంటే మందకృష్ణ మాదిగ అడ్డుకొనే ప్రయత్నంచేస్తూ అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక చైర్మన్ మేడి పాపన్న అన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బేడ, బుడగ జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షులు తూర్పాటి హనుమంతు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాపన్నతోపాటు వేదిక వైస్‌చైర్మన్లు జున్ను కనకరాజు, ఇటుక రాజు, పి.మేరి, సలహాదారులు రాజలింగం, శ్రీనివాస్‌రావులు మాట్లాడారు. వర్గీకరణలో భాగంగా లక్షా 31వేల మంది ఉన్న బుడగ జంగాలను 'బి'లో చేర్చడమైందని, వారిని 'ఎ'లో చేర్చాలని మందకృష్ణ కోరటంలో అర్థం లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణకు కీలకపాత్ర పోషించిన మంత్రి దామోదర రాజనరసింహను మాదిగ కులం కాదన్న మందకృష్ణా ఇటీవల సిఎంను ఎవరివల్ల కలిశావో యాది చేసుకో అంటూ సూచించారు. దామోదరను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వర్గీకరణను అసెంబ్లీ ఆమోదించాక లక్షల డప్పులతో కృతజ్ఞత సభ పెడతామంటే మౌనంగా ఎందుకు ఉండిపోయావు అంటూ మందకృష్ణను ప్రశ్నించారు. మాదిగ మేధావులతో చర్చించావు కానీ, మాల నేతలను, బిజెపి మాజీ ఎంపి వెంకటేశ్ నేతకానిని వెంటబెట్టుకొని అబద్ధపు ప్రచారాలతో మాదిగలకు ద్రోహం చేస్తున్నావంటూ విరుచుకుపడ్డారు. సమావేశంలో డాక్టర్ మేడి రమణ, శ్రీనివాస్, గంధం రాములు, గద్ద యాదయ్య పాల్గొన్నారు.



## మాకు న్యాయం చేయాలి

ప్రభుత్వానికి 'కుబేర' నిర్మాతలు విజ్ఞప్తి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** తెలుగు సినీరంగంలో ఎన్నడూ జరగని విధంగా శేఖర్ కమ్ముల 'శేఖర్ కమ్ముల కుబేర' పేరిట తమ సినిమాను అడ్డుకొంటున్నారని, దీనిపై తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కుబేర మూవీ నిర్మాత నరేందర్, సహ నిర్మాతలు రవికాంత్, మల్లేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, చలనచిత్ర, టీవీ, థియేటర్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్‌రాజుకు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ తాము 2023లోనే త్రిశక్తి ఎంటర్‌ప్రైజస్ నుంచి 'కుబేర' టైటిల్‌తో సినిమా షూటింగ్‌ను ప్రారంభించామన్నారు. ఇప్పటికే 90శాతం షూటింగ్ పూర్తి చేశామని తెలిపారు. కానీ, శేఖర్ కమ్ముల ఈ ఏడాది మార్చి 5 నుంచి 'శేఖర్ కమ్ముల కుబేర' అనే పేరును జోడించి తమ సినిమాకు ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు. దీంతో తాము మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. తమ సినిమా పేరును వాడుకొన్నందుకు శేఖర్ కమ్ముల బృందం తన సినిమాలో వాటా ఇవ్వాలని లేదా నష్టపరిహారమైనా చెల్లించాలని లేకపోతే 'శేఖర్ కమ్ముల కుబేర టైటిల్‌ను' ఒకేవిధమైన ఫాంట్ సైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో న్యాయవాది రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## వలస కార్మికుల బతుకులు ఆగమైతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**ప్రజాపక్షం/గండిపేట :** వలస కార్మికులు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి వచ్చి హైదరాబాదు పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్నారని వారికి ఎలాంటి భద్రత,కనీస వేతనాలు ఇవ్వకుండా తీవ్రంగా మోసం చేస్తు పని చేయించుకుంటున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం శంషాబాద్‌లోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో వేలాది వలస కార్మికులు పనిచేస్తున్నారని వారికి ఎలాంటి భద్రత సౌకర్యాలు కల్పించకుండా కార్పొరేట్ నిర్మాణ కంపెనీలు పనులు చేయించుకుంటూ చట్టబద్ధమైన హక్కులను కూడా ఆ కంపెనీ యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయని ఆయన విమర్శించారు. లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాల కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వాలు లేబర్ అధికారులు లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలం అయ్యాయని ఆయన విమర్శించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు అవకాశాలు కల్పించాలని అన్నారు. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారని దానివల్ల చాలామందికి ప్రమాదాలలో గాయపడిన చనిపోయిన లేదా పెళ్లి శుభకార్యాలకు ఎలాంటి సహాయం అందడం లేదని సర్వర్ ప్రాబ్లం అని చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆయన తెలిపారు. ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో వేల మంది నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఉన్నారని వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేబర్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించడంలో విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల మీద మా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని జిల్లా వ్యాపితంగా విస్తరించడానికి ప్రయత్నం చేస్తానని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా మా సంఘం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెంది వెంకటే,కోశాధికారి కేతరాజు నరసింహ, జిల్లా కార్యదర్శి నర్రగిరి, రాములు, బండి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే విజయాలు సాధ్యం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్ :** విద్యతోనే విజయాలు సాధ్యం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలోని 860 మంది 10వ తరగతి విద్యార్థులకు పరిక్ష ప్యాడ్‌లు ఎఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే మనిషి భవిష్యత్ మారుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండి కష్టపడి చదివినప్పుడే భవిష్యత్ బంగారు బాటలు వేసుకుంటుందన్నారు. గురువులు చెప్పిన మాటలు విని బాగ చదువుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై నమ్మకంతో విద్యార్థులకు, మౌలిక వసతులు కల్పిస్తుందని చెప్పారు. విద్యార్థులకు విద్యలో ఎలాంటి సమస్యలు రాకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థులకు ఉపయోగపడే ప్రతి విషయంలో ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు నావంతు బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, తమ్మళి రవీందర్, జంగయ్య, సూర్య, తదితరులు పాల్గొన్నారు.



## బిజెఎంసిలో సంజయ్ మిశ్రా బృందం

**ప్రజాపక్షం/గండిపేట:** బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ స్వయం సహాయక సంఘాల విధివిధానాలు తెలుసుకొని అవగాహన పెంచుకునేందుకు బిహార్ రాష్ట్రానికి చెందిన రూరల్ లైవ్లి హుడ్ మిషన్ సంస్థ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ మిశ్రా తన బృందంతో కలిసి శనివారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థను సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.మల్లీశ్వరి పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా బండ్లగూడ జాగీర్ మహిళా సంఘాల విధివిధానాలు సందర్శకులకు వివరించారు. అనంతరం మెప్మా, బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఇంట్లో తయారు చేసిన వివిధ తినుబండారాలు, హాండ్ మేడ్ వస్తువులు పరికరాలు, వాటి నిర్మాణ ప్రక్రియను బీహార్ రురల్ లైవ్లి హుడ్ మిషన్ సంస్థ బృందం, బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్రతో కలిసి పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నూతన సంఘాల ఏర్పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా సాధికారత, స్వయం ఉపాధితో ఆర్థిక బలోపేతం తదితర అంశాలను వారికి వివారించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మిషన్ కోఆర్డినేటర్లు ప్రసన్న, పద్మ, రేష్మి, టీఎంసీ శ్రీలత, ఎడిఎంసిలు ఉమేష్, అశోక్, ఆర్‌పిలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ వైద్యులను వైద్యులుగా గుర్తించాలి

తెలంగాణ సంజీవని సంక్షేమ సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్రంలో గ్రామీణ ప్రజల కోసం అనునిత్యం వారి ఆరోగ్య పరిస్థితుల ను మేరుగుపర్చడంలో ప్రాథమిక వైద్యంతోనే ఆర్‌ఎంపిలు, పిఎంపిలు మేలు చేస్తున్నారని వారిని రాష్ట్ర ప్రభుత్వం వైద్యులుగా గుర్తింపు పొందే విధంగా వారికి శిక్షణలు ఇచ్చి సర్టిఫికెట్లు అందించాలని తెలంగాణ సంజీవని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ, చైర్మన్ మద్దూరి శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బి నగర్‌లోని అంబేద్కర్, శ్రీకాంత్ చారి విగ్రహం వద్ద తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎంఎల్‌సి కోదండరాం చిత్రాపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స చేయడానికి గత నాగరికత నుంచి వస్తున్న అనవాయితీగా మేము ప్రాథమిక చికిత్స ప్రజలకు అందిస్తున్నామని వారు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత విద్య చదివిన జూడాల డాక్టర్లు వారికున్న నైపుణ్యతను బట్టి ప్రజలకు చికిత్స అందించే బాధ్యత వారికి ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎంబిబిఎస్ డాక్టర్లు లేనప్పటికీ ఆర్‌ఎంపిలు, పిఎంపిలు వారి సహకారంతోనే ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఎంబిబిఎస్ డాక్టర్ల చెంతకు రోగులను చేర్చడంలో మా పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. రాష్ట్రంలో 70వేల మంది ఆర్‌ఎంపిలు, పిఎంపిలుగా వైద్యాన్ని కొనసాగిస్తున్నామని, చిన్న చిన్న వైద్యంతోనే ప్రాథమిక చికిత్స అందిస్తూ మాజీవితాన్ని ఎల్లపుచ్చుకుంటున్నామని వారు పేర్కోన్నారు. గత వారంలో ఇందిరా పార్కు వద్ద జరిగిన సమావేశంలో ఎంఎల్‌సి కోదండరాం గ్రామీణ వైద్యులను గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరగా అతని దిష్టబొమ్మని జూడాల డాక్టర్లు దగ్ధం చేయడం చాలా బాధాకరమైన విషయమని దీనికి మేము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మాకు వైద్య పరంగా శిక్షణ అందించి గ్రామీణ వైద్యులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంజీవని సంక్షేమ సంఘం నాయకులు సిహెచ్ శ్రీనివాస్, శ్రీహరి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16నెలలు కావస్తున్న జిహెచ్ఎంసిలో నిధులు లేక పనులు ఎక్కడిక్కడ అగిపోయాని, నగర అభివృద్ధిపై శ్రద్ధ చూపకపోతే హైదరాబాద్ మరో 20 ఏళ్లకు ఎనుకబడిపోయే ప్రమాదం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యాలు చేశారు. శనివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లో 25లక్షల డ్రైనేజీ పనులను, క్రాంతి యువ జన భవనంకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్‌రెడ్డి, మధావరం నర్సింహ్మా రావు, అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాపక్షం/చర్లపల్లి : విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు ఆదివారం అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాబురావు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ 3లో 33కెవి మరమ్మతుల కారణంగా 11 కెవి గెయిల్ ఫీడర్,ఐఒసి,శెట్టి ఫీడర్,భరత్ నగర్ ఫీడర్లను ఉదయం 11 గం టల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేయడంతో ఐడిఎ ఫేస్ 3, భరత్ నగర్, గాంధీనగర్ కాలనీలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

# మహానగరి

## విద్యార్థులకు బహుమతులు అందజేత

ట్రైనీంగ్ కలెక్టర్ ఉమాహారతి

ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి : వికారాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో మహిళా సాధకారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటీ పడవో పదసంవత్సరాల వేడుకలో భాగంగా అన్ని కెజిబివి పాఠశాలలో నియోజకవర్గం లెవల్‌లో విద్యార్థులకు కబడ్డీ–ఖోఖో పోటీలు నిర్వహించారు. గెలు పొందిన విద్యార్థులకు ట్రైనీంగ్ కలెక్టర్ మహిళ శిశుశంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి ఉమహరతి చేతుల మీదగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సతీష్‌బాబుకు మెమోంటో అందజేత



ప్రజాపక్షం/చర్లపల్లి : టిడిపి సభ్యత్వ నమోదు భారీగా చేయించిన సందర్భంగా తెలంగాణ టిడిపి రాష్ట్ర కార్యదర్శి నీరుగొండ సతీష్ బాబుకు జాతీయ టిడిపి ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంఎల్‌ఎ,పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, పొలిట్ బ్యూరో సభ్యులు అర విందకుమార్‌గౌడ్ చేతుల మీదుగా మెమోంటోను అందించి అభినందించారు. ఈ కార్యక్ర మంలో క్రమ శిక్షణ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు,రాష్ట్ర నాయ కులు టిజికె మూర్తి, జివిజి నాయుడు,రాములు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా తైబజార్‌కు వేలం



ప్రజాపక్షం/దమ్మాయిగూడ : శివరాత్రి పండుగను పురస్కరించుకుని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసర గుట్టలోని శ్రీ రామ లింగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల జాతర ఈ నెల 24వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు కీసరగుట్టలో ఏర్పాటు చేసే దుకాణదారుల నుండి తైబజార్ వసూలు చేసేందుకు తైబజార్‌కు వేలం నిర్వహించారు. వేలంలో ఆరుగురు పాల్గొనగా ఎన్ కృష్ణారావు రూ.4లక్షలతో పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, వార్డు ఆఫీసర్స్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ కోడిగుడ్లు వినియోగంపై అవగాహన




ప్రజాపక్షం/అల్వాల్ : ఓల్డ్ అల్వాల్ ఇందిరా గాంధీ విగ్రహం కూడలిలో శనివారం అల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ వెంకటేశ్వర హైచరిస్ ఆధ్వర్యంలో చికెన్ కోడిగుడ్లు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉడకబెట్టిన గుడ్లను చికెన్‌తో పాటు పలు పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ కోళ్ళ ఫారాలలో బర్డ్‌ఫ్లై వస్తున్న వదంతుల వలన ప్రజలు చికెన్ కోడి గుడ్లును కొనడానికి బయపడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితులో చికెన్, కోడి గుడ్లు బాగా ఉడికించి తినటం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి హాని ఉండదని పైగా వీటివలన మంచి ప్రోటీన్ లభిస్తుందని తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు శాస్త్రీయంగా తెలిపారు. ఇదే విషయం కరోనా టైమ్‌లో కూడా నిరూపితమైనదని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

## అక్షయ విద్య ఫౌండేషన్ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలొని ఎల్లమ్మ బండ పిజెఆర్ నగర్‌లో అక్షయ విద్య ఫౌండేషన్ వారి భవనం ప్రారంభోత్సవానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరవుతారని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం అక్షయ విద్య ఫౌండేషన్ వారి భవనం ప్రారంభోత్సవం జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సభ ప్రాంగణంలో ఏర్పాట్లని ప్రణాళిక బద్దంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచి ంచారు. ఈ కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, యాదగిరి, ఫౌండేషన్ ఫౌండర్ వరప్రసాద్, యుబిడి సూపర్ వైజర్ నాగరాణి, జిహెచ్‌ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి



ప్రజాపక్షం/దోమ: దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జడ్పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలను శనివారం వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి సందర్శించి పలు రికార్డులను, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంపై విద్యార్థులక అవగాహన కల్పించాలని, ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో అధ్యాకులు బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులకు బోధనలో నిర్లక్ష్యం వహించకూడదని, విద్యార్థులను మంచి చదువుకునేలా ప్రోత్సహించాలని, చదవులో వేనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపద్యాయులు ప్రవీణ్‌కుమార్, షఫీ, ముత్యం, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రవేశాల్లో కార్పొరేట్ల ఇష్టారాజ్యం

బ్రాంచ్‌లు, ర్యాంకుల పేరుతో ప్రచారం

పట్టించుకోని అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్లు

వాటిపై చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/అల్వాల్: ఇంటర్ బోర్డ్ గుర్తింపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ నిర్వహిస్తున్న శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని అవసరమైతే సీజ్ చేయాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శనివారం అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తిరుమలగిరి సుభాష్ నగర్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఉన్న అడ్మిషన్లు నిర్వహిస్తున్న అనధికారిక శ్రీ చైతన్య కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కా ర్యదర్శి వల్లిఉల్లా ఖాద్రీ కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల 2025–26 విద్య సంవత్సర నోటిఫికేషన్ విడుదల కాకముందే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడం సరికాదని, నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు అను మతులు ఉన్న కళాశాలలోనే చేరాలి..కానీ కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు మంజూరు కాని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వలన నష్టపోతున్నారన్నారు. అడ్మిషన్ ఒక చోట తరగతులు ఒక చోట నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఈ కార్పొరేట్ కళాశాలలు మోసం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. అనుమతులు పొందని కళాశాలల్లో అడ్మిషన్లు పొందితే విద్యార్థులు తమ విద్యా భవిష్యత్‌ను నష్ట పోయే ప్రమాదమున్నదని, అదే విధంగా కార్పొరేట్ కళాశాలలు ధన దోపిడీకి తెరలేపాయని లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుండి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అను మతులు లేని ఐపీఎల్ ఐకాన్ నియాన్ పాస్ట్ ట్రాక్, కోస్పార్క్ లాంటి అనాధికర సెక్షన్లు అంటూ విద్యార్థులను అయోమయంలో పడేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడానికి అన్ని కళాశాలలలో మానసిక నిపుణుల కమిటీలు వేసేలా బోర్డ్ ఆదేశాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.తక్షణమే ఇంటర్ బోర్డ్ కార్పొరేట్ కళాశాలల ఆగడాలను ఆపాలని లేని పక్షంలో బోర్డ్ ఆదేశాలను భేకాతరు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి సల్మాన్ బేగ్, టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై పోరాడాలి

కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం: పారిశ్రామిక రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై పోరాడాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఐఎన్‌టియుసి కమిటీలో కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూకట్ పల్లి నియోజకవర్గం ఐఎన్‌టియుసి అధ్యక్షులు కాస నర్సింహ యాదవ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక విభాగం బలోపేతం చేయాలన్నారు. అసంఘటిత కార్మికులు, భవన,ఇతర నిర్మాణరంగ కార్మికుల కోసం ఉన్న ప్రభుత్వ పథకాల కల్పనతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, పుష్పరెడ్డి, సప్పిడి భాస్కర్, పడాల శివనారాయణ, ప్రకాష్, హుస్సేన్, జమీర్, ఎండి మోసీన్ పాల్గొన్నారు.

## మరోసారి కుల గణన సర్వే

బిసి కమిషన్ మెంబర్ బాలలక్ష్మి




ప్రజాపక్షం/నాగారం : సమగ్ర కులగణన సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల గణన సర్వేలో మిగిలి పోయిన కుటుంబాల వారిని ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిన సందర్భంగా నాగారం మున్సిపాలిటీ ఎన్యూమరేటర్స్‌తో సమా వేశం నిర్వహించారు. బిసి కమిషన్ ద్వారా అవగాహన కల్పించి పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, అన్ని కుల సంఘాలు పాల్గొని సర్వే పూర్తి చేయటానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, మేడ్చల్ డిబిసిడబ్ల్యుఒ, కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు శ్రీనివాస్‌గౌడ్,అన్నంరాజుసురేష్, సిబ్బంది పాల్గొన్నారు. **దమ్మాయిగూడ మున్సిపాలిటీలో....** దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కులగణన సర్వేపై వార్డ్ ఆఫీసర్స్, బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి పాల్గొని 28వతేదీ వరకు కులగణన సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ ప్రజలు, కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పరిపాలనలో నైపుణ్యాలు మెరుగుపడేలా శిక్షణ

జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: పరిపాలనలో నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకో వాలని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి అన్నారు. పోలీస్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించబడివారికి హైదరాబాద్‌లో ఆరు వారాల లో బేసిక్ ఇండక్షన్‌లో ట్రైనింగ్ నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణలో 71మంద ట్రైనీ జునియర్ అసిస్టెంట్ అధికారులు వికారాబాద్ డిపిఒను సందర్శించి అన్ని అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ పోలీస్ శాఖలో పరిపాలన విభాగం కీలకమనది మీరు సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానలను అవలంబించి, నిష్పక్షపాతంగా, పార దర్శకంగా, నైతిక విలువలు క్రమశిక్షణ, సమర్థత ఎంతో ముఖ్యన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి టివి హనుమంతురావు, భాష్కర్, విరేష్, మోహనప్ప మీర్జా జావిద్‌బేగ్, డేవిడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి : వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సామాజిక సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికై సిఆర్‌పిల వ్యూహంపై జిల్లా గ్రామీణ భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది . వికారాబాద్ జిల్లా లోనిదోమ, వికారాబాద్, ధారేర్, మర్పల్లి ,మోమిన్‌పేట్ మండలాల్లో పలు జిల్లాలకు సంబంధించి సిరిపిలు రెండు వారాలపాటు వివిధ గ్రామాల్లో సందర్శించి స్వయం సహాయక సంఘల బతోపేతానికై శిక్షణలు నిర్వహించారు. ఈ సందర్భంగా పమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గోన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదల నిర్మూలనే సెర్ప్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. స్వయం సహాయ క సంఘలు తమ కుటుంబ ఆర్థిక పరస్థితులను మెరుగుపరుచుకుంటునే సామాజకి కార్యక్రమాల్లో భాగస్వాముడ కావాలన్నారు. సమాజంలో బాల్యవిహలు, విద్యా, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. మహిళ సంఘలు పోదుపు చేయడమే కా కుండా బ్యాంకుల నుండి పొందిన రుణాలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘల సమావేశాలు నిర్వహించి రుణాల నిర్వహిణ, అప్పులు తదితరు వాటిపై అవగాహన కల్పించాలని అ న్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్ అదనపు డిఆర్‌డిఓ సరోజ మహిళ సంఘం జిలా అద్య క్షురాలు అలవేలు, డిసిఎం వీరయ్య పాల్గోన్నారు.

## తాండూరులో ఇఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

సిసిఐ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డికి వినతి



ప్రజాపక్షం/తాండూరు : సిసిఐ సిమెంట్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తాండూరులో ఇఎస్ఐ ఐసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తాండూరు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డికి సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రాన్ని అందజేశారు. శనివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సిసిఐ కాంట్రాక్టర్ ఎంప్లాయ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. శరణప్పల ఆధ్వర్యాన ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి కలిసి సిసిఐ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంటనే తాండూరులో ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, మిగిత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూవిటీ, పదోన్నతి, పదవీ విరమణ పొందిన తదితర కార్మికులు 20మంది వరకు ఉన్నారని వారికి న్యాయం చేయాలని, యాజమాన్యం కార్మికుల సం ఘ నాయకులతో చర్చ జరిపించి సమస్యలపైన వెంటనే స్పందించాలని కోరారు. ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి వెంటనే సిసిఐ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారానికి సిసిఐ యాజమాన్యంతో చర్చిస్తానని తెలిపారు.

## ప్రమాదాల నివారణపై శిక్షణ




ప్రజాపక్షం/చర్లపల్లి : కెమికల్స్,పెట్రో కెమికల్స్ పరిశ్రమలలో ప్రమాదా లను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసు కుంటాన్నాయని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల రావు అన్నారు. శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిపార్ట్‌మెంట్ అఫ్ కెమికల్ పెట్రో కెమికల్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ అప్ పెట్రో కెమికల్ ఇంజనీ రింగ్ టెక్నా టజీ(సిపెట్)లో మేజర్ కెమికల్స్,పెట్రో కెమికల్ పరిశ్రమలకు భద్రతపై శుక్రవారం,శనివారం రెండు రోజుల పాటు సెమినార్ నిర్వహించారు. ఇందులో ఐఐసిటి, ఎన్ ఎఫ్‌సి,హెచ్‌సియు, టిజిపిసిబి,అరబిందో ఫార్మా, హెటెరో గ్రూప్ వంటి 64 మేజర్ పరిశ్రమలకు చెందిన 134మంది ప్రతి నిధులు పాల్గొని ప్రమాదాల నివారణపై ప్రసగించారు.ఈ కార్యక్రమం లో బాల్క్ డగ్స్ అసోసియేషన్ అఫ్ ఇండి యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోజరాణి, సిపెట్‌హెడ్ డైరెక్టర్ విశాల్‌వర్మ, చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగాలి : మాజీ ఎమ్మెల్యే ఆనంద్



ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ : ప్రతి ఒక్కరిని కలుపుకుని పోవాలాని మాజీ ఎమ్మెల్యే అనంద్ అన్నారు. వికారాబాద్ మండలానికి బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు వికారాబాద్ మండల జనరల్ సెక్రటరీగా శివకుమార్ మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులుగా సిద్దులుర్ శీను, మండల బిసిసెల్ అధ్యక్షులుగా మల్లేశం యాదవ్, యుత్ జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్‌గౌడ్‌లను, జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యేఅనంద్ నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పార్టీలోని పెద్దల సలహాలతో అందరిని కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. అదే విధంగా మండలంలో పార్టీ బలోపేతనికి కృషి చేయాలని,వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సంఘం అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, పడిగల్ల ఆశోక్, మండల మైనార్టీ అధ్యక్షులు గాయజ్, ఉపేందర్‌రెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



ప్రజాపక్షం/మోమిన్‌పేట్ : వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని మోరంగపల్లి గ్రామంలో చేవెళ్ల ఎంపి కొండా విశేశ్వర్‌రెడ్డి సహకరంతో రూ.10 లక్షల నిధులు మంజురుతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్య క్షులు కోకట్ మాధవరెడ్డి, బిజెపి రాష్ట కార్యవర్గ సభ్యులు శివరాజ్ , వికా రాబాద్ నియోజకవర్గం పార్టీ కోఆర్డినేటర్‌జిల్లా దిశాకమిటీ మెంబర్ వడ్ల నందు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## నేడు భారత్, పాక్ మ్యాచ్

# టీమిండియా జర జాగ్రత్త..

ఛాంపియన్స్ ట్రోఫీలో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. నేడు (ఫిబ్రవరి 23)న దుబాయ్ వేదికగా ఈ హైఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. బంగ్లాదేశ్‌ను ఓడించి జోరుమీదున్న టీమ్‌ఇండియా.. నేడు జరగబోయే మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను మట్టికరిపించి 2017 ఫైనల్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. అయితే, ఈ మ్యాచ్ పాకిస్థాన్‌కు చావోరేవో లాంటిది. న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసిన పాక్.. మిగిలిన రెండు మ్యాచ్‌లు (భారత్‌తో, బంగ్లాదేశ్‌తో) గెలిస్తేనే సెమీస్ చేరే అవకాశముంటుంది. టీమ్‌ఇండియాతో జరిగే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడితే ఆ జట్టు సెమీస్ చేరదు.

దీంతో భారత్‌తో జరిగే మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సెమీస్ రేసులో ఉండాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియాతో మ్యాచ్ కోసం 'స్పెషల్ కోచ్'ను నియమించుకుంది. ప్రస్తుతం తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఉన్న సెలక్టర్ అకిబ్ జావేద్ టీమ్‌ఇండియాతో మ్యాచ్ కోసం జట్టును సిద్ధం చేయడంలో సహకరించేందుకు మాజీ సహచరుడు ముదస్సర్ నాజర్ సహాయాన్ని తీసుకుంటున్నాడు. ముదస్సర్‌కు యూఏఈ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. అతను కొన్నాళ్లుగా దుబాయ్ ఉంటూ ఐసీసీ గ్లోబల్ అకాడమీలో పనిచేస్తున్నాడు. అకిబ్ జావేద్ విజ్ఞప్తి మేరకు ముదస్సర్ శుక్రవారం పాకిస్థాన్ జట్టుతో కలిశాడు. నెట్ సెషన్స్‌లో పాల్గొని ఆటగాళ్లకు సూచనలిస్తున్నాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అయిన నాజర్ (1993 2001) మధ్య పలుమార్లు పాక్ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు. తర్వాత కెన్యా, యూఏఈ టీమ్‌లకు కూడా కోచ్‌గా వ్యవహరించాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన ముదస్సర్ 76 టెస్టులు ఆడి 4,114 పరుగులు, 122 వన్డేల్లో 2,653 పరుగులు చేశాడు.

## చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా

### ఇంగ్లాండ్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు

351 ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇదే రికార్డు స్కోరు అనుకుంటే, ఇంగ్లాండ్ సాధించిన ఈ కళ్లు చెదిరే స్కోర్‌నే ఛేజ్ చేసి 356 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసింది ఆస్ట్రేలియా. ఈ రెండు భారీ స్కోర్లు కూడా తాజాగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్ లోనే నమోదు కావడం విశేషం. పైగా ఈ రెండిటితో పాటు రెండు అద్భుతమైన సెంచరీలు, ఓ అత్యధిక పరుగుల రికార్డు కూడా ఈ మ్యాచ్ లోనే ఆటగాళ్లు సాధించడం మరో విశేషం. ఫైనల్ గా ఈ మ్యాచ్ లో 5 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది ఆస్ట్రేలియా. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే ఇది రికార్డు విజయం. ఈ విజయంలో 8 ఫోర్లు, 6 సిక్స్ ల సాయంతో 120* పరుగులు చేసిన ఇంగ్లీష్ కీలక పాత్ర పోషించాడు.

### ఇంగ్లిస్ అదిరే శతకం..

351 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు 47.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మొత్తంగా 356 పరుగులు చేసింది. మ్యాథ్యూ షార్ట్ (66 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో 63 పరుగులు), మార్నస్ లబుషేన్(45 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 47 పరుగులు), జోష్ ఇంగ్లిస్ (86 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌ల సాయంతో 120*), అలెక్స్ క్యారీ (63 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 69 పరుగులు) అద్భుతంగా రాణించారు. చివర్లో గ్లెన్ మ్యాక్స్ వెల్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌ల సాయంతో 32 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మార్క్ వుడ్ జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్సే, ఆదిల్ రషీద్, లియామ్ లివింగ్ స్టన్ తలో వికెట్ దక్కించుకున్నారు.

ఐసీసీ వన్డే ఈవెంట్స్‌లో హైయెస్ట్ సక్సెస్ ఫుల్ ఛేజ్ ఇదే(356)

ఆస్ట్రేలియా చేసిన రెండో అతిపెద్ద ఛేజ్ ఇదే

ఇంగ్లాండ్‌పై ఇదే అత్యధిక సక్సెస్ ఫుల్ ఛేజ్

పాకిస్థాన్ గడ్డపై రెండో అత్యధిక సక్సెస్ ఫుల్ ఛేజ్



### బెన్ డకెట్ భారీ శతకం

అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 351 పరుగులు సాధించింది. ఓపెనర్ బెన్ డకెట్ (165; 143 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకంతో మెరిశాడు. జో రూట్ (68; 78 బంతుల్లో 4 ఫోర్లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

## ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మ్యాచ్‌లో 'జనగణమన'

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా శనివారం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మ్యాచ్ జరుగుతోంది. ఆసీస్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. అయితే, మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియా జాతీయ గీతానికి బదులు పొరపాటున భారత జాతీయ గీతాన్ని కొన్ని సెకన్లపాటు ప్లే చేశారు. దీంతో ఆసీస్ ప్లేయర్లు, స్టేడియంలో ఉన్న అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో వెంటనే గడాఫీ స్టేడియం నిర్వాహకులు అప్రమత్తమైన జనగణమనను ఆపేశారు. తర్వాత ఆస్ట్రేలియా జాతీయ గీతాన్ని ప్లే చేశారు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా టీమ్‌ఇండియాను పాక్‌కు పంపడానికి భారత్ నిరాకరించింది. దీంతో భారత్ ఆడే మ్యాచ్‌లను యూఏఈలోని దుబాయ్‌లో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు.

# రీల్

## 'రెడీ బాయ్స్' అంటూ లాఠీతో వస్తున్న అర్జున్‌సర్కార్



న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'హిట్3' ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను 'హిట్' చిత్రాల ఫ్రాంచైజీలో మూడో పార్ట్‌గా తెరకెక్కిస్తున్నాడు. ఇక అర్జున్ సర్కార్ అనే రుత్‌లెస్ కాప్‌గా నాని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా నుంచి టీజర్‌ను నాని పుట్టినరోజు కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ టీజర్‌తోనే సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పీక్స్‌కు తీసుకెళ్లేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. దానికి తగ్గట్టుగానే ఈ టీజర్‌పై అభిమానుల్లో ఆసక్తిని క్రియేట్ చేస్తున్నారు. ఫిబ్రవరి 24న రిలీజ్ చేయనున్న ఈ టీజర్ కోసం అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఇక తాజాగా ఈ టీజర్‌పై మరింత ఆసక్తిని పెంచేలా 'రెడీ బాయ్స్' అంటూ నాని ఓ లాఠీ పట్టుకుని చెప్పే డైలాగ్ వీడియోను వదిలారు. 'రక్తపాతం సృష్టించేందుకు అర్జున్ సర్కార్ సిద్ధం..' అంటూ హిట్3 మేకర్స్ ఈ టీజర్‌పై అంచనాలను పెంచుతున్నారు. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మే 1న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది.

## 'ఛావా'పై మోదీ ప్రశంసలు..

### విక్కీ కౌశల్ ఆనందం



విక్కీకౌశల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఛావా'పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా విక్కీ కౌశల్ ఆనందం వ్యక్తంచేశారు. తమ చిత్రాన్ని ప్రశంసించిన ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు. సంతోషంతో మాటలు రావడం లేదని తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ''ఒక చారిత్రక గౌరవం. గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ ఛావాను ప్రశంసించడం, ఛత్రపతి శంభాజీ మహరాజ్ త్యాగాన్ని కీర్తించడం గర్వించదగిన గొప్ప క్షణం'' అని పేర్కొన్నారు. 98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఛావా' చిత్రాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ''హిందీ సినిమాతో పాటు మరాఠీ చిత్రాల స్థాయిని పెంచడంలో మహారాష్ట్ర, ముంబయి కీలకపాత్ర పోషించింది. కొత్త సినిమా 'ఛావా' ప్రస్తుతం అంతటా ఆదరణ సొంతం చేసుకుంది. శివాజీ సావంత్ మరాఠీ నవల వల్లే ఈ శంభాజీ మహరాజ్ వీరత్వాన్ని చిత్ర రూపంలో పరిచయం చేయడం సాధ్యమైంది'' అని అన్నారు. విక్కీ కౌశల్ యాక్టింగ్‌కు సినీ ప్రముఖులు సైతం ఫిదా అవుతున్నారు. విక్కీ అద్భుతంగా నటించారంటూ ప్రశంసిస్తున్నారు. విడుదలైన తొలి వారంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా వసూలుచేసినట్లు విశ్లేషకుల అంచనా.

## 'ఓదెల 2' టీజర్ విడుదల



తమన్నా ప్రధాన పాత్రధారిగా అశోక్‌తేజ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఓదెల 2'. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంపత్ నంది టీమ్ వర్క్స్‌తో కలిసి మధు క్రియేషన్స్ పతాకంపై డి.మధు నిర్మిస్తున్నారు. తాజాగా ఈసినిమా టీజర్‌ను చిత్రబృందం మహా కుంభమేళాలో విడుదల చేసింది. శివశక్తిగా తమన్నా నటన ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా సాగింది. ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలతో టీజర్ ఆద్యంతం అలరించేలా ఉంది. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి కొనసాగింపుగా ఈ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే.

## ఆమెలా ఎవరినీ విమర్శించను

### కంగనా సోదరి వ్యాఖ్యలను తిప్పికొట్టిన తాప్సీ



విమర్శలపై తనదైన శైలిలో స్పందించడంలో నటి తాప్సీ ఎప్పుడూ ముందుంటారు. గతంలో తనని ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేసిన నటి కంగనా రనౌత్ సోదరి రంగోలీని ఉద్దేశించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. అలాంటి కామెంట్స్‌ను తాను పెద్దగా పట్టించుకోనని అన్నారు. మన మాటలే మన వ్యక్తిత్వానికి అద్దం పడతాయని తెలిపారు. రంగోలీ మాట్లాడిన విధంగా తాను ఎవరినీ విమర్శించనని చెప్పారు. ''నేను కంగనను కాపీ కొడుతున్నానని గతంలో ఆమె అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆమెను అదేవిధంగా అనుకోనివ్వండి. అందులో ఎలాంటి ఇబ్బందీ లేదు. కంగనకు వచ్చినంత పారితోషికం కూడా నాకు రావడం లేదు. కంగన ఎంతో టాలెంట్ కలిగిన నటి. అలాంటి ఆమెను నేను కాపీ కొట్టానని అంటే నేను సంతోషంగా స్వీకరిస్తాను. మనిషి ఎదుగుదల, అతని వ్యక్తిత్వాన్ని మాటలే నిర్ణయిస్తాయి. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వతహాగా తన కెరీర్‌లో రాణిస్తోన్న ఒక మహిళను ఉద్దేశించి ఆమె మాదిరిగా నేను విమర్శలు చేయను'' అని తాప్సీ అన్నారు.



# సలీమాకు వైద్య సహాయం

### దివ్యాంగుల పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సలీమాకు తగిన వైద్య సహాయం అందించడంతో పాటు దివ్యాంగుల పింఛన్‌ను, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలిన గాయాలతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన సలీమాను ఆదుకోవాలన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన సలీమాదీన స్థితి పట్ల ఒక పత్రికలో వచ్చిన కథనంపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వంట చేసుకుని తినే పరిస్థితి లేకపోవడంతో ఆమెకు భోజన సదుపాయాన్ని కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సిఎం ఒఎస్‌డి వేముల శ్రీనివాసులు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. కాలిన గాయాల కారణంగా సలీమా నరాలు దెబ్బతినడంతో ఆమె మంచానికే పరిమితమయ్యారు. దీంతో సలీమాకు ఆమె పదేళ్ల కుమార్తె రిజ్వాన సపర్యలు చేస్తోంది. ఒక వైపు తల్లి బాధ్యతలు చూసుకుంటూనే మరోవైపు బడికి వెళ్లి చదువుకుంటుంది.

# బిఆర్‌ఎస్.. బిజెపి లోపాయికారీ ఒప్పందం

### దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నప్పటికి రాష్ట్రానికి ఒరిగింది ఏమిలేదని.. తెలంగాణకు గుండు సున్నా తెచ్చారని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి కుమ్మక్కై ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పోటీ పెట్టలేదన్నారు. బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి గెలిపిస్తే కొత్తగా ఒరిగేది ఏమిలేదని.. పేద ప్రజల ఇబ్బందులు తెలిసిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులకు కొండాసురేఖ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి సిద్దిపేట శక్తి గార్డెన్‌లో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ ఇటీవల ఫాంహౌజ్ నుండి బయటకు వస్తున్నానని మాట్లాడరని కాని వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులే కరువైనారని విమర్శించారు. ఎంపి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ క్రాస్ ఓటింగ్ చేసి బిజెపి అభ్యర్థులను గెలిపించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం బిఆర్‌ఎస్ క్రాస్ ఓటింగ్ చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పట్టభద్రులు ఆలోచించి విద్యావేత నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. రఘునందన్‌రావు ఎంపి ఎన్నికల సమయంలో తాను గెలిస్తే కేంద్రం నుండి పెద్దఎత్తున నిధులు తెస్తానని చెప్పారని ఇంతవరకు ఒక్క పైసా కూడా తేలేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రం గురించి పట్టించుకోరన్నారు. బండి సంజయ్ గతంలో బిఆర్‌ఎస్ నేతలను పట్టుబట్టి తిట్టేవారని. ఇప్పుడు బండి సంజయ్ నోరు మూగపోయిందన్నారు. బిఆర్‌ఎస్, బిజెపిల మధ్య ఉన్న అనుబంధం ఏంటని ప్రశ్నించారు. సిట్టింగ్ స్థానమైన కరీంనగర్ నియోజక వర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీని నిలబెట్టుకుంటామన్నారు. పిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఒకే సంవత్సరంలో 56 వేల ఉద్యోగాలు ఇచ్చారని. ఐదు ఏండ్లలో 2లక్షలకు పైగా ఉద్యోగాలు ఇస్తారన్నారు. ఎస్సి వర్గీకరణతోపాటు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్ట భద్రత కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కెసిఆర్ కాకకు అభ్యర్థులే కరువైనారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో సిద్దిపేటను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి యువత, గురించి ఆలోచించి వ్యక్తి అన్నారు. మాజీ ఎంఎల్‌ఎ మైనంపల్లి హన్మంత్‌రావు మాట్లాడుతూ ట్రాక్ రికార్డును చూసి ఓటేయ్యాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 70 నుండి 80 శాతం అమరులైనారన్నారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శిమంద పవన్ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంఎల్‌సి అభ్యర్థినరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ప్రైవేటు టీచర్లకు మంత్రి వేతనంతో పాటు, 3లక్షల బీమా చేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఇంచార్జి పూజల హరికృష్ణ,జిల్లా ప్రతినిధుల చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మంద పవన్, శివచరణ్‌రెడ్డి, సైదులు, సూర్య వర్మ, ఆకాంక్షరెడ్డి, రియాజ్, ఎల్లం, సాకి ఆనంద్, మహేందర్, అత్తు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## 19న మళ్లీ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రహ్లాద్ జోషి, పీయూశ్ గోయల్ ప్రభుత్వం తరపున హాజరుకాగా, 28మంది సభ్యులుగల ప్రతినిధిబృందం రైతుల తరపున హాజరైంది. చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ ప్రభుత్వ పాలనా సంస్థలో ఈ చర్చలు జరిగాయి. నరేంద్రమోదీ ప్రభుత్వంలో ప్రాధాన్యమిస్తున్న రైతుల సంక్షేమ కార్యక్రమాలను కేంద్రబృందం రైతు ప్రతినిధులకు చెప్పిందని చౌహాన్ అన్నారు. మీడియా ప్రశ్నలను ఆయన పట్టించుకోలేదు. పంజాబ్ రాష్ట్ర మంత్రులు హర్‌పాల్‌సింగ్ చీమా, గుర్మీత్‌సింగ్ ఖుద్దియన్, లాల్‌చంద్ కతరుచక్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆరో విడత చర్చలు సానుకూల ఫలితాలనిస్తాయని, దీర్ఘకాలంగా దేశవ్యాప్తంగా వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలకు చాలా మేరకు ఊరట లభిస్తుందని రైతు నాయకులు తొలుత ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికి ఆరు విడతలుగా చర్చలు జరిగినప్పటికీ విషయం కొలిక్కిరాలేదు. ఎంఎస్‌పి చట్టబద్ధతతోపాటు రైతు రుణాలు రద్దుచేయాలని, రైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని, విద్యుత్ సుంకాలను పెంచవద్దని, రైతులపై బనాయించిన కేసులను ఉపసంహరించాలని, 2021లో ఉత్తరప్రదేశ్ లఖింపూర్ ఖేరీలో మంత్రికారుచేసిన దాడిలో మరణించిన బాధిత రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని రైతుసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. 2013 నాటి భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని, 2020–21లో జరిగిన పోరాటంలో మరణించిన రైతుల కుటుంఆలకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది నవంబరు 26 నుండీ పంజాబ్–హర్యానా సరిహద్దుల్లో జగజిత్‌సింగ్ డల్లేవాల్ రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేయడంతో తదనంతర పరిణామాల ఫలితంగా ఈ చర్చలు అనివార్యమయ్యాయి. రైతు ప్రతినిధి బృందంలో డల్లేవాల్, స్వరణ్‌సింగ్ పంధేర్ అందరికంటే ముందుగానే చర్చల ప్రాంగణానికి చేరుకున్నారు. చర్చలకు ముందు మరో నాయకుడు కాకాసింగ్ కోత్రా మాట్లాడుతూ, ఈ సమావేశంలో తమ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాలు చాలా సానుకూల దృక్పథంతో ఈ సమావేశంలో పాల్గొన్నాయని మరో రైతుసంఘ నాయకుడు స్వరణ్‌సింగ్ పంధేర్ అన్నారు. తదుపరి సమావేశాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని రైతులు కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ సమావేశాన్ని చండీగఢ్ లోనే నిర్వహించింది. ఈరోజు ఆరో విడత చర్చలు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో జరిగాయి. సమస్యల పరిష్కారంకోసం ఏడాది కాలంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. ఫిబ్రవరి 19న కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి పూర్ణచంద్రకిషన్ రైతు నాయకులు డల్లేవాల్, పాంధేర్‌లకు ఒక లేఖరాస్తూ, 'ఎస్‌కెఎం (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకులతో ఇంతకుముందు చండీగఢ్‌లో ఫిబ్రవరి 14న జరిగిన చర్చలకు ఈ లేఖ కొనసాగింపు. రైతు నాయకులు చేసిన డిమాండ్ మేరకు ఫిబ్రవరి 22న చండీగఢ్‌లో కేంద్రమంత్రులతో, పంజాబ్‌లో ఒక సమావేశం పెడుతున్నాం, హృదయపూర్వకంగా మీకు ఆహ్వానం పలుకుతున్నాం' అని పేర్కొన్నారు. ఆ మేరకే ఈ సమావేశం జరిగింది. 14న జరిగిన సమావేశం తర్వాత కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, ఈ చర్చల్లో కేంద్ర బృందానికి వ్యవసాయ శాఖామంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నాయకత్వం వహిస్తారని చెప్పారు.

## గురుకుల విద్యాలయాలలో అడ్మీషన్లకు నేడు ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అని గురుకుల విద్యాలయాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతిలో అడ్మీషన్ నిమిత్తం ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ హాజరు కావాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. 5వ తరగతిలో 51,880 సీట్లు ఉండగా, 89,246 మంది విద్యార్థులు, అలాగే 6వ తరగతిలో 2271 సీట్లకు గాను 20,088 మంది, 7వ తరగతిలో 1034 సీట్లు ఉండగా 19,108 మంది, 8వ తరగతిలో 1006 సీట్లు ఉండగా 15,746 మంది. 9వ తరగతిలో 1150 సీట్లు ఉండగా 11,983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి పొన్నం వివరించారు. కార్పోరేట్ పాఠశాలల కంటే మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. గురుకులాలలో అన్నీ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని, సిఎం రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన వివరించారు. ప్రవేశపరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## హింసా ప్రవృత్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రేమ ఎదుటి వారి క్షేమాన్ని కోరుకుంటుందని అంటున్నారు. ఎక్కడ ఉన్నా ఏమై పోయినా నీ సుఖం కోరుకున్న అనే రోజులు పోయి నాకు దక్కనిది ఎవరికి దక్కకూడదన్న ఆలోచనతో హింసా ప్రవృత్తి చోటు చేసుకుంటుంది. ఆ క్రమంలోనే యాసిడ్ దాడులు, హత్యలు చోటు చేసుకుంటున్నాయి. సహనం మానవ జీవితం నుండి క్రమేపి తప్పుకుంటూ పగ, ప్రతీకారం దిన దిన ప్రవర్థమానమవుతుంది. క్షమించడం అన్న పదానికి స్థానం లేకుండాపోతుంది. ఏదో జరిగిపోయిందనుకుని సర్దుకుపోదామనే భావన లేకుండాపోతుంది. మొత్తంగా మనిషి ఆహార్యం అలవాట్లలోనే కాదు ఆలోచనలోనూ మార్పు వస్తుంది. కష్టమొచ్చినా, సంతోషమొచ్చినా రెండింటికి మద్యం సేవించడమే మందు అనుకుంటున్నాడు. అన్ని కలగలిసి మనలోని మనిషి మాయమైపోతున్నాడు. సమాజ మార్పు, చైతన్యం, సంక్షేమం వీటితో పాటే మాయమైపోతున్న మనిషిని మళ్లీ బతికించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మానవీయ కోణంతో దూరమవుతున్న మానవ సంబంధాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు ప్రారంభం కావాలి. లేకపోతే ఈ సమాజాన్ని మరో కోణంలో చూడాల్సి ఉంది. తస్మాత్ జాగ్రత్త.

## కేంద్రమంత్రి చౌహాన్ మండిపాటు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని సహచర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. దీనిపై ఎయిర్ ఇండియా మంత్రికి క్షమాపణలు తెలిపి, పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. కాగా ఈ సంఘటనపై నివేదిక అందజేయాలని డిజిసిఎ ఎయిర్ ఇండియాను కోరింది. అనంతరం మంత్రి తన అనుభవాన్ని వెల్లడిస్తూ ఇతర ప్రయాణికులకు ఇటువంటి చేదు అనుభవం ఎదురు కాకూడదనే తాను ఈ విషయాన్ని ఎయిర్‌లైన్స్ సంస్థ దృష్టి తెచ్చినట్టు వెల్లడించారు. చౌహాన్ ఎక్స్ వేదికగా తన అనుభవాన్ని ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రయాణికులనుంచి అధిక ధరలు వసూలు చేస్తూ సౌకర్యంగా లేని సీట్లను కేటాయించడం అనైతికమైన చర్యగా పేర్కొన్నారు. పుసాలో జరిగే ఒక రైతుల సదస్సుకు హాజరయ్యేంకు భోపాల్‌లో ఢిల్లీకి వెళ్లే ఎయిర్ ఇండియాకు చెందిన ఎ1436 విమానం ఎక్కానని, తనకు విరిగిపోయిన 8సి సీటును కేటాయించారన్నారు. సీటులో కూర్చోగానే ఎంతో అసౌకర్యంగా అనిపించిందని, వెంటనే దీనిని మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఆ విమానంలో పలు సీట్లు అదే స్థితిలో ఉన్నాయని మంత్రి ఆరోపించారు. తోటి ప్రయాణికులు వేరే సీటుకు మారాలని సూచించినా, ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని అదే సీటులో కూర్చుని ప్రయాణం చేసినట్టు చౌహాన్ తెలిపారు. టాటా గ్రూపు ఎయిరిండియాను సొంతం చేసుకున్న తరువాత సేవలు మెరుగవుతాయని భావించానని, కానీ తన అంచనా తప్పని తేలిందని అన్నారు. తన అసౌకర్యంపై చింతించడం లేదని, కానీ పూర్తి స్థాయి ఛార్జీలు వసూలు చేసిని ఎయిర్‌లైన్స్ సంస్థ ఇటువంటి సీట్లను కేటాయించడం అనైతికమన్నారు. ఇది ప్రయాణికులను మోసగించడం కాదా? అని ప్రశ్నించారు. ఇకపై అత్యవసరంగా ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సీట్లు కేటాయించేలా ఎయిర్ ఇండియా సంస్థ చర్యలు తీసుకుంటుందో లేదో తెలపాలన్నారు. అనంతరం చౌహాన్ కురుక్షేత్రలో జరిగే రైతు సదస్సుకు బయలుదేరి వెళ్లారు. అక్కడకు చేరుకున్న అనంతరం చౌహాన్ విలేకరులతో మాట్లాడుతూ 'ఏదైనా తప్పు జరిగనప్పుడు దానిగురించి ఒక్క మాటకూడా మాట్లాడకపోవడం ఒక మార్గం. అయితే నావంటి అనుభవం ఇతరులకు జరుగకూడదనే ఈ విషయాన్ని ఎయిర్‌లైన్స్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాను. డబ్బులు తీసుకున్నపుడు సరైన సేవలు అందించడం వారి కనీస బాధ్యత' అని అన్నారు. సామాజిక మాధ్యమంలో చౌహాన్ పోస్ట్ చూసిన వెంటనే పౌర విమానయాన శాఖ మంత్రి వెంటనే చర్యకు ఆదేశించారని ఆ శాఖ కార్యాలయం వెల్లడించింది. 'మేము ఎయిరిండియా సంస్థతో మాట్లాడాము. సంఘటనపై తగు చర్యలు తీసుకోవాలని కోరాము. మా తరపున డిజిసిఎ కూడా పూర్తి వివరాలను సేకరిస్తున్నది. నేను శివరాజ్ చౌహాన్‌తో స్వయంగా మాట్లాడాను' అని రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో వెల్లడించారు. చౌహాన్ ఎక్స్‌లో తన అసహనాన్ని వెల్లడించగానే ఎయిరిండియా క్షమాపణలు తెలిపింది. అసౌకర్యానికి చింతిస్తున్నామని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నట్టు వెల్లడించింది. ఇకపై ఇటువంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్త వహిస్తామని, తమ తప్పును సరిదిద్దుకుంటామని ఎయిరిండియా తెలిపింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com